PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 57 | విజయవాడ, బుధవారం 27 సెప్టెంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Wednesday 27 September 2023 | Rs

నిర్బంధంపై వెల్లువెత్తిన నిరసనలు

- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు
- పలు జిల్లాల్లో నాయకుల గృహనిర్బంధం, అరెస్టులు

3

41 ఏళ్ల తర్వాత...

ఈక్వెస్ట్రియన్‌లో స్వర్ణం

6

డ్రస్సేజ్ విభాగంలో సుదీప్తి, హృదయ్, అనూష్, దివ్యకృతికి పసిడి

ఇక గేర్ మారుస్తాం....!

- ఆ అవసరం వచ్చింది
- ఈ ఆరు నెలలూ ప్రజల మధ్యే వుండాలి
- టికెట్ రాని వారికి ప్రత్యామ్నాయం చూపుతా
- వైసిపి నేతలకు సిఎం జగన్ దిశానిర్దేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'ఇప్పటివరకు మనం చేసిన కార్యక్రమాలు ఒక ఎత్తు. ఇక నుండి మరో ఎత్తు. మనం గేర్ మార్చాలి. ఆ అవసరం వచ్చింది.' అని రాష్ట్ర ముఖ్యమంత్రి. వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కోఆర్డినేటర్లు, పార్టీ రీజినల్ ఇన్‌ఛార్జులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఆరు నెలలు చాలా ముఖ్యం. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలి. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి.' అని అన్నారు. ' మనమంతా ఒక కుటుంబంలోని సభ్యులమేననేది విస్మరించవద్దు. కొంతమందికి టిక్కెట్ ఇవ్వలేకపోవచ్చు. టికెట్ ఇవ్వనంత మాత్రాన వాళ్లు నా వాళ్లు కాకుండాపోరు. టికెట్ రాని వారికి ప్రత్యామ్నాయంగా మరో అవకాశం చూపుతా' అని చెప్పారు. నాయకుల పనితీరుపై సర్వేలు కూడా తుది దశలోకి వస్తున్నాయని, చివరి దశ సర్వేలు కూడా జరుగుతాయన్నారు. ప్రజల్లో ఎక్కువగా ఉంటే మంచి ఫలితాలు వస్తాయని, ప్రతి ఒక్కరూ ప్రజలతో మమేకమై పనిచేయాలన్నారు రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో 175కు 175 సీట్లు గెలవాలనే లక్ష్యంతో పార్టీశ్రేణులు ఉండాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఒంటరిగా పోటీ చేయలేక ప్రతిపక్షాలు పొత్తులకు వెళ్తున్నాయని అన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో విభేదాలు రాకుండా చూసుకోవాలన్నారు. వచ్చే నెలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం, వై ఎపి నీడ్స్ జగన్ అనే కార్యక్రమం చేపడతామని అన్నారు.

వహీదా రెహ్మాన్‌కు దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం!

ముంబయి : ప్రఖ్యాత సినీ నటీమణి వహీదా రెహ్మాన్‌ను భారత అత్యున్నత చలనచిత్ర పురస్కారమైన దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు వరించింది. కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అనురాగ్ థాకూర్ మంగళవారం ఈ విషయాన్ని ప్రకటించారు. 'ఏరువాక సాగారో రన్నో చిన్నన్న..నీ కష్టమంత తీరునురో రన్నో చిన్నన్న..' అంటూ 1955లో 'రోజులు మారాయి' తెలుగు చిత్రం ద్వారా అరంగేట్రం చేసిన వహీదా రెహమాన్ అంచెలంచెలుగా రాణిస్తూ దేశం గర్వించే నటిగా ఎదిగారు. గైడ్, ప్యాసా, కాగజ్ కే పూల్ వంటి అనేక చిత్రరాజాల్లో నటించి మెప్పించి సినీ చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని పదిలపర్చుకున్నారు. జాతీయ ఉత్తమ నటితో సహా అనేక చలనచిత్ర పురస్కారాలతో పాటు దేశ 3వ, 4వ అత్యున్నన పౌర పురస్కారాలైన పద్మశ్రీ, పద్మభూషణ్ ఆమె ఇప్పటికే అందుకున్నారు.

(ప్రత్యేక కథనం సినిమా పేజీలో..)

ఆలయ భూములను కాజేసిన బిజెపి ఎమ్మెల్యేలు

- కామచ్చి అమ్మన్ ఆలయ పరిధిలో అక్రమాలు
- ఆలయానికి అప్పగించాలని మద్రాస్ హైకోర్టు ఆదేశం

న్యాయమూర్తుల ఎంపికపై నాన్చుడు ఎందుకు?

- కేంద్ర నిర్లక్ష్య ధోరణితో ప్రతిభావంతులు దూరం
- మోడీ సర్కార్‌కు తలంటిన సుప్రీంకోర్టు

5

బిజెపి అడుగుల్లోనే...

వైసిపి, టిడిపిపై సిపిఎం విమర్శ

- చంద్రబాబుపై కేసు కేంద్రానికి తెలియకుండా జరిగింది కాదు
- రాజకీయ లబ్ధికోసమే మహిళా బిల్లు
- రాష్ట్రపతిని పదేపదే అవమానిస్తున్న ప్రధాని, ఆర్‌ఎస్‌ఎస్
- ఎన్నికలు సమీపించే కొద్దీ మత వైషమ్యాలు
- విలేకరుల సమావేశంలో ఎంఎ బేబీ, బి.వి రాఘవులు

మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎ బేబీ, బివి రాఘవులు, చిత్రంలో వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి, టిడిపి కేంద్రంలో బిజెపికి మద్దతు ఇస్తున్నాయని, ఇది దురదృష్టకర పరిణామమని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి, బివి రాఘవులు అన్నారు. విజయవాడ బాలోత్సవ్ భవన్లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావుతో కలిసి వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌డిఎలో ఉన్న అనేక పార్టీలు బయటకు వస్తున్నాయని, అయినా, ఈ రెండు పార్టీలూ కళ్లు తెరవడం లేదన్నారు. బి.వి.రాఘవులు మాట్లాడుతూ మహిళా బిల్లుకు ప్రతిపక్షాలు గత్యంతరం లేక మద్దతు ఇచ్చాయని, స్వతహాగా ఇష్టం లేదని ప్రధాని మోడీ అన్నారని, వాస్తవానికి గతంలో మహిళా బిల్లును పెడుతున్న సమయంలో ఇదే బిజెపి ఆసక్తి చూపలేదని చెప్పారు. ఇప్పుడు ఒకరిద్దరు తప్ప అందరూ ఆమోదిస్తే దాన్ని పార్లమెంటు విజయంగా చెప్పకుండా బిజెపి తన సొంత గొప్పతనంగా చెప్పుకోవడం అసహ్యంగా ఉందన్నారు. గత తొమ్మిదేళ్లుగా ప్రధానిగా ఉన్న మోడీ ఇప్పటి వరకూ ఎందుకు మహిళా బిల్లు పెట్టలేదని ప్రశ్నించారు. బిల్లు ఆమోదించినా 2029 నుండి అమలు చేయాలని చెప్పడం మోసం చేయడమేనన్నారు. నిజంగా అమలు చేయాలనుకుంటే ఇప్పటి నుండే అమలు చేయొచ్చని, కానీ బిజెపికి ఆ చిత్తశుద్ధి లేదన్నారు. 2029 నుండి అమల్లోకి వచ్చేటట్లయితే ఇప్పుడు బిల్లు పెట్టడం రాజకీయ లబ్ధికోసం తప్ప మరొకటి కాదన్నారు. బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో వెంటనే అమలు చేసేలా చూడాలని కోరారు. చట్టసభల్లో ఇప్పుడున్న సంఖ్యను 33 శాతం ప్రకారం విభజించి అమలు చేయొచ్చని సూచించారు. ఇటీవల జరిగిన ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో బిజెపి ఎంపి రమేష్ బిదూరి సహచర ఎంపి రమేష్‌డాలీపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన విషయాన్ని రాఘవులు ప్రస్తావించారు. డాలీపై టెర్రరిస్టుగా ముద్ర వేస్తూ, మతపరమైన అంశాలను ప్రస్తావించి అవమానించారని, పార్లమెంట్‌లో మాట్లాడకూడని పదాలు మాట్లాడారని అన్నారు. అయినా దానిపై క్షమాపణలు మిగతా 5లో

క్యూబా దౌత్య కార్యాలయంపై దాడికి సిపిఎం ఖండన

న్యూఢిల్లీ : అమెరికాలోని క్యూబా దౌత్య కార్యాలయ ఆవరణపై ఈ నెల 24న జరిగిన తీవ్రవాద దాడిని సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడనప్పటికీ, ఆస్తి నష్టమైతే చోటు చేసుకుందని పేర్కొంది.

2020 ఏప్రిల్‌లో మొదటిసారి క్యూబా దౌత్య కార్యాలయంపై దాడి జరిగింది. ఇది రెండవది. సోషలిస్టు క్యూబా పట్ల అమెరికా ప్రభుత్వ ఘర్షణాయుత వైఖరిని దృష్టిలో వుంచుకున్నట్లైతే, మూడేళ్ల తర్వాత కూడా ఆనాటి దాడికి కారకులైన వారిపై ఇంతవరకు ఎలాంటి విచారణ చేపట్టలేదు. దౌత్య సంబంధాలపై వియన్నా ఒప్పంద నిబంధనలకు అమెరికా ప్రభుత్వం కచ్చితంగా కట్టుబడి వుండాలని, వాటిని అమలు చేయాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. దాడికి పాల్పడిన వారిపై తక్షణమే, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

విద్యార్థులపై పోలీసుల జులుం

- విద్యారంగ సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు
- విజయనగరం, కడపలో అరెస్టులు

ప్రజాశక్తి-యంత్రాంగం

విద్యారంగ సమస్యలతో పాటు, వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరిన విద్యార్థులపై పోలీసులు జులుం ప్రదర్శించారు. ఆందోళన చేస్తున్న నాయకులను, విద్యార్థులను బలవంతంగా ఈడ్చుకెళ్లారు. అరెస్టులు చేసి స్టేషన్లకు తరలించారు. ఇంటర్ పాఠ్యపుస్తకాలు అందించాలని, మిడ్డే మీల్స్ నిర్వహించాలని, మెస్, కాస్మొటిక్ ఛార్జీలను విడుదల చేయాలని, జిఒ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం ధర్నాలు చేశారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద విద్యార్థులు ధర్నా నిర్వహించారు. అధికారులెవరూ స్పందించి బయటకు రాకపోవడంతో అక్కడే రోడ్డుపై బైఠాయించారు. ఆందోళన విరమించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి డి.రాముతో డిఎస్‌పి మాట్లాడారు. ఆందోళన విరమించేందుకు అంగీకరించకపోవడంతో రామును పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. చొక్కాను చించివేసి, బలవంతంగా ఈడ్చుకెళ్లి వ్యాన్‌లో ఎక్కించారు. విద్యార్థులంతా రాము అరెస్టును అడ్డుకున్నారు. పోలీసు వాహనానికి ఎదురుగా రోడ్డుపై బైఠాయించారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రామకృష్ణ, మరికొంత మంది విద్యార్థినులను సైతం పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లి అరెస్టు చేశారు. అయినా మిగతా 5లో

విజయనగరంలో విద్యార్థినులను బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

విద్యార్థులపై నిర్బంధం అన్యాయం

- ప్రభుత్వ తీరుకు సిపిఎం ఖండన

2

మణిపూర్‌లో విద్యార్థులపై లాఠీచార్జి

- 40 మందికి గాయాలు

ఇంఫాల్: మణిపూర్‌లో ఇంకా ఉద్రికత్త పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. మంగళవారం ఇంఫాల్‌లో విద్యార్థులపై పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించడం, లాఠీచార్జి చేయడంతో 40 మంది గాయపడ్డారు. రాష్ట్రంలో జులైలో గల్లంతైన ఇద్దరు యువకులు హత్యకు గురైనట్లు తాజాగా వెల్లడయింది. దీనికి నిరసనగా మంగళవారం విద్యార్థులు ఆందోళనకు దిగారు. వీరిపై పోలీసులు లాఠీచార్జికి దిగారు. మణిపూర్‌లో గతంలో చోటుచేసుకున్న దారుణాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. జులైలో అదృశ్యమైన ఇద్దరు విద్యార్థులు దారుణ హత్యకు గురయ్యారు. వీరి మృతదేహాల ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో రాష్ట్రంలో మరోసారి ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. హింసాకాండ నేపథ్యంలో విధించిన ఇంటర్నెట్ నిషేధాన్ని గతవారంలో ప్రభుత్వం ఎత్తివేసింది. ఈ క్రమంలోనే ఈ ఫొటోలు వైరల్‌గా మారాయి. ఇద్దరు విద్యార్థులను కొంతమంది సాయుధులు కిడ్నాప్ చేసి హత్య చేసినట్లు తెలుస్తోంది.

రాష్ట్రంలో ప్రతిపక్షాన్ని అణచివేసే కుట్ర

రాష్ట్రపతికి లోకేష్ ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించుకొని ప్రతిపక్షాన్ని అణచివేసేందుకు కుట్ర జరుగుతోందని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారు. అందులో భాగంగానే చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు పెట్టిన అరెస్టు చేశారని పేర్కొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో టిడిపి ఎంపిలతో కలిసి మంగళవారం ఆయన కలిశారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఫిర్యాదు చేయడంతోపాటు, స్కిల్ స్కామ్ కేసుకు సంబంధించి తమవద్ద ఉన సమాచారాన్ని అందచేశారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అధికార దుర్వినియోగం జరుగుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమ అరెస్టులతో ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు సాధిస్తోందని తెలిపారు. పోలీస్ యంత్రాంగాన్ని ఉపయోగించుకొని అక్రమ కేసులతో నిరంతరం తమ పార్టీ నాయకులను అరెస్టులు చేస్తున్నారని తెలిపారు. తమ పార్టీ కేంద్ర కార్యాలయంతో పాటు వివిధ చోట్ల తమ కార్యాల యాలపై దాడులు నిర్వహించారని వివరించారు. చంద్రబాబు అక్రమ అరెస్టుపై వెంటనే జోక్యం చేసుకోవాలని కోరుతూ ఎంపిలు కనకమేడల రవీంద్రకుమార్, గల్లా జయ దేవ్, కేశినేని నాని, కింజరపు రామ్మోహన్ నాయుడు మరో వినతిపత్రాన్ని రాష్ట్రపతికి అందజేశారు.

6 నెలల్లో జగన్‌కు రిటర్న్ గిఫ్ట్: లోకేష్

చంద్రబాబును అక్రమ అరెస్టు చేసి జగన్ తమకు గిఫ్ట్ ఇచ్చారని లోకేష్ విమర్శించారు.. ఆరు నెలల్లో జగన్‌కు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చే బాధ్యత వ్యక్తిగతంగా తానే తీసుకుంటానని చెప్పారు. రాష్ట్రపతితో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు, ఫైబర్ గ్రిడ్, స్కిల్ డెవలప్‌మెంట్ కేసులతో తనకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. రింగ్‌రోడ్డు లేకపోయినా కేసు ఎలా పెట్టారో అర్థం కావడం లేదన్నారు. రోజుకో వదంతి, తప్పుడు కేసులతో ప్రతిపక్షాన్ని వేధిస్తున్నారని తెలిపారు. యువగళం పాదయాత్ర ప్రారంభించేందు కు ప్రభుత్వానికి సమాచారం ఇచ్చి అనుమతులు కోరామన్నారు. వెంటనే తన పేరును రింగ్‌రోడ్డు కేసులో చేర్చారని చెప్పారు.

చంద్రబాబు కేసులో తీర్పు వాయిదా

2

మూడవ భాషగా సంస్కృతం

- మండలిలో మంత్రి బొత్స
- త్రిభాషలో సంస్కృతాన్ని ఎప్పుడు చేర్చారు? :పిడిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పాఠశాల విద్యలో మూడవ భాషగా సంస్కృతాన్ని ప్రవేశపెట్టినట్లు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. శాసన మండలిలో విద్యావ్యవస్థ బలోపేతంపై జరిగిన చర్చలో మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు తెలుగు, ఇంగ్లీషు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. మూడవ భాషగా సంస్కృతాన్ని ప్రవేశపెట్టినప్పటికీ, హిందీ కూడా కొనసాగుతుందని చెప్పారు. హిందీ, సంస్కృతాల్లో ఏదో ఒకదానిని మూడవ భాషగా విద్యార్థులు ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు.

సంస్కృతాన్ని థర్డ్ లాంగ్వేజిగా నిర్ణయిస్తూ సవరణ ఎప్పుడు జరిగిందో తెలవడం లేదని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంక టేశ్వరరావు, షేక్ సాబ్జి అన్నారు. మంగళవారం వారు మీడియా పాయింట్‌లో మాట్లాడారు. ఇంతవరకు స్కూల్ ఎడ్యుకేషన్ త్రిభాష సూత్రంలో ఫస్టు లాంగ్వేజి తెలుగు, సెకండ్ లాంగ్వేజి హిందీ, థర్డ్ లాంగ్వేజి ఇంగ్లీషు ఉన్నాయని తెలిపారు. ఇంగ్లీషు విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెపుతున్న ప్రభుత్వం ఇప్పుడు ఇంగ్లీషును ఏ లాంగ్వేజిగా ప్రకటిస్తుందో చెప్పాలన్నారు. సంస్కృతం ప్రజల భాషకాదని అన్నారు. కేంద్రం ఆదేశించిందని థర్డ్ లాంగ్వేజిగా తీసుకువచ్చారో? లేక మార్కుల కోసం తీసుకువచ్చారో చెప్పాలని అన్నారు. దీనిపై మంత్రి ని ప్రశ్నించినా సరైన సమాధానం రాలేదన్నారు.

ప్రధానోపాధ్యాయులకు నోటీసులు సరికాదు

విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినకపోతే ప్రధానోపాధ్యాయులను బాధ్యులను చేస్తూ నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. సమగ్రశిక్షలో పనిచేసే వారికి మూడు నెలలుగా జీతాలివ్వడం లేదన్న అంశాన్ని మండలిలో ప్రస్తావించామన్నారు. త్వరలో వీరికి వేతనాలు చెల్లిస్తామని ప్రభుత్వం సమాధానం ఇచ్చిందన్నారు. ఓసి రైతులకు రైతు భరోసా అమలుకు గత చట్టానికి సవరణ చేయాలని కోరామన్నారు. నాలుగు ఎకరాలు చేసే కౌలు రైతుకు, ఎకరం చేసే రైతుకు ఒకేరకంగా రూ.13,500 రైతుభరోసా ఇవ్వడంలో ఎటువంటి సమానత్వం ఉందో ప్రభుత్వం తెలపాలన్నారు. దీనిపైన వ్యవసాయ మంత్రి సమాధానం చెప్పలేదన్నారు. జాతీయ ప్రాజెక్టుగా ఉన్న పోలవరానికి కేంద్రం ఐదేళ్ళలో ఎంత మొత్తంలో నిధులు విడుదల చేసిందని అడిగిన ప్రశ్నను అనుబంధ ప్రశ్నగా పేర్కొంటూ జలవనరులశాఖ మంత్రి సమాధానం దాటవేశారన్నారు. ఐదేళ్లలో నీటి ప్రాజెక్టులకు రూ.61,573.15కోట్లు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిందని, ఈ మొత్తంలో 52 శాతం రూ. 32,059.62 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు.

పిడుగుపాటుకు నలుగురు దుర్మరణం

ప్రజాశక్తి- చింతలపూడి (ఏలూరు జిల్లా), మేడికొండూరు (గుంటూరు జిల్లా)

రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో పిడుగుపాటుకు మంగళవారం నలుగురు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం మందపాడుకు చెందిన 12 మంది మహిళా కార్మికులు అదే గ్రామంలోని పొలంలో మిర్చి నాట్లు వేస్తున్నారు. ఆ సమయంలో వర్షంతోపాటు పిడుగుపడడంతో దొడ్డ సువార్త (45), బిల్లా ప్రభావతి (22) అక్కడికక్కడే మృతి చెందారు. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం తుమ్మండ్రుగూడేనికి చెందిన ముగ్గురు మహిళలు తమ సొంత పొలంలో పనిచేస్తుండగా ఆ సమయంలో వర్షం కురవడంతో సమీపంలోని చెట్టు కిందకు వెళ్లి తలదాచుకున్నారు. ఆ చెట్టుపై పిడుగు పడడంతో తీవ్రంగా గాయపడిన వారి ముగ్గురినీ స్థానికులు 108 అంబులెన్స్‌లో చింతలపూడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారిలో సొంగా దేవమాత (50), సొంగా మనీషా (20) అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జ్యోత్స్న పరిస్థితి విషమంగా ఉండడంతో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చేపల వేట మరింత భారం

- బోటు తిప్పేందుకు పెరిగిన ఖర్చులు
- డీజిల్ ధర రెట్టింపైనా సబ్సిడీ పెంచని ప్రభుత్వం

వేటలో నిమగ్నమైన మత్స్యకారులు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

సముద్రంపై చేపల వేటనే నమ్ముకుని జీవిస్తున్న మత్స్యకారుల జీవనం క్రమంగా భారంగా మారుతోంది. కడలిలో ఏర్పడుతున్న ప్రతికూల వాతావరణ పరిస్థితులు, చేపల ధరల తగ్గుదల, దళారుల ప్రమేయం, వేటకు అయ్యే ఖర్చులు పెరగడం వెరసి వారి జీవన విధానాన్ని దెబ్బతీస్తున్నాయి. పలు సందర్భాల్లో వేట సాగని పరిస్థితుల్లో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఇస్తున్న డీజిల్ ధరలో రాయితీని పెంచడంతోపాటు, సబ్సిడీపై ఇస్తున్న డీజిల్‌ను పెంచాలని మత్స్యకారులు కోరుతున్నారు.

కాకినాడ జిల్లాలో తొండంగి, యు.కొత్తపల్లి, కాకినాడ రూరల్, కాకినాడ అర్బన్, తాళ్లరేవు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఐ.పోలవరం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన, అల్లవరం, సఖినేటిపల్లి తదితర 13 మండలాల్లో 144 కిలోమీటర్ల మేర సముద్ర తీర ప్రాంతం విస్తరించి ఉంది. కోస్తా తీర ప్రాంతం గుండా 3.55 లక్షల మంది నివసిస్తుండగా, చేపల వేట ద్వారా సుమారు 66 వేల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. 600 వరకూ మెకనైజ్డ్, మూడు వేలకుపైగా మోటరైజ్డ్ బోట్లపై మత్స్యకారులు చేపల వేట సాగిస్తున్నారు. సముద్రంలో ఎటువంటి ఆటంకాలూ లేనప్పుడు వేటకు వెళ్లి వీరంతా కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఏవైనా ప్రతికూల పరిస్థితులు ఉంటే వారు పస్తులుండాల్సి వస్తోంది. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వాయుగుండాలు, తుపానులు వచ్చినప్పుడు రోజుల తరబడి వేటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. కొన్ని సందర్భాల్లో నెలంతా ఖాళీగానే ఉంటున్నామని, అయినా తమను ఎవరూ ఆదుకోవట్లేదని మత్స్యకారులు వాపోతున్నారు.

డీజిల్ ధర రెట్టింపు

లీటర్ డీజిల్ ధర రూ.50 ఉన్నప్పుడు ప్రభుత్వం సబ్సిడీపై అందించేది. ప్రస్తుతం డీజిల్ లీటరు రూ.100కి పెరిగినా అప్పటి సబ్సిడీ రూ.9 మాత్రమే నేటికీ అందిస్తోంది. కనీసం రూ.30 అయినా ఇవ్వాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. మత్స్య సంపద అంతగా లభ్యం కానీ పరిస్థితుల్లో సముద్రంలో సుదూర ప్రాంతం వేటకు వెళ్లాల్సి వస్తోంది. నెలకు నాలుగుసార్లు వేటకు వెళితే మోటరైజ్డ్ బోట్లకు దాదాపు రెండు వేల లీటర్లు డీజిల్ వినియోగం అవుతోంది. ప్రభుత్వం 300 లీటర్లను మాత్రమే సబ్సిడీపై అందిస్తోంది. కనీసం మిగతా 2లో

మండలిలో బిల్లుల ఆమోదం

- ప్రైవేటు విశ్వవిద్యాలయాలపై నియంత్రణ లేదు
- ఆర్‌టిసి ఉద్యోగులకు వైద్య సదుపాయాలు కరవు
- పిడిఎఫ్ ఎమ్మెల్సీల ధ్వజం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనసభలో ఆమోదించిన బిల్లులను ఆయా శాఖల మంత్రులు మంగళవారం శాసనమండలిలో ప్రవేశపెట్టారు.స్వల్ప చర్చలతో ఆయా బిల్లులను మండలి ఆమోదం తెలిపింది. తొలుత వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీ వైద్య విధానపరిషత్ రద్దు బిల్లు ప్రవేశపెట్టారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ప్రయోజనాలకు ఇబ్బంది లేకుండా చూడాలని మంత్రిని కోరారు. వీరికి ఉద్యోగ భద్రత, తగిన సదుపాయాలు కొనసాగేలా చర్యలుతీసుకోవాలని అన్నారు. ఇందుకు మంత్రి రజని అంగీకరించారు. ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా మారుస్తూ గతంలో చేసిన చట్టానికి అనుబంధంగా మరికొంత మంది ఉద్యోగులను కూడా చేరుస్తూ చట్టసవరణకు ప్రతిపాదించారు. ఈ అంశంపై ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, షేక్ షాబ్జీ మాట్లాడుతూ ఆర్‌టిసి ఉద్యోగులకు ఆరోగ్య పరమైన సమస్యలు పరిష్కారంకావడంలేదన్నారు. కార్పొరేషన్‌లో ఉన్నప్పుడే వారికి తగిన సదుపాయాలు అందాయని ప్రభుత్వ సర్వీసులో చేరిన తరువాత తగిన ఆరోగ్య సదుపాయాలు కొరవడ్డాయన్నారు. చిన్న తప్పిదాలకు కూడా ఉద్యోగాల నుంచి తప్పించే చర్యలను ఉపసంహరించుకోవాలన్నారు. మంత్రి మాట్లాడుతూ గతంలో కన్నా సదుపాయాలు పెంచుతున్నామని, ప్రధానంగా పించను సదుపాయం బాగా పెరిగిందన్నారు. తరువాత మోటారు వాహనాల పన్నుల సవరణ బిల్లుకు మండలి ఆమోదం తెలిపింది. ప్రైవేటు విశ్వవిద్యాలయాల నియంత్రణ చట్టసవరణ బిల్లునుమంత్రి బొత్స సత్యనారాయణ ప్రతిపాదించారు. ప్రైవేటు విశ్వవిద్యాలయాలపై ప్రభుత్వానికి నియంత్రణ కొరవడిందని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ఆరోపించారు. రూ.3 నుంచి రూ.4 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు.

30 శాతం సీట్లు కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. దేవాదాయ,ధర్మాదాయ హిందూ రిలిజియస్ ధార్మిక సంస్థల చట్ట సవరణ బిల్లుకు మండలి ఆమోదం తెలిపింది. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ఆదాయం ఆధారంగా ఆలయాలు అప్ గ్రేడ్ అవుతున్నాయన్నారు. అయితే అధికారుల పోస్టులు కూడా అప్ గ్రేడ్ చేయాలని ఎమ్మెల్సీ లక్ష్మణరావు సూచించారు. ఎపిపిఎస్‌సి ద్వారా విశ్వవిద్యాలయాల్లో నియామకాలకు సంబంధించిన బిల్లును ముఖ్యమంత్రి తరుపున మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ 2018 నుంచి నియామకాల ప్రక్రియ పెండింగ్‌లో ఉందన్నారు. పలువురు అధ్యాపకులు కోర్టును ఆశ్రయించారని తెలిపారు. ఎంపికలో పారదర్శకత లేదన్నారు. స్వల్పకాలిక చర్చ తరువాత ఈ బిల్లును మండలి ఆమోదించింది. జిఎస్‌టి సవరణ బిల్లును ఆర్థిక మంత్రి బుగ్గన ప్రవేశపెట్టగా ఆమోదించారు. అసైన్డు భూములపై అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రతిపాదించగా సభ ఆమోదించింది.

కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయండి
పిడిఎఫ్ వాయిదా తీర్మానం, తిరస్కరణ

కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై శాసనమండలిలో పిడిఎఫ్ సభ్యులు మంగళవారం ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని ఛైర్మన్ మోషేన్‌రాజు తిరస్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కస్తూరిబా విద్యా సంస్థల్లోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ పాఠశాలల్లో ఇప్పటికీ ఒక్క రెగ్యులర్ పోస్టు లేకపోవడం విచారకరం అన్నారు. ఎమ్మెల్సీ షేక్ షాబ్జీ మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. ఈ అంశాలపై చర్చకు అనుమతించాలని కోరారు.

జిఓ 102ను అమలు చేయాలి

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఓ 102ను చిత్తశుద్ధితో అమలు చేయాలని కెవిపిఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అంద్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల కార్యక్రమంలో భాగంగా ఉండకుండా పోస్టులను ప్రకటించాలన్నారు. గత పదేళ్ల నుంచి ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయలేదన్నారు. ఇప్పటికైనా సయమపాలన బట్టి భర్తీ చేయాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లోని బ్యాక్‌లాగ్ పోస్టులను జిల్లా కలెక్టరు తెప్పించి చర్యలు తీసుకోవాలన్నారు.

విశాఖ నుంచి వారణాసికి రైలు : ఎంపి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విశాఖపట్నం నుంచి వారణాసి వెళ్లేందుకు వీలుగా సంబల్‌పూర్ నుంచి బనారస్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును విశాఖ వరకు పొడిగించేందుకు రైల్వేశాఖ ఆమోదం తెలిపిందని ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. సోషల్ మీడియా వేదికగా ఆయన మంగళవారం సందేశం విడుదల చేశారు. వారానికి రెండు రోజుల పాటు (బుధ, శనివారాలు) ఒడిశాలోని సంబల్‌పూర్ నుంచి ప్రారంభమయ్యే ఈ రైలు ఇకపై విశాఖ నుంచి అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. విశాఖ, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, సంబల్‌పూర్ రైల్వేస్టేషన్ల మీదుగా వారణాసికి చేరుకోవచ్చని తెలిపారు. ఈ రైలు ప్రతిరోజూ నడిచేలా రైల్వేశాఖ చొరవ చూపాలని కోరారు.

వ్యవసాయ రంగానికి రూ.1.74 లక్షల కోట్లు ఖర్చు చేశాం : మంత్రి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ఈ నాలుగున్నరేళ్లలో రూ.1.74 లక్షల కోట్లు ఖర్చు చేశామని వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కరణం ధర్మశ్రీ శాసనసభలో స్వల్పకాలిక చర్చలో లేవనెత్తిన అంశాలపై మంత్రి మాట్లాడారు. రైతులకు విత్తనం నుంచి పంట విక్రయం వరకూ ప్రభుత్వం అండగా వుండేలా రాష్ట్రంలో ప్రవేశపెట్టిన రైతుభరోసా కేంద్రాలు అద్భుత ఫలితాలు ఇస్తున్నాయన్నారు. పలు రాష్ట్రాలకు చెందిన ప్రభుత్వాలే కాకుండా విదేశాల నుంచి వచ్చిన నిపుణులు సైతం రైతుభరోసా కేంద్రాలను చూసి అబ్బురపోతున్నారని తెలిపారు. రైతుభరోసా, సున్నా వడ్డీ, ఉచితపంటల బీమాలాంటి పథకాలతో వ్యవసాయానికి ఎంతో చేయూత అందించామని అన్నారు.

కులగణనతోనే సామాజిక న్యాయం

- మంత్రి చెల్లుబోయిన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమాజంలోని అన్ని తరగతుల ప్రజలకూ సామాజిక న్యాయం జరగాలంటే జనగణనను కులాలవారీ చేపట్టాలని బిసి సంక్షేమం, సమాచారశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. మంగళవారం శాసనసభలో జనగణనలో కులగణన అనే అంశంపై మంత్రి మాట్లాడారు. విద్యా, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని తరగతుల ప్రజలకు సమాన అవకాశాలు రావాలంటే కులగణన తప్పనిసరి అని అన్నారు. తమ ప్రభుత్వం కులగణనకు అనుకూలమని తెలిపారు. కులగణనకు అనుకూలంగా రాష్ట్ర శాసనసభలో ప్రభుత్వం ప్రకటన చేయడం పట్ల బిసి మంత్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర శాసనసభ ఆవరణలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, విడదల రజిని, జోగి రమేష్, కెవి ఉషశ్రీ చరణ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ మంత్రి శంకరనారాయణ, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ తదితరులు ఉన్నారు.

జనసేనతో కలిసి త్వరలో జెఎసి

- 29 నుంచి లోకేష్ పాదయాత్ర : అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వంపై టిడిపి చేస్తున్న పోరాటాన్ని మరింత ఉధృతం చేసేందుకు త్వరలోనే టిడిపి - జనసేన జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి)ని ఏర్పాటు చేయబోతున్నామని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు అన్నారు. టిడిపి పొలిటికల్ యాక్షన్ కమిటీ తొలి సమావేశం ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగింది. అనంతరం అచ్చెన్నాయుడు విలేకరులతో మాట్లాడుతూ.. వైసిపి దుర్మార్గాలు, దుశ్చర్యలపై టిడిపి, జనసేన కలిసి పోరాడాలనే నిర్ణయానికి వచ్చాయన్నారు. ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులు, కక్షసాధింపు విధానాలతో పాటు పాలకుల అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించామని అన్నారు. త్వరలోనే రెండు పార్టీల సభ్యులతో ఉమ్మడి జెఎసి ఏర్పాటు చేయాలని నిర్ణయించామని వెల్లడించారు. చిన్న ఆధారం లేని కేసులో అన్యాయంగా తమ అధినేత చంద్రబాబును జైల్లో పెట్టిన విధానం, అక్రమ కేసులు, లోకేష్‌పై పెట్టిన ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులోని వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని నిర్ణయించామన్నారు. లోకేష్ పాదయాత్రను శుక్రవారం రాజోలు నుంచి ప్రారంభించాలని ఉమ్మడిగా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఈ యాత్రను అడ్డుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. పాదయాత్ర కొనసాగింపునకు అన్ని అనుమతులు తీసుకున్నామన్నారు. తమను డైలమాలో పెట్టిన ప్రభుత్వం మరోపక్క ఓటర్ల జాబితాలో అవకతవకలు, దొంగ ఓట్లు చేర్చడంపై దృష్టి పెట్టిందన్నారు. దొంగ ఓట్లు తీసేయడం, ఓటర్ జాబితాను పరిశీలించి తొలగించిన అర్హుల ఓట్లు తిరిగి చేర్పించడంపై దృష్టి సారించాలని నిర్ణయించామన్నారు.

ప్రైవేటు భూములను దేవాదాయశాఖలో ఎలా కలుపుతారు?

- మంత్రిని నిలదీసిన వైసిపి ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభలో మంగళవారం 'నిషేధిత భూముల జాబితాలో పట్టా భూములు, గ్రామ కంఠాలు' అనే అంశంపై దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కందుకూరు వైసిపి ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి మధ్య ఆసక్తికర చర్చ జరిగింది. ఇదే అంశంపై మహీధర్‌రెడ్డి సమస్యను ఎప్పటిలోగా పరిష్కరిస్తారంటూ మంత్రిని నిలదీశారు. ప్రైవేటు వ్యక్తులకు చెందిన పట్టా భూములను దేవాదాయశాఖ భూముల పరిధిలో 22(ఎ)(సి) నిషేధిత భూముల జాబితాలో చేర్చడంతో పేద రైతులు బదలాయించుకోలేక ఎనిమిదేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. కందుకూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు నిషేధిత భూముల జాబితా నుంచి ఎన్ని సర్వే నెంబర్లు తొలగించారు? ఇంకెన్ని తొలగించాల్సి ఉందని మంత్రిని ప్రశ్నించారు. కందుకూరు నియోజకవర్గంలో సర్వే నెంబరు 297/1లో 650 ఎకరాలు భూమి ఉంటే.. అందులో దేవాదాయశాఖకు చెందిన భూమి కేవలం 15 ఎకరాలు మాత్రమేనన్నారు. సర్వే నెంబరు మొత్తాన్ని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని ఏడేళ్లుగా రైతులు తిరుగుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఏడేళ్లుగా తొలగించేందుకు ఉన్న అభ్యంతరాలేమిటని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

మంత్రి కొట్టు సత్యనారాయణ సమాధానమిస్తూ.. ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి ప్రస్తావించిన సర్వే నెంబర్‌లోని భూమి సబ్ డివిజన్ జరగకపోవడంతో దేవాదాయశాఖ, రెవెన్యూ అధికారులు నిషేధిత జాబితాలో చేర్చారని, పొరపాటున నమోదు చేశారని వివరణ ఇచ్చారు. పొరపాటుకు కారకులైన వారికి ఇప్పటికే నోటీసులు ఇచ్చామన్నారు.

ఫైబర్‌నెట్ స్కామ్‌లోనూ చంద్రబాబు పాత్ర

- రూ.114 కోట్లు తిన్నారు
- శాసనసభలో మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఫైబర్‌నెట్ స్కామ్‌లోనూ రూ.114 కోట్లు తిన్నారని పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ ఆరోపించారు. మంగళవారం శాసనసభలో స్వల్పకాలిక చర్చలో ఎమ్మెల్యేలు అబ్బయ్యచౌదరి, మద్దిశెట్టి వేణుగోపాల్ ఫైబర్‌నెట్ అంశంలో చంద్రబాబు ప్రభుత్వం అనుసరించిన విధానంపై మాట్లాడారు. ఫైబర్‌నెట్‌ను టెరాసాఫ్ట్ కంపెనీకి కట్టబెట్టేందుకు అనేక తప్పుడు మార్గాలను అనుసరించిందని అన్నారు. చౌకదుకాణాల్లో ఇ-పోస్ మిషన్‌ల పంపిణీలో సరిగ్గా వ్యవహరించలేదని బ్లాక్‌లిస్టులో వుంచిన టెరాసాఫ్ట్ కంపెనీని ఈ టెండర్‌లో పాల్గొనేందుకు ఎలాంటి విచారణ లేకుండానే చంద్రబాబు ప్రభుత్వం బ్లాక్ లిస్టు నుంచి తొలగించిందని అన్నారు. ఈ అంశంపై గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ రిపోర్టును పక్కనబెట్టి చంద్రబాబు టెరాసాఫ్ట్ కంపెనీకి కాంట్రాక్టును కట్టబెట్టారని విమర్శించారు. చంద్రబాబుకు సన్నిహితులైన వేమూరి హరికృష్ణ ప్రసాద్, దేవినేని సీతారామయ్యను డైరెక్టర్లుగా నియమించి రూ.114 కోట్లను పక్కదారి పట్టించారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షనేతగా 2016లోనే ఫైబర్‌నెట్‌లో భారీ కుంభకోణం ఉందని శాసనసభలో చెప్పారని ఈ సందర్భంగా అప్పటి జగన్ ప్రసంగాన్ని వీడియోలో ప్రదర్శించారు. టెండర్ ప్రక్రియ నుంచే ఫైబర్‌నెట్‌లో అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. టెరాసాఫ్ట్ కంపెనీ షెల్ కంపెనీల ద్వారా ప్రజాధనాన్ని చంద్రబాబుకు చేరవేసిందన్నారు.

పట్టణ స్థానిక సంస్థల్లో పడకేస్తున్న పాలన

- సిబ్బంది కొరతే ప్రధాన సమస్య
- కాగ్ నివేదికలో వెల్లడి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పట్టణ స్థానిక సంస్థలో పాలనకు తీవ్ర ఇబ్బందులు నెలకొంటున్నాయి. విధుల నిర్వహణకు సిబ్బంది లేమి వేధిస్తోంది. ఎంపిక చేసిన కొన్ని నగర పాలక సంస్థలు, కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో ఉద్యోగుల లేమిపై కాగ్ సమర్పించిన నివేదికలో కీలకాంశాలు వెలుగుచూసాయి. స్థానిక సంస్థల్లో కీలక విభాగాలుగా ఉన్న పాలన, ఆదాయం, ప్రజారోగ్యం, ఇంజనీరింగ్, ప్రణాలిక వంటి రంగాలపై సిబ్బంది లేమి తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోందని కాగ్ పేర్కొంది.

ఆరు కార్పొరేషన్లు, 11 మున్సిపాల్టీలు, నాలుగు నగర పంచాయితీల్లో కాగ్ సర్వే చేయగా, అన్నింటిలోనూ సిబ్బంది లేమి సుస్పష్టంగా కనిపించింది. కార్పొరేషన్లకు సంబంధించి ఎక్కువగా గ్రేటర్ విశాఖలోనే సమస్య అధికంగా ఉంది. ఈ సంస్థలో 782 మంది ఉద్యోగులు పనిచేయాల్సి ఉండగా కేవలం 502 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అంటే వాస్తవానికంటే 280 మంది ఉద్యోగులు తక్కువగా ఉన్నట్లు తేలింది. ఇందులో పరిపాలనా రంగంలోనే ఎక్కువ కొరత కనిపించింది. ఇందులో 311 మంది ఉద్యోగులు పనిచేయాల్సి ఉండగా, కేవలం 231 మంది విధులు నిర్వహిస్తున్నారు. అత్యంత కీలక రంగమైన ప్రజారోగ్య విభాగంలో కూడా 243 మంది పనిచేయాల్సి ఉండగా, కేవలం144 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు.

అలాగే తిరుపతిలో 725 మందికిగాను 663 మంది ఉద్యోగులు, గుంటూరులో 1,582 మందికిగాను 1,373 మంది, ఏలూరులో 515 మందికిగాను 433 మంది ఉద్యోగులు, మంగళగిరిలో 168 మందికిగాను 143 మంది, తాడేపల్లి కార్పొరేషన్‌లో 103 మందికిగాన 91 మంది ఉద్యోగులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మున్సిపాల్టీల్లో కూడా ఇదే లోటు కనిపిస్తున్నట్లు కాగ్ గణాంకాలతో పేర్కొంది. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోని మున్సిపాల్టీలు నివేదికలో లేకపోగా, మాజీ ముఖ్యమంత్రి సొంత మున్సిపాల్టీ అయిన కుప్పం వివరాలు అందించలేదని కాగ్ వివరించింది.

సచివాలయ సిబ్బందితోనే

భారీగా సిబ్బంది లేమి ఉన్న ప్రాంతాల్లో సచివాలయ కార్యదర్శులతోనే విధులు కొనసాగిస్తున్నట్లు కనిపిస్తోంది. సచివాలయాల్లో ఆరోగ్యం, పారిశుధ్యం, ఇంజనీరింగ్, ప్రణాళిక, పాలన వంటి రంగాల్లో పనిచేస్తున్న కార్యదర్శులను అనధికారికంగా కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో ఉపయోగించుకుంటున్నారు. వారినే ఆయా పట్టణ స్థానిక సంస్థల్లో ఉద్యోగులుగా చూపిస్తున్నారని తెలుస్తోంది.

కక్ష సాధింపుతోనే తెరపైకి ఫైబర్ నెట్, రింగ్‌రోడ్డు

- టిడిపి మాక్ అసెంబ్లీలో విమర్శలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపుతోనే స్కిల్‌డెవలప్‌మెంట్, ఎపి ఫైబర్‌నెట్ ప్రాజెక్టు, లేని అమరావతి రింగ్‌రోడ్డును తెరపైకి తెసుకొస్తోందని టిడిపి విమర్శించింది. ఎక్కడా.. దేనిలోనూ తప్పు జరిగినట్టు జగన్ సర్కారు నిరూపించలేదని పేర్కొంది. టిడిపి కార్యాలయంలో టిడిపి ఎమ్మెల్సీలు మాక్ శాసనమండలి నిర్వహించారు. పి అశోక్‌బాబు ఫైబర్‌నెట్ ప్రాజెక్టు గురించి వివరించారు. వైసిపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టుపై చట్టసభలో దుష్ప్రచారం చేపట్టారని విమర్శించారు. రూ.149లకే టిడిపి ప్రభుత్వం ప్రతి ఇంటికీ టివి ఇంటర్నెట్, టెలిఫోన్ కనెక్షన్ ఇవ్వడం దేశంలోనే గొప్ప సాంకేతిక విప్లవంగా నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారత్ నెట్ ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర మంతటా అండర్‌గ్రౌండ్ కేబుల్ వేయడానికి రూ.5,600 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసిందన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం అంత ఖర్చు చేయలేదని, ఉన్న విద్యుత్ స్తంభాల మీదుగా కేబుల్ తీసుకెళ్తే తక్కువ ఖర్చుతో పూర్తవుతుందని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారని వివరించారు. అందులో భాగంగానే కేవలం రూ.330 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రాజెక్టును సమర్థవంతంగా అమలు చేసిందన్నారు. ప్రాజెక్టు కోసం అజయ్‌జైన్ నేతృత్వంలోని హైపవర్ కమిటీ సూచన మేరకు టెరాసాఫ్ట్‌కు అప్పగించిందన్నారు. తమ ప్రభుత్వం రూ.149కు అందించిన సౌకర్యాన్ని వైసిపి ప్రభుత్వం రూ.350కు పెంచిందన్నారు. ఈ ప్రాజెక్టుపై రూ.120 కోట్లు అన్యాక్రాంతమయ్యాయని వైసిపి ప్రభుత్వం నిరాధార ఆరోపణలు చేస్తూ గత ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రాజెక్టు విలువను గత ప్రభుత్వం రూ.321 కోట్లుగా నిర్ధారిస్తే దాని అమలుకు వచ్చేసరికి రూ.291 కోట్లకు తగ్గించిందని చెప్పారు. ఈ మొత్తంలో రూ.120 కోట్ల అవినీతి జరిగిందనడం పచ్చి అబద్ధం అని పేర్కొన్నారు. చంద్రబాబును ఎలాగైనా ఈ వ్యవహారంలో ఇరికించాలన్న దురుద్దేశంతో నాటి ప్రభుత్వంలో ఇన్‌క్యాప్ ఎమ్‌డిగా పనిచేసిన అధికారిని అక్రమం అరెస్టు చేశారని విమర్శించారు. హరిప్రసాద్ కుమార్తె అమెరికా చదువుల కోసం తన స్నేహితుడు జెమినీ సంస్థకు చెందిన కోటేశ్వరరావు వద్ద కొంత డబ్బు తీసుకున్నారని తెలిపారు. ఇది అవినీతి ద్వారా వచ్చిన సొమ్ము అని ఈ ప్రభుత్వం కట్టుకథలు అల్లిందని విమర్శించారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు, పార్టీ నాయకులు టిడి జనార్ధన్, వంగలపూడి అనిత, చింతకాయల అయ్యన్నపాత్రుడు, పి అనురాధ, గద్దె రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కేసులో తీర్పు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

అంగళ్లు ఘటనలో అన్నమయ్య జిల్లా ముదివేడు పోలీసులు నమోదు చేసిన కేసులో బెయిల్ ఇవ్వాలని కోరుతూ టిడిపి అధినేత చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. మంగళవారం ఇరుపక్షాల వాదనలు పూర్తికావడంతో తీర్పును తర్వాత వెలువరిస్తామని జస్టిస్ కె సురేష్‌రెడ్డి వెల్లడించారు. ఇరిగేషన్ ప్రాజెక్టు సందర్శన నిమిత్తం వెళుతుండగా అంగళ్లు కూడలి వద్ద చోటుచేసుకున్న ఘటనలో చంద్రబాబుపై పోలీసులు ఆగస్టు 8న నమోదు చేసిన కేసులో బెయిల్ ఇవ్వాలని ఆయన తరపున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు కోరారు. అంగళ్లులో చంద్రబాబు కాన్వాయ్‌పై అధికార పార్టీ వారు రాళ్లు విసిరారన్నారు. ఇదే కేసులోని ఇతర నిందితులకు హైకోర్టు బెయిల్ ఇచ్చిందని గుర్తు చేశారు. పోలీసుల తరపున అదనపు ఎజి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ.. బెయిల్ పిటిషన్‌కు విచారణార్హత లేదన్నారు. చంద్రబాబు ప్రోత్సాహం తోనే వాళ్లంతా చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నారని చెప్పారు. హైకోర్టు తీర్పును వాయిదా వేసింది.

కేసులన్నీ రాజకీయ కక్షలో భాగమే.. చంద్రబాబు న్యాయవాది వాదన

రాజకీయ కక్షతోనే చంద్రబాబుపై ఒకటి తర్వాత మరో కేసు బనాయిస్తున్నారని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హైకోర్టులో వాదించారు. గత ప్రభుత్వ విధాన నిర్ణయాలను తిరగతోడి క్రిమినల్ చర్యలుగా అభివర్ణించేలా చేస్తున్నారని అన్నారు. రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన్ డిజైనింగ్‌తోపాటు ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్మెంట్ మార్పుల్లో అక్రమాలు జరిగాయంటూ మంగళగిరి వైసిపి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా 2022 మే 9న సిఐడి కేసు నమోదు చేసింది. పలుసెక్షన్ల కింద పెట్టిన కేసుల్లో ముందస్తు బెయిల్ ఇవ్వాలన్న పిటిషన్‌ను మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె సురేష్‌రెడ్డి విచారణ చేపట్టారు. లూథ్రా వాదనలు కొనసాగిస్తూ.. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం జరగలేదని, ఇందులో అవినీతికి ఆస్కారమే లేదని చెప్పారు. ఆ ప్రాజెక్టు కోసం భూమే సేకరించలేదని చెప్పారు. ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్మెంట్ రూపకల్పనకు బిడ్లను పిలిచారని సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ చెప్పారు. రాజకీయ కుట్రతో కేసులు పెట్టారన్న వాదనలను ఎజి ఎస్ శ్రీరామ్ ఖండించారు. పిటిషనర్ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారని చెప్పి ఈ కేసులోనూ కస్టడీలో ఉన్నట్లుగా పరిగణించేందుకు వీల్లేదన్నారు. ఎజి వాదనలు బుధవారం కొనసాగనున్నాయి.

చేపల వేట మరింత భారం

(మొదటి పేజీ తరువాయి)

1,500 లీటర్లయినా సబ్సిడీపై ఇవ్వాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. మెకనైజ్డ్ బోట్లకు ఇస్తోన్న మూడు వేల లీటర్ల డీజిల్ సబ్సిడీని ఐదు వేల లీటర్లకు పెంచాలని కోరుతున్నారు.

తగ్గుతున్న ఉపాధి

గతం కంటే చేపల వేట తగ్గుతూ వస్తోందని మత్స్యకారులు చెబుతున్నారు. తుని, తొండంగి, తాళ్లరేవు, కాకినాడ రూరల్ వంటి తీర ప్రాంతాల్లో హెచరీలతోపాటు రొయ్యల చెరువులు, ప్రాసెసింగ్ యూనిట్లు విపరీతంగా పెరిగాయి. వాటి వ్యర్థాలను సముద్రంలోకి నేరుగా వదిలేస్తున్నారు. దీంతో, మత్స్య సంపదకు తీవ్రంగా నష్టం జరుగుతోందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. దీంతో, మత్స్యకారులకు వేట సరిగా సాగడం లేదు.

ఖర్చులు రెట్టింపు అయ్యాయి

ఇంధనం, ఐస్‌తో పాటు ఇతర ఖర్చులు రెట్టింపయ్యాయి. చాలా దూరం వేటకు వెళ్లాల్సి వస్తుండడంతో డీజిల్ వినియోగం బాగా పెరిగిపోయింది. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు ప్రతికూల పరిస్థితుల్లో వేట చేయలేక అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

చోడిపల్లి ప్రసాద్, మత్స్యకారుడు, ఉప్పాడ, యు.కొత్తపల్లి మండలం

డీజిల్ సబ్సిడీ పెంచాలి

ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ ఏ మాత్రమూ సరిపోవడం లేదు. నెలకు డీజిల్ వినియోగం ఎక్కువైంది. వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న గంగపుత్రులు అప్పులు చేయాల్సిన దుస్థితికి వెళ్లారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సబ్సిడీని పెంచడంతోపాటు ఇస్తున్న లీటర్ల సంఖ్యను కూడా పెంచాలి.

తుమ్మల రమేష్, మత్స్యకార నాయకుడు, కాకినాడ

పాడేరులో సాగుతున్న ఉక్కు రక్షణ బైకు యాత్ర

పోరాటాలతో 'ఉక్కు'ను కాపాడుకుంటాం : సిపిఎం

- ఏడో రోజూ ఉత్సాహంగా సాగిన ఉక్కు రక్షణ యాత్ర

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

ప్రజా పోరాటాలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకుంటామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 20న విశాఖలో ప్రారంభమైన ఉక్కు రక్షణ బైకు యాత్ర మంగళవారం అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లో ప్రజలను చైతన్యపరుస్తూ సాగింది.ఏడో రోజు అల్లూరి జిల్లాలోని పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల, చింతపల్లి మండలాల్లోనూ, అనకాపల్లి జిల్లా నర్సీపట్నం, పాయకరావుపేట మండలాల్లోనూ సాగింది. యాత్ర బృందానికి స్వాగతం పలికి.. తామూ ఉక్కు పోరాటంలో భాగస్వాములమవుతామని స్థానికులు సంఘీభావం తెలిపారు. ఆయా చోట్ల జరిగిన సభల్లో లోకనాథం మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థలతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. గిరిజన ప్రాంతాల్లో మోడీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ఎటువంటి అభివృద్ధి పనులూ చేపట్టలేదని, పరిశ్రమలను ఏర్పాటు చేయలేదని విమర్శించారు. గ్రీన్ ఎనర్జీ పేరుతో 60 వేల ఎకరాలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసేందుకు పూనుకుంటోందని మండిపడ్డారు. ఆదివాసీలకు ఎల్లప్పుడూ ఎర్రజెండా అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు. గిరిజనులకు హానికలిగించే నిర్ణయాలకు పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి వత్తాసు పలుకుతూ ప్రజలను ఎలా మభ్యపెడుతున్నారో వివరించారు. బైకు యాత్రలో సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, నాయకులు చిన్నయ్యపడాల్, విశాఖ, అనకాపల్లి జిల్లా నాయకులు బి.జగన్, ఆర్.శంకరరావు, అడిగర్ల రాజు, కె.త్రిమూర్తులు రెడ్డి, ఎం.అప్పలరాజు ఎం.సత్యనారాయణ, పద్మ పాల్గొన్నారు.

విద్యార్థులపై నిర్బంధం అన్యాయం

- ప్రభుత్వ తీరుకు సిపిఎం ఖండన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శాంతియుతంగా కలెక్టరు కార్యాలయాల వద్ద ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థులను అక్రమంగా అరెస్టు చేసి, కేసులు పెట్టడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. అరెస్టు చేసినవారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విజయనగరం, కడప, నంద్యాల జిల్లాల్లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులను అరెస్టు చేసి ఐదుగురిపై కేసులు బనాయించడం అన్యాయమని పేర్కొన్నారు. విజయనగరం జిల్లా ఉపాధ్యక్షులు రాముకు చెందిన దుస్తులు చింపేయడం, విద్యార్థినులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించడం అన్యాయమని తెలిపారు. ఎన్నికల సందర్భంగా అనేక హామీలు ఇచ్చి ఈ నాలుగున్నరేళ్ల కాలంలో విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టళ్లు అధ్వానంగా మారాయని, తరగతుల విలీనంతో పాఠశాలలు మూసివేతకు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేసి వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

టిడిపి ప్రధాన కార్యదర్శి లోకేష్ ఖండన

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శాంతియుత నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసుల దాష్టీకాన్ని ప్రదర్శించారని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల పట్ల పోలీసులు రాక్షసంగా ప్రవర్తించిన తీరు దారుణమని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'కొట్టండి లోపలేయండి' అంటూ పోలీసులకు హుకుం జారీ చేస్తూ చెలరేగిపోయిన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీలపై అంత కర్కశమా?

సమస్యలు పరిష్కారం కోసం నిరసనలు చేపట్టిన అంగన్‌వాడీలపై పోలీసుల నిర్బంధం తీరు నిర్ఘాంతపరిచిందని లోకేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యవస్థలో భాగమైన మహిళలపై అంత కర్కశంగా వ్యవహరించాల్సిన అవసరం ఏమిటో అర్థం కావడం లేదని అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు, వ్యతిరేక గళాలు ఉంటాయన్న విషయం జగన్ తెలుసుకోవాల్సి ఉందని అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుపై రాష్ట్రంలో నిరసనలకు దిగిన మహిళలు, నేతలపై పోలీసుల దమనకాండను ప్రజలంతా గమనిస్తున్నారని, అతి త్వరలోనే వైసిపి ప్రభుత్వానికి పాడెకడతారని హెచ్చరించారు.

ఎన్ఇపికి వ్యతిరేకంగా పోరాటం

- యుటిఎఫ్ స్వర్ణోత్సవ జాతాలో నాయకులు

ప్రజాశక్తి- యంత్రాంగం

చీమకుర్తిలో జెండాను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

నూతన విద్యావిధానం (ఎన్ఇపి)తో పేదలు విద్యకు దూరమవుతారని, దీనికి వ్యతిరేకంగా పోరాడాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. విద్యాసంస్కరణలకు వ్యతిరేకంగా కార్యక్రమాలు రూపొందించుకొని పోరాటాలు చేయాలన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా అనంతపురంలో ప్రారంభమైన బైక్ జాతా ప్రకాశం జిల్లాకు, ఇచ్ఛాపురంలో ప్రారంభమైన జాతా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో మంగళవారం కొనసాగింది.

ప్రకాశం జిల్లా మార్కాపురం, పొదిలి మీదుగా చీమకుర్తికి జాతా చేరుకుంది. చీమకుర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సెంటర్‌లో యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించిన అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నుంచి వస్తున్న సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. జాతీయ విద్యావిధానం రద్దు, సిపిఎస్ రద్దు, పాత పెన్షన్ సాధన కోసం, విద్యాసంస్కరణలకు వ్యతిరేకంగా కార్యక్రమాలు రూపొందించుకొని పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ యాభై ఏళ్ల కాలంలో సాధించుకున్న హక్కులు ప్రపంచీకరణ నేపథ్యంలో ఒకొక్కటి కనుమరుగవుతున్నాయన్నారు.

వీటిని నిలబెట్టుకోవడం, కొత్త హక్కులు సాధించడం, ఉద్యమ ప్రధాన కర్తవ్యంగా తీసుకోవాలన్నారు. ఒంగోలు జిల్లా కార్యాలయం వద్ద యుటిఎఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు ఆదినారాయణ ఆవిష్కరించారు. జాతాకు మద్దతుగా ఒంగోలు నగరంలో ఉపాధ్యాయులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కోనసీమ జిల్లాల్లో రామచంద్రపురం, మండపేట, కొత్తపేట, రావులపాలెం, అమలపురం, రాజోలు వరకూ సాగింది. ఈ జాతాకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు, ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. మండపేట, రావులపాలెం, కొత్తపేట, అమలాపురంలో నిర్వహించిన సభలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డివి.రాఘవులు, ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడారు. సిపిఎస్ రద్దు కోసం జరిగే ఉద్యమాల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధంపై వెల్లువెత్తిన నిరసనలు

- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు
- పలు జిల్లాల్లో నాయకుల గృహనిర్బంధం, అరెస్టులు

ప్రజాశక్తి - యంత్రాంగం

అంగన్‌వాడీల నిర్బంధంపై నిరసనలు వెల్లువెత్తాయి. పోలీసుల నిర్బంధానికి నిరసనగా ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం నిరసన తెలిపారు. నిరసన తెలుపుతున్న, మద్దతు పలికిన నాయకులను పలు జిల్లాల్లో గృహనిర్బంధం, అరెస్టులు చేశారు. విజయవాడ లెనిన్‌సెంటర్‌లో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. రాజ్యాంగ హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. సమస్యలు పరిష్కరించాలని అడిగిన అంగన్‌వాడీలను పోలీసులతో నిర్బంధించడం, అరెస్టులు చేయించడం దారుణమన్నారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి తదితరులు పాల్గొన్నారు. తిరుపతిలో మున్సిపల్ కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. శ్రీకాకుళం అంబేద్కర్ కూడలి వద్ద నిరసన తెలిపేందుకు బయలుదేరిన సిఐటియు జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె నాగమణి, పలాసలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతిని గృహ నిర్బంధం చేశారు. బాపట్ల జిల్లా చీరాలలోని గడియార స్తంభం వద్ద నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులను, మద్దతు తెలిపిన కార్మికులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని విడుదల చేశారు. కర్నూలు, నంద్యాల కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ, రాష్ట్ర నాయకులు మనోహర్ మాణిక్యం మాట్లాడారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం విజయవాడకు వెళ్తున్న అంగన్‌వాడీలను ఎక్కడికక్కడే నిర్బంధించడం దారుణమన్నారు. బేతంచర్లలో నిరసన ర్యాలీ చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో నిరసన ర్యాలీ అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కాకినాడలో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. విశాఖ ద్వారకానగర్ ఆర్‌టిసి కాంప్లెక్స్, ఎల్ఐసి కార్యాలయం సమీపాన ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనకాపల్లి ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద, నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లా విఆర్.పురంలో ర్యాలీ, చిత్తూరులో గాంధీ విగ్రహం వద్ద ధర్నా, శ్రీకాళహస్తిలో అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన, నెల్లూరులో ర్యాలీ నిర్వహించారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ, కడప జిల్లా వేంపల్లి, కమలాపురం, అన్నమయ్య జిల్లా పెద్దమద్యం, నిమ్మనపల్లెలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. నిమ్మనపల్లెలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

విజయవాడ లెనిన్ సెంటర్‌లో నిరసననుద్దేశించి మాట్లాడుతున్న నర్సింగరావు

3న పాలిసెట్ స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాలిటెక్నిక్ కళాశాలల్లో మిగిలిన సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు సాంకేతిక విద్య కమిషనర్ సిహెచ్ నాగరాణి తెలిపారు. అక్టోబరు 3న స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సెప్టెంబరు 30న ఆయా పాలిటెక్నిక్ కళాశాలల నుంచి అందుబాటులో ఉన్న సీట్ల వివరాలను తెలుసుకోవచ్చని వివరించారు. సంబంధిత కళాశాల నోటీస్ బోర్డులో విభాగం వారీ ఖాళీ సీట్ల వివరాలను పొందుపరుస్తారని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా ప్రవేశం కోరుకునే అభ్యర్థులు పాలిసెట్ ప్రవేశపరీక్ష రాయకపోయినా సీటు పొందవచ్చునని అన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులై ఉంటే సరిపోతుందన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు. ప్రైవేట్ కళాశాలల్లో రూ.25 వేలు, ప్రభుత్వ కళాశాలల్లో రూ.4,700 ఫీజును అక్టోబరు మూడునే చెల్లించాలని వివరించారు.

వైభవోపేతంగా చక్రస్నానం

- ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి -తిరుమల

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున మూడు నుండి ఆరు గంటల వరకు స్వామివారికి పల్లకీ ఉత్సవం జరిగింది. ఉదయం ఆరు నుంచి తొమ్మిది గంటల నడుమ శ్రీ భూవరాహస్వామి ఆలయం ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపనతిరుమంజనం వైభవంగా నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు బంగారు తిరుచ్చి ఉత్సవం జరిగింది. తొమ్మిది గంటలకు ధ్వజావరోహణంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

ఎస్ఐ మెయిన్స్ పరీక్షలకు గడువు పొడిగించండి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్ఐ పోస్టుల భర్తీకి అక్టోబరు 14, 15 తేదీల్లో జరిగే మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి రామన్న డిమాండ్ చేశారు. దేహదారుఢ్య పరీక్షలు ముగిశాక అభ్యర్థులు పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు కనీసం రెండు నెలలు గడువును ఇవ్వకుండా కేవలం 15 రోజులు మాత్రమే ఇవ్వడం సరైంది కాదన్నారు. విజయవాడలో ఎపి ఉద్యోగ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఐ మెయిన్స్ పరీక్షలకు గడువు పొడిగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మోకాళ్లపై నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. దేహదారుఢ్య, పరీక్షలు ఈ నెల చివరి వరకూ వున్నందున మెయిన్స్ పరీక్షలకు అభ్యర్థులు సరిగ్గా సన్నద్ధం కాలేరన్నారు. అందువల్ల సమయాన్ని పెంచాలన్నారు. ఎపి ఉద్యోగ పోరాట సమితి నాయకులు సిద్ధికి, ఎఐవైఎఫ్ నాయకులు ఈశ్వరయ్య, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై రాము, ఉపాధ్యక్షులు ఎన్ నాగేశ్వరరావు, పి కృష్ణ, పిడిఎస్‌యు నాయకులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రంగంలో సాంకేతిక శిక్షణపై ఒప్పందం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మత్స్య, ఆక్వా రంగాలకు సాంకేతిక శిక్షణపై మత్స్య యూనివర్సిటీ, అంతర్ ప్రభుత్వ సంస్థలు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. మంగళవారం చెన్నై ప్రధాన కార్యాలయంలో అవగాహన ఒప్పందం జరిగింది. నర్సాపురం కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ మత్స్య విద్యాలయాన్ని నెలకొల్పారు. మత్స్య రంగాల అవసరాల కోసం నిష్ణాతులైన మత్స్య సాంకేతిక నిపుణులను అందించడమే ప్రధాన లక్ష్యంగా విశ్వవిద్యాలయం పనిచేస్తుంది. మత్స్య రంగాల్లో ఆధునిక పరిశోధనల కోసం మానవ వనరుల సామర్థ్యాల స్థాయి పెంపొందించాలనే ఉద్దేశంతో అవగాహన ఒప్పందం కుదిరినట్లు సమాచారశాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

నలుగురి జీవితాల్లో వెలుగులు నింపిన విద్యార్థి

- బ్రెయిన్ డెడ్‌తో అవయవదానం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

తాను మరణిస్తూ అవయవ దానం ద్వారా మరో నలుగురు జీవితాల్లో ఓ విద్యార్థి వెలుగు నింపారు. అందరికీ ఆదర్శంగా నిలిచారు. విద్యార్థి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... నారాయణ కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న చిలకలూరిపేట ప్రాంతానికి చెందిన కట్టా కృష్ణ (18) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ నెల 23న బస్సు కోసం వేచి ఉన్న సమయంలో అటుగా వెళుతున్న ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో, ఆయన తలకు బలమైన గాయం కావడంతో గుంటూరు రమేష్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. వైద్యులు రక్షించే ప్రయత్నాలు ఫలించక కృష్ణ బ్రెయిన్ డెడ్ అయ్యారు. మృతుడి తల్లిదండ్రులు కట్ట రాజు, మల్లేశ్వరి, బంధువులకు గుంటూరు రమేష్ హాస్పిటల్ వారు అవయవ దానంపై అవగాహన కల్పించారు. దీంతో, కృష్ణకు చెందిన గుండె, లివర్, రెండు కిడ్నీలు దానం చేశారు. ఇతరులకు అవయవాలను అమర్చేందుకు రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రీన్ ఛానల్ ద్వారా అవయవాలను మంగళవారం గన్నవరం విమానాశ్రయానికి తరలించారు. గుండెను హెలికాప్టర్ ద్వారా తిరుపతి పద్మావతి హాస్పిటల్‌కు తరలించారు. కాలేయాన్ని వైజాగ్‌లోని కిమ్స్ హాస్పిటల్‌కు, ఒక కిడ్నీని విజయవాడలోని ఆయుష్ హాస్పిటల్‌కు, మరొక కిడ్నీని గుంటూరులోని రమేష్ హాస్పల్‌కు తరలించి అవసరమైన వారికి అమర్చారు. ఈ సందర్భంగా గుంటూరు పోలీసు పేరేడ్ గ్రౌండ్స్ నుంచి గన్నవరం విమానాశ్రయానికి హెలికాప్టర్‌ను ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసు అధికారులు పూర్తి సహాయసహకారాలు అందించారు. కృష్ణ తల్లిదండ్రులకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. చిన్న వయస్సులోనే తమ కుమారుడు నలుగురులో మంచిపేరు తెచ్చుకోవాలని పరితపించేవాడని, మృతి చెందిన తరువాత ఇలా నలుగురికి జీవితాల్లో వెలుగులు నింపి చిరంజీవిగా మిగిలిపోయాడని తల్లిదండ్రులు భావోద్వేగంతో పేర్కొన్నారు.

హెలికాప్టర్‌లోకి యువకుడి అవయవాలను తీసుకెళ్తున్న వైద్యులు (ఇన్‌సెట్‌లో కృష్ణ (ఫైల్ ఫొటో))

ఖాతాదారుల అవసరాలే ముఖ్యం : ఆర్‌బిఐ

ముంబయి : ఖాతాదారుల ఆర్థిక అవసరాలను తీర్చడమే బ్యాంక్ ఉద్యోగుల ప్రాథమిక బాధ్యత అని ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ జె అన్నారు. ఆ తర్వాతే లక్ష్యాలపై దృష్టి సారించాలన్నారు. ఖాతాదారుల ఫిర్యాదులపై మంగళవారం ప్రధాన బ్యాంక్‌ల ఉన్నతాధికారులతో స్వామినాథన్ మాట్లాడుతూ.. 'అమ్మకాలు చేయడం కంటే నాణ్యమైన ఆర్థిక సలహాలు, సేవలను అందించినందుకు ఉద్యోగులకు రివార్డ్‌లు ఇచ్చే స్పష్టమైన, పారదర్శక ప్రోత్సాహక నిర్మాణం ఉండాలి. ఇందుకోసం ప్రతీ ఆర్థిక సంస్థ ఒక ప్రత్యేక విధానాన్ని కలిగి ఉండాలి. ఫిన్‌టెక్ భాగస్వామ్యంతో ఏదైనా ఉత్పత్తి లేదా సేవను అందించినప్పుడల్లా బ్యాం కులు తగిన పర్యవేక్షణ కలిగి ఉండాలి." అని అన్నారు.

దళితుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి

ప్రజాశక్తి- అమలాపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల హక్కులను కాలరాస్తున్నాయని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి విమర్శించారు. సామాజిక న్యాయం, దళిత హక్కుల పరిరక్షణ కోసం మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర కోనసీమ జిల్లాలో అమలాపురం నుంచి ముమ్మిడివరం వరకూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మాల్యాద్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి కేంద్రంలో రెండవసారి అధికారంలోకొచ్చిన తర్వాత సబ్ ప్లాన్ చట్టాన్ని రద్దు చేసిందన్నారు. లౌకిక రాజ్యాంగానికే ప్రమాదం పొంచి ఉందన్నారు. రాష్ట్రంలోనూ రోజురోజుకూ దళితులపై దాడులు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో దళితుల హక్కులు - సామాజిక న్యాయం కోసం రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడుతున్నామని, ఈ నెల 29న విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి జి దుర్గా ప్రసాద్, కెవిపిఎస్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అమలాపురంలో బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న అండ్ర మల్యాద్రి

బాబు అరెస్టుపై మాది తటస్థ వైఖరి : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టు వ్యవహారం పూర్తిగా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అంశం.. ఆ పంచాయితీ అక్కడే తేల్చుకోవాలని, తమది తటస్థ వైఖరని తెలంగాణ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు అన్నారు. ఎపిలో పంచాయితీలకు తెలంగాణలో రాజకీయ రాద్ధాంతం చేస్తామంటే ఎలా..? అని ప్రశ్నించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో కెటిఆర్ మీడియాతో మాట్లాడారు.

పంచాయతీ నిధుల మళ్లింపుపై కేంద్ర బృందం పరిశీలన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధుల దారిమళ్లింపుపై కేంద్రం బృందం రాష్ట్రంలో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా కేంద్ర పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ సెక్రటరీ విజయ్‌కుమార్‌తో కూడిన కేంద్ర బృందం మంగళవారం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరితో విజయ వాడలో భేటీ అయ్యారు. రాష్ట్రానికి కేటాయించిన 14, 15వ ఆర్థిక సంఘం నిధుల్లో రూ.8,660 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మళ్లించిందని బృందం సభ్యులకు పురందేశ్వరి వివరించారు. పూర్తిస్థాయి విచారణ జరిపి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని బృందం తెలిపింది. పంచాయతీ నిధులను రాష్ట్రప్రభుత్వం దారిమళ్లించిందని పురందేశ్వరి కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

రూ.150తగ్గిన బంగారం

న్యూఢిల్లీ : అంతర్జాతీయ పరిణామాలతో బంగారం ధరల్లో స్వల్ప తగ్గుదల చోటు చేసుకుంది. మంగళవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.150 పెరిగి రూ.59,900గా నమోదయ్యింది. కిలో వెండిపై రూ.850 తగ్గి రూ.74,500గా పలికిందని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ వెల్లడించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక్క ఔన్స్ పసిడి ధర 1,912 డాలర్లుగా, వెండి ధర 23.05 డాలర్లుగా చోటు చేసుకుంది.

FINKURVE FINANCIAL SERVICES LIMITED

Corporate Office : Trade World, D-Wing, 2nd Floor, 202, Kamala Mill Compound Lower Parel (W), Mumbai, Maharashtra - 400013

PUBLIC NOTICE

Finkurve Financial Services LTD. through his facilitated partner Augmont Gold Tech Pvt. Ltd. వారి వద్ద తనఖా పెట్టిన బంగారు ఆభరణాల వేలం తేదీ: 30.09.2023 వ సమయం 10 గంటలకు Augmont Gold For All, Door No. 26-25-29, 1st Floor, Gnavoluvari Street, Gandhi Nagar, BRTS Junction, Vijayawda - 520003. వద్ద జరుగుతుంది అని ఇందుమూలంగా ప్రజలకు తెలియజేయుచున్నము. వివిధ ఖాతాదారులు తమ బకాయిలు చెల్లించడంలో. విఫలమైన కారణముగా వేలం జరుగుచున్నది. వేలం పాట నోటీసులు ఈ రుణగ్రహీతలకు కూడా జారీ చేయబడ్డాయి. గడువు తీరిన మరియు మార్జిన్ తక్కువ ఖాతల వివరాలు బ్రాంచ్ వారిగా క్రింద ఇవ్వబడినది.

VIJAYWADA : VIJA-43745, VIJA-79725, VIJA-67338, VIJA-89504.

For More Details, Contact :
Arja Vara Prasad, Mob. 8639248394

(Reserves the right to alter the number of accounts to be auctioned & / postpone / cancel the auction without any prior notice)

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ — **డిమాండ్ నోటీసు**

TATA

సంప్రదించాల్సిన చిరునామా: 11వ అంతస్తు, టవర్-ఎ, పెనిసులా బిజినెస్ పార్కు, గణపతురావు కదం మార్గ్, లోయర్ ప్యారెల్, ముంబయి-400 013, సంప్రదించాల్సి నం.(022)66069383.

దిసెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్సుమెంట్) రూల్స్, 2002 ("ది రూల్స్") యొక్క రూల్ 3తో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్సుమెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ("చట్టం") యొక్క సెక్షన్ 13(2) క్రింద.

ఏదైతే, క్రింది సంతకందారు టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (టిసిహెచ్ఎఫ్ఎల్) యొక్క అధీకృత అధికారిగా, చట్టం క్రింద మరియు రూల్స్ యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, దిగువ తేదీ నాటి వివరణాత్మక డిమాండ్ నోటీసు జారీచేసి, చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద, ఇందు దిగువ జాబితాలోని రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/హామీదారులు(అందరు విడివిడిగా లేదా కలిసి "బాధ్యులుగా")/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధులు దిగువ ఇవ్వబడిన వివరాల ప్రకారం, సదరు నోటీసు తేది నుండి 60 రోజుల్లోగా సదరు డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. సదరు నోటీసుల కాపీలు రిజిస్టర్డు పోస్టు అక్నాలెడ్జిమెంట్ ద్యూతో పంపబడినవి మరియు క్రింది సంతకందారు వద్ద అందుబాటులో ఉంటాయి. మరియు సదరు బాధ్యులు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధులు అవసరమనుకొంటే దానిని క్రింది సంతకందారు నుండి ఏదేని పనిదినమున ఆఫీసు పనివేళల్లో స్వీకరించవచ్చును.

పైదానితో సంబంధించి, ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, సదరు బాధ్యులచేత నిర్వహించబడిన ఏవేని రుణ ఒప్పందాలు మరియు ఇతర పత్రాలు/వ్రాతలతో చదువబడుతూ, సదరు నోటీసుల తేదీ నుండి 60 రోజుల్లోగా టిసిహెచ్ఎఫ్ఎల్‌కు చెల్లించవలసిందిగా మరోసారి సదరు బాధ్యులు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధులు ను కాలం (డి)లో దిగువ పేర్కొనబడిన సదరు తేదీల నుండి చెల్లించు వరకు దిగువ వివరించినట్లు తదుపరి వడ్డీతోపాటు వారి సదరు పేర్లకు ఎదురుగా ఇందు దిగువ గుర్తించిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడుచున్నది. రుణంను తిరిగి చెల్లించుటలో హామీగా, దిగువ సెక్యూర్డ్ అసెట్స్‌ను సదరు బాధ్యులుచేత టిసిహెచ్ఎఫ్ఎల్‌కు తాకట్టుపెట్టబడినవి.

క్ర. సం.	రుణ ఖాతా నం.	బాధ్యులు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధుల పేరు	దిగువ తేదీ నాటికి పూర్తి బకాయి మొత్తాలు (రూ)	డిమాండ్ నోటీసు తేది మరియు ఎన్‌పిఏ తేది
3.	9565723	శ్రీ ఖాజా అబ్దుల్ మజీద్ షేక్ (రుణగ్రహీత), శ్రీ షేక్ మస్తాన్ బీబి (సహ-రుణగ్రహీత)	14.09.2023 నాటికి రూ.22,39,532/- (రూపాయలు ఇరువై రెండు లక్షల ముప్పై తొమ్మిది వేల ఐదు వందల ముప్పై రెండు మాత్రమే)	14.09.2023 & 07.09.2023

స్థిరాస్తి యొక్క షెడ్యూలు: సర్వే నం.: 575.576 & 598; ఇంటి ఆస్తి విషయంలో ఒకవేళ ప్లింత్/నిర్మాణ ఏరియాతో కలిపి విస్తీర్ణం/ఏరియా: ప్లింత్ ఏరియా 1025చ.అ.లతో (ఉమ్మడి ఏరియా& ఒక కార్ పార్కింగ్ ఏరియాతోసహా) "సాయి కృప ఎంక్లేవ్" యొక్క రెండవ అంతస్తులో ఉన్న ఒక ఫ్లాట్ నం.304 మరియు 'ఎ'షెడ్యూలు ఆస్తి ఉద్దేశ్యంలో విడదీయలేని మరియు సూచించలేని సైటు భాగం 43 చ.గ.ల యొక్క మొత్తం భాగం; ప్రదేశం, గ్రామం, సిటీ, రిజిస్ట్రేషన్ సబ్ డిస్ట్రిక్ట్ వంటి వాటి పేరు వంటి లొకేషన్లు: గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్-డిస్ట్రిక్ట్, పెరెచెర్ల గ్రామపంచాయతి ఏరియా, పెరెచెర్ల గ్రామం, ప్లాట్ నం.లు 16పి& 29పి; సరిహద్దులు: "ఎ"షెడ్యూలు: తూర్పు: 60' వెడల్పు రోడ్డు, దక్షిణం: ప్లాట్ నం.29బి & 17ఎ యొక్క మిగతా భాగం; పడమర: 40' వెడల్పు రోడ్డు, ఉత్తరం: అనుబంధన ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క ఆస్తి, ఈ సరిహద్దుల్లో ఈజిమెంట్ అప్పుర్టెనంట్స్ మొ।। హక్కులతో కలిపి దాని ఉమ్మడి& జాయింట్ హక్కులతోపాటు అన్ని వసతులతోపాటు 1025చ.అ.ల ప్లింత్ ఏరియా (ఉమ్మడి ఏరియా& ఒక కార్‌పార్కింగ్ ఏరియాతో కలిపి)తో "సాయి కృప ఎంక్లేవ్" యొక్క రెండవ అంతస్తులో ఉన్న ఒక సంపూర్ణమైన ఫ్లాట్ నం.304 ఏదైతే "బి" షెడ్యూలు లో 2057చ.గ.ల సైటు పూర్తి విస్తీర్ణంలో 43చ.గ.ల సైటు కొలతల విడదీయలేని& సూచించని వాటా. మరియు సరిహద్దులు: తూర్పు: గ్రౌండ్ లో ఒపెన్ ఏరియా, దక్షిణం: గ్రౌండ్ లో ఒపెన్ ఏరియా, పడమర: ఉమ్మడి మెట్లు& ఉమ్మడి కారిడార్, ఉత్తరం: ఒపెన్ టు స్కై.

పై పేర్కొన్న సదరు డిమాండ్ నోటీసుల తేదీలలో మరింత స్పష్టంగా చూపినట్లుగా సదరు తేదీ నుండి చెల్లించు తేదీ వరకు వెచ్చించిన ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులు, చార్జీలు మొ।।వాటితో తదుపరి వడ్డీ, అదనపు వడ్డీరేటుతో చెల్లించవలసిందిగా కోరబడుచున్నది, ఒకవేళ సదరు బాధ్యులు పై చెప్పినట్లు టిసిహెచ్ఎఫ్ఎల్‌కు చెల్లించుటలో విఫలం చెందినట్లైతే, టిసిహెచ్ఎఫ్ఎల్ అనునది సదరు బాధ్యులు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధుల పూర్తి బాధ్యత పైననే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) మరియు వర్తించబడు రూల్స్ క్రింద పై సెక్యూర్డ్ అసెట్స్/స్థిరాస్తి(లు)పై చర్యలు తీసుకొంటుంది.

సదరు బాధ్యులు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధులు, టిసిహెచ్ఎఫ్ఎల్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా అమ్మకం, లీజు లేదా ఇతర విధానాల ద్వారా పై చెప్పిన సెక్యూర్డ్ అసెట్స్‌ను/స్థిరాస్తులను బదిలీచేయుట నుండి సదరు చట్టం క్రింద నిషేదింపబడినారు. ఎవరైనా వ్యక్తి చట్టం లేదా దాని క్రింద రూపొందించిన నియమాల ను ఉల్లంఘించినట్లైతే చట్టం క్రింద జైలు శిక్ష మరియు/లేదా జరిమానాకు బాధ్యులగుదురు.

తేది: 27.09.2023
ప్రదేశం: ముంబయి

సం/- అధీకృత అధికారి
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున

MOTILAL OSWAL HOME LOANS

మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టార్ ఆఫీసు: మోతిలాల్ ఓస్వల్ టవర్, రహిమ్‌తుల్లా సయాని రోడ్, పారెల్ ఎస్‌టి డిపోట్ ఎదురుగా, ప్రభాదేవి, ముంబయి-400025. టెలి: (022) 47189999, వెబ్‌సైట్: www.motilaloswalhf.com, ఇ మెయిల్: hfquery@motilaloswal.com

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి/ల కొరకు)

ఏదైతే, అస్పైర్ హోమ్ ఫైనాన్స్ కార్పోరేషన్ లిమిటెడ్ యొక్క దిగువ సంతకందారుడైన అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఇన్ కంప్లియన్స్ ఆఫ్ రూల్ 8(1) ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి సదరు నోటీసు/ల స్వీకరణ యొక్క నోటీసు(ల)/ తేది నుండి 60 రోజులలోగా ప్రతి ఖాతా ఎదురుగా పేర్కొన్న మొత్తం తిరిగిచెల్లించమని సంబంధిత రుణగ్రహీత/లు పిలుస్తూ ప్రతి ఖాతా ఎదురుగా పేర్కొన్న తేదిన డిమాండ్ నోటీసు/లు జారీ చేయబడినాయి.

రుణగ్రహీత/లు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలం చెందినారు, సెక్యూరిటీ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించి క్రింద వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారుడు స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత/లు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తి/లతో ఏవిధమైన లావాదేవీలు నిర్వహించరాదని, సదరు ఆస్తి/లతో నిర్వహించబడు ఏవేని లావాదేవీలు అస్పైర్ హోమ్ ఫైనాన్స్ కార్పోరేషన్ లిమిటెడ్ యొక్క చార్జ్‌కు లోబడి మాత్రమే జరుగవలెనని ప్రత్యేకించి రుణగ్రహీత/లు మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలంగా హెచ్చరించడమైనది. రుణగ్రహీతలకు గమనించాల్సిందేమనగా ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్ విడిపించుకొనుటకు ఉన్నంత సమయంలో చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) నిబంధనలకు అహ్వానించడమైనది.

క్ర. సం	లోన్ అగ్రిమెంట్ నెం./రుణగ్రహీత /సహ రుణగ్రహీత/హామీదారుడు పేరు	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	స్వాధీనం చేసుకున్న తేది	తనఖాపెట్టిన ఆస్తు/ల వివరణ
1	LXGUN00417-180067409 ఆదినారాయణ పోతూరి మరియు లక్ష్మి కట్టేర	08-06-2023 for Rs. 916695/-	21-09-2023	డో.నం.149, గొల్లపాడు గ్రామం కంఠం, శ్రీ సీతారామ స్వామి గుడి వద్ద, గొల్లపాడు గ్రామ పంచాయతీ, ముప్పల మండలం, గుంటూరు జిల్లా, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522408.
2	LXGUN04119-200075801 పోరుమల్ల శివ నాగేశ్వరరావు మరియు పోరుముల్ల నాగ రాధిక	08-06-2023 for Rs. 596941/-	21-09-2023	సర్వే నం.34/2, మూల్యాంకనం నం.57-143/4, గోరంట్ల రామాలయం గుడి వద్ద, గుంటూరు, మూల్యాంకనం నం.135176, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522034.
3	LXVIJ00417-180051177 బాపనపల్లి సుబ్బారావు మరియు బాపనపల్లి వాణి	24-08-2021 for Rs. 1647835/-	22-09-2023	ఆర్.ఎస్.నం.235, వార్డు నం.-5, డో.నం.-5-378/బి, మంగళగిరి, రామాలయం గుడి, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522503.
4	LXLXMOVIJAYW721-220627286 & LXMOVIJAYW921-220626750 నాగరాజు అంగిరేకుల మరియు పార్వతి అంగిరేకుల	13-04-2023 for Rs. 1483762/-	23-09-2023	మూల్యాంకనం నం.1174, ఎస్‌వై.నం.60-4, పెరకలపుడి గ్రామ పంచాయతీ దుగ్గిరాల మండలం, జెడ్‌పిహెచ్ హై స్కూల్ 522305 గుంటూరు, ఆంధ్రప్రదేశ్

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్
తేది: 27.09.2023

సం/-
అధీకృత అధికారి,
(మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్)

*అనువాదంలో వ్యత్యాసం ఉన్నట్లయితే, ఇంగ్లీష్ వర్షన్‌ను పరిగణించగలరు.

హై లెవల్ వంతెన కోసం 'చలో అసెంబ్లీ'

గంపలగూడెంలో అరెస్టయిన సిపిఎం నేతలు

- సిపిఎం నేతల ముందస్తు అరెస్టు

ప్రజాశక్తి - గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, విస్సన్నపేట :

ఎన్‌టిఆర్ జిల్లా గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరుపై ఐదేళ్ల క్రితం కూలిపోయిన వంతెన స్థానంలో హై లెవల్ వంతెన నిర్మించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం చేపట్టిన 'చలో అసెంబ్లీ'ని పోలీసులు అడ్డుకున్నారు. వంతెనపై తరచూ రాకపోకలు సాగించే తిరువూరు నియోజకవర్గంలోని గంపలగూడెం, తిరువూరు, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాలకు చెందిన సిపిఎం నేతలను, కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. పోలీసుస్టేషన్లకు తరలించి నిర్బంధించారు. సాయంత్రానికి విడుదల చేశారు. మొత్తం నాలుగు మండలాలకు చెందిన సుమారు 26 మంది నేతలను, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. నేతల అక్రమ అరెస్టులకు నిరసనగా గంపలగూడెం తహశీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఐదేళ్ల క్రితం కూలిపోయిన వంతెనను నిర్మించాలని కోరితే అరెస్టులకు పూనుకోవడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అరెస్టయిన వారిలో సిపిఎం గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల కార్యదర్శులు గువ్వల సీతారామరెడ్డి, జెట్టి వెంకటేశ్వరరావు, నాగరాజు, తిరువూరు పట్టణ నాయకులు పంతంగి శ్రీనివాసరావు, ఆకుల రవి, సీనియర్ నాయకులు ఎస్‌వి.భద్రం, గొల్లమందల తండా సర్పంచ్ డి.రాముడు తదితరులు ఉన్నారు. తిరువూరు స్టేషన్‌లో ఉన్న నేతలను సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.సిహెచ్.శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.సిహెచ్. సుప్రజ పరామర్శించారు.

ఐదేళ్లలో రూ.32,059 కోట్లు

- ప్రాజెక్టుల వ్యయంపై అంబటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గత ఐదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులకు రూ.61,573 కోట్లు కేటాయించగా, రూ.32,059 కోట్లు ఖర్చు చేసినట్లు జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. మంగళవారం శాసనమండలిలో సాగునీటి ప్రాజెక్టులపై జరిగిన చర్చలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో జరిగిన పురోగతిని ప్రస్తావించారు. ప్రధానంగా ప్రకాశం జిల్లాలో పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఇందుకు మంత్రి సమాధానం చెబుతూ.. ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి నల్లమల సాగర్ నుంచి 500 టిఎంసిల నీటిని నిల్వచేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. గుంటూరు ఛానల్, వరికపూడిశెలకు నిధులు కేటాయించి వెంటనే పనులు చేపట్టాలని లక్ష్మణరావు కోరారు. ఇందుకు మంత్రి అంగీకరించారు.

విద్యార్థులు తినకపోతే నోటీసులు ఇస్తారా?

విద్యార్థులు జగనన్న గోరుముద్ద ఆహారం తీసుకోకపోతే పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు నోటీసులు ఇవ్వడం సమంజసం కాదని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఇందుకు మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. అందరికీ ఆహారం అందిస్తున్నామని, అందరూ తినేలా చూడాలని మాత్రమే ప్రధానోధ్యాయులకు చెబుతున్నామని అన్నారు.

విశ్వవిద్యాలయాల్లో ఖాళీలు భర్తీ చేయాలి

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఉన్న ఖాళీలను వెంటన భర్తీ చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావు, షేక్ షాబ్జీ కోరారు. ఇందుకు మంత్రి బొత్స సత్యనారాయణ సమాధానం చెబుతూ.. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో 3,282 అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఇతర ఉద్యోగుల ఖాళీలు 5,006 ఉన్నాయన్నారు. ఖాళీ పోస్టులను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికపై భర్తీ చేశామన్నారు. రెగ్యులర్ ప్రాతిపదికన పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి చెప్పారు. ఈ అంశంపై లక్ష్మణరావు మాట్లాడుతూ.. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేక విద్యా ప్రమాణాలు దిగజారుతున్నాయన్నారు.

సర్వహక్కుల కోసమే అసైన్డ్‌మెండ్ చట్ట సవరణ : మంత్రి ధర్మాన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : అసైన్ భూములు కలిగిన వారికి సర్వహక్కులు కల్పించే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ ల్యాండ్స్ చట్టాన్ని సవరిస్తుందని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శాసనమండలిలో మంగళవారం ప్రవేశపెట్టిన ఈ బిల్లుపై మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో 30 లక్షల ఎకరాలు అసైన్డ్ భూముల పంపిణీ జరిగిందన్నారు. అసైన్డ్ భూమి కేటాయించి ఇరవై ఏళ్లు దాటితే ఆ లబ్ధిదారుడికి సర్వహక్కులూ కల్పిస్తామన్నారు. వీటిల్లో అర్హత కలిగిన వారందరికీ అందిస్తామని, అర్హులు లేకపోతే ఆ భూమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. భూమిని అభివృద్ధి చేసుకునే, బ్యాంకులో తాకట్టు పెట్టుకుని రుణాలు తీసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. గతంలో కేటాయించిన భూమి చేతులు మారినా కుదరదన్నారు. టైటిల్ పూర్వం కేటాయించిన వారి పేరుమీదే ఉంటుందని, భూమి వారి చేతుల్లో లేదని ఫిర్యాదు చేస్తే మరలా వారికే కేటాయిస్తామన్నారు. లబ్ధిదారులు ఇరవై ఏళ్లు కాలవ్యవధి ముగిసిన తరువాత ప్రభుత్వాన్ని సంప్రదించకుండా భూమిని అన్యాక్రాంతం చేయవచ్చునని చట్టంలో పేర్కొంది. అయితే అమ్ముకునే హక్కు కల్పించేందుకు తీసుకొచ్చిన బిల్లు కాదని మంత్రి చెప్పడం గమనార్హం.

పున:పరిశీలించాలి : వైసిపి సభ్యులు వెంకట రమణ

ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ ల్యాండ్స్ చట్ట సవరణ బిల్లుపై వైసిపి సభ్యులు జయమంగళ వెంకట రమణ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ బిల్లులో కొన్ని అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం ఈ అంశంపై పున:పరిశీలించాలని సూచించారు. అసైన్డ్‌మెండ్ చట్టం కింద పేదలకు కేటాయించిన భూములు 90 శాతం వారి దగ్గర లేవన్నారు. వందల ఎకరాలు ఉన్నవారు పేదల నుంచి అసైన్డ్ భూములను తీసుకుని వాటికి పట్టాలు పుట్టించి సాగు చేసుకుంటున్నారని తెలిపారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లతో ఫోర్జరీ కంట్రోల్

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్స్‌తో ఫోర్జరీలను నివారించవచ్చని రెవిన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శాసనసభలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్స్‌పై మంగళవారం ప్రశ్నోత్తరాల్లో సమాధానమిచ్చారు.

IKF Home Finance

ఐకెఎఫ్ ఫైనాన్స్ లిమిటెడ్

ప్లాట్ నం.30/ఎ, సర్వే నం.83/1, మై హెమ్ ట్విట్జా, 11వ అంతస్తు, డైమండ్ హిల్స్, లుంబిని అవెన్యూ, 400/220/132కెవి జిఐఎస్ సబ్ స్టేషన్ ప్రక్కన, ఎపిఐఐసి హైదరాబాద్ కాలెడ్జి సిటీ, రాయ్‌దుర్గ్, హైదరాబాద్-081. ఫోన్ : 040-23412083, www.ikfhomefinance.com

స్థిరాస్తుల అమ్మకం కొరకు విక్రయ నోటీసు

అనుబంధం-4-ఎ (రూల్ 8(6)కు నియమలను చూడండి)

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయ నోటీసు

సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన స్థిరాస్తులు ఐకెఎఫ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు తాకట్టు/చార్జ్ చేయబడినవి, వాటిని ఐకెఎఫ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి ద్వారా భౌతికంగా స్వాధీనం చేసుకోబడినవి, పట్టికలో పేర్కొన్న రుణగ్రహీతలు మరియు హామీదారుల నుండి ఐకెఎఫ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు మిగతా బకాయిలను రాబట్టుట కొరకు ఇ-వేలంలో "ఎక్కడ ఏది", "ఎలా ఉన్నది అక్కడనే" మరియు "అది అలాగే" ప్రాతిపదికన విక్రయించబడుతుంది. రుణగ్రహీతలు మరియు హామీదారుల వివరాలు, బకాయి మొత్తాలు, స్థిరాస్తి సంక్షిప్త వివరణ మరియు వాటిపై తెలిసిన రుణభారాలు, స్వాధీనం విధానం, రిజర్వు ధర మరియు ధరావత్తు, వేలం తేది మరియు సమయం అనునవి క్రింద ఇవ్వబడినవి:

రుణగ్రహీత పేరు: (1) శ్రీమతి. అనురాధ మంతెన, భర్త. సత్యనారాయణ రాజు మంతెన, 2. శ్రీమతి. అనురాధ మంతెన, భర్త. సత్యనారాయణ రాజు మంతెన (రుణగ్రహీత)/ సహ రుణగ్రహీత యొక్క చట్టపరమైన వారసులు, 3. శ్రీ.హర్షిత, తండ్రి. లేట్ సత్యనారాయణ రాజు మంతెన, మైనర్, ఆమె సహజ సంరక్షకులు తల్లి శ్రీమతి. అనురాధ మంతెన ద్వారా ప్రాతినిధ్యం, చట్టపరమైన వారసులు 5. శ్రీ. సత్యనారాయణ రాజు మంతెన, తండ్రి. కృష్ణమూర్తి రాజు, మరణించారు, అతని చట్టపర వారసుల ద్వారా ప్రాతినిధ్యం (సహ రుణగ్రహీత), 6. శ్రీ.రామచరణ్ వర్మ, తండ్రి. లేట్ సత్యనారాయణ రాజు మంతెన, మైనర్, అతని సహజ సంరక్షకులు తల్లి, శ్రీమతి. అనురాధ మంతెన ద్వారా ప్రాతినిధ్యం, చట్టపరమైన వారసులు, క్ర.సం.1,3,5 మరియు 6 చిరునామా : డో.నం.9-9, శివాలయం వీధి, ఎనికేపాడు, విజయవాడ, కృష్ణాజిల్లా-521108. క్ర.సం.2,4 మరియు 7 చిరునామా : ఫ్లాట్ నం.:ఎఫ్ఎఫ్/3, జ్ఞానశ్రీ రెసిడెన్సీ, శివాలయం వీధి, ఎనికేపాడు, కృష్ణాజిల్లా-521108.

లోన్ ఎకౌంట్ నం: LNVJY01019-200001612 — **డిమాండ్ నోటీసు తేది : 17.03.2023**

బకాయి మొత్తం : రూ.8,27,049/- (ఎనిమిది లక్షల ఇరవై ఏడు వేల నలభై తొమ్మిది రూపాయలు మాత్రమే) 16.03.2023 నాటికి వడ్డీ+ ఖర్చుల మొదలైన వాటితో.

షెడ్యూల్-ఎ : స్థిరాస్తుల వివరణ

కృష్ణాజిల్లా, గుణదల, విజయవాడ తూర్పు రిజిస్ట్రార్ జిల్లా, ఎనికేపాడు గ్రామ పంచాయతీ ఏరియా, ఎనికేపాడు గ్రామం వద్ద ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ "జ్ఞానశ్రీ రెసిడెన్సీ" యొక్క ఒకటవ అంతస్తులో ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్-3, బిల్టప్ ఏరియా 340.0 చ.అ.లు. తో కామన్ ఏరియా 60.0 చ.అ.లు. పార్కింగ్ 20.0 చ.అ.లు. తో కలిపి ఆర్.ఎస్.నం.213/6 లో అవిభక్త ఉమ్మడి పరిధిలో 14 చ.గ.లు. మొత్తం నుండి బయటకు 189.0 చ.గ.లు. స్థలం సరిహద్దులు : తూర్పు: పొదిలి నరసింహారావు ఆస్తి-45.30 అ.లు., దక్షిణం: బత్తిన వెంకటేశ్వరరావు ఆస్తి-38.0 అ.లు., పడమర: 6.0 వెడల్పు రోడ్డు-44.30 అ.లు., ఉత్తరం: నయని రామతారకం ఆస్తి-38.0 అ.లు., ఫ్లాట్ సరిహద్దులు : తూర్పు: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్-4, పడమర: కామన్ కారిడార్, మెట్లకేస్, ఉత్తరం: ఓపెన్ టు స్కై.

రిజర్వు ధర: రూ.9,45,000/- ; ఇఎమ్‌డి: రూ.94,500/- బిడ్ పెంపుదల: రూ.5,000/-

ఇ-వేలం తేది& సమయం: 18.10.2023, సమయం: ఉ.01.00 గం.లు నుండి 02.00గం.లు వరకు
బిడ్ కొరకు ప్రతిసారి ఐదు నిమిషముల అపరిమిత పొడిగింపులతో, బిడ్ కొనసాగితే, అమ్మకం వరకు నిర్ధారించబడింది.

ఏదైనా స్పష్టత కొరకు దయచేసి సంప్రదించండి :	అధీకృత అధికారి : శ్రీ.బాల కరుణాకర్ రెడ్డి, ఫోన్ నం.: 7995545355, శ్రీ.వై. విజయ భాస్కర్ రెడ్డి, ఫోన్ నం.: 9703051555.

బిడ్ అప్లికేషన్ తో ఇఎమ్‌డి తో పాటు కెవైసి డాక్యుమెంట్ల సమర్పణ కొరకు చివరి తేది: 17.10.2023, సా.04.00 గం. వరకు
11.10.2023, సా.5.00 గం. న లేదా అంతకు ముందు ముందస్తు అపాయింట్‌మెంట్‌తో ఏదైనా పని రోజున ఆస్తి తనిఖీ జరుగుతుంది.

నిబంధనలు మరియు షరతులు: (1) కాగోరు బిడ్డర్ ఇ-వేలంలో పాల్గొనుటకు రిక్వెస్ట్ లెటర్‌తో సహా యుటిఆర్ నంబర్ వంటి బయానా డిపాజిట్ ఆధారం దాఖలు చేయాలి, సెల్ఫ్ అటెస్టెడ్ కాపీలు (i) గుర్తింపు నిర్ధారణ (కెవైసి) అనగా ఐడి కార్డ్/డ్రైవింగ్ లైసెన్స్/పాస్‌పోర్ట్ వగైరా., (i) ప్రస్తుత చిరునామా- సమాచారం నిర్ధారణ, (iii) బిడ్డర్ పాన్‌కార్డ్ (iv) చెల్లుబాటయ్యే ఇ-మెయిల్ ఐడి (V) సంప్రదించాల్సిన నంబర్ (Vi) ఇ-మెయిల్ ఐడి Recovery@ikfhomefinance.com కి ఒరిజినల్ డాక్యుమెంట్‌ల స్కాన్‌చేసిన కాపీలు దాఖలు చేయవచ్చు మరియు ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ కార్పొరేట్ కార్యాలయం : ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, మై హోం ట్విట్జా, 11వ అంతస్తు, ఎమ్ హోటెల్, హైటెక్ సిటీ మెయిన్ రోడ్డు, బి/ఎస్ ట్రాన్స్‌కో సబ్ స్టేషన్, రాయ్‌దుర్గ్, హైదరాబాద్, తెలంగాణ-500081. (2) బయాన వివరాలు(ఇఎండి) వివరాలు: ఇఎండి మొత్తాన్ని ఆర్‌టిజిఎస్/నెఫ్ట్ ద్వారా ఇక్కడ పేర్కొన్న ఖాతా వివరాలకు జమ చేయాలి: ఎ/సి నం.: 11520200014177, IFSC: FDRL0001152, బ్యాంక్ పేరు: ది ఫెడరల్ బ్యాంక్ లిమిటెడ్, శాఖ: గవర్నర్‌పేట్ విజయవాడ - 520 002. (3) తదుపరి వివరణలకు బిడ్డర్లు బ్యాంక్ అమోదిత సర్వీసు ప్రొవైడర్ మెస్సర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్., భవనం 301, ఉద్యోగ్ విహార్, ఫేజ్-2, గల్ఫ్ పెట్రోకెమ్ భవనం, గుర్గావ్, హర్యానా-122015, https://www.bankeauctions.com, హెల్ప్ లైన్ +91-124-4302020/21/22/23/24, +91-9700333933, ఇమెయిల్ ఐడి: support@bankeauctions.com మరియు bikkina.gandhi@c1india.com, ఇ-వేలం తేదికి ముందు సంప్రదించవలెను.

తేది: 26.09.2023 ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, ఐకెఎఫ్ ఫైనాన్స్ లిమిటెడ్.

సంపాదకీయం

కాగ్ తలంటు...

రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు, నిర్వహణపైన, రాష్ట్ర రాజధాని అమరావతి విషయంలోనూ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) చేసిన వ్యాఖ్యలు అక్షర సత్యాలు. పాలకుల తీరుతెన్నులను కాగ్ వెల్లడించింది. సామాన్యులకు ప్రభుత్వ సేవలను క్షేత్రస్థాయిలో అందించడంలో సచివాలయ వ్యవస్థ పాత్ర పోషిస్తున్నప్పటికీ రాజ్యాంగ స్ఫూర్తిని నీరుగార్చేలా ఉంది. 74వ రాజ్యాంగ సవరణ చట్టం పట్టణ స్థానిక సంస్థలకు రాజ్యాంగ హోదాను అందించింది. ఈ చట్టం భారత రాజ్యాంగంలోని 12వ షెడ్యూల్‌లో పేర్కొన్న 18 విధులు నిర్వహించేందుకు పట్టణ స్థానిక సంస్థలకు అధికారం ఇచ్చింది. వాటిలో 13 విధులను పూర్తిగాను, మూడు విధులను పాక్షికంగానూ నగర పాలక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఇక పురపాలక / నగర పంచాయతీల విషయానికి వస్తే ఏడు విధులను పూర్తిగాను, ఐదు విధులను పాక్షికంగానూ అప్పగించింది. వార్డు, గ్రామ సచివాలయాల వ్యవస్థను 2019 జులై నుంచి నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో రాష్ట్రప్రభుత్వం అమలు చేయడం ప్రారంభించింది. రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికలు జరపడం లేదు. ఎక్కువ స్థానిక సంస్థలు ఎన్నికైన ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం లేకుండా రాష్ట్రప్రభుత్వ కనుసన్నల్లో... ప్రత్యేక అధికారుల పాలనలోనే మగ్గుతున్నాయి. ఎన్నికైన ప్రజాప్రతినిధులు, పౌరులను భాగస్వామ్యం చేయడం, పౌరులకు పాలనను చేరువ చేయడం స్థానిక స్వపరిపాలన ప్రధాన లక్ష్యం. రాష్ట్రంలో ఎక్కడా వార్డు కమిటీలను ఏర్పాటు చేయనే లేదు. ఇక పౌరులను భాగస్వామ్యం చేసే పరిస్థితి అసలు లేదు. ఇవి రెండూ చేపట్టకుండా వార్డు స్థాయిలో సచివాలయాల వ్యవస్థ రూపుదిద్దుకోవడం స్థానిక స్వపరిపాలనకు ఉద్దేశించిన రాజ్యాంగ స్ఫూర్తిని నీరుగార్చడమే. వార్డు కమిటీలను ఏర్పాటు చేసి, ఆయా కమిటీలు, ఏరియా సభలతో వార్డు సచివాలయాలను అనుసంధానం చేస్తేనే స్వపరిపాలన సాధ్యమవుతుందన్న కాగ్ సిఫార్సులు అనుసరణీయం. 74వ రాజ్యాంగ సవరణ చట్టం, ఆంధ్రప్రదేశ్ పురపాలక చట్టాల్లోని నిబంధనలకు అనుగుణంగా పాలన నడవాలి.

కేంద్రప్రభుత్వం మెడలు వంచి నిధులు రాబట్టలేకపోవడం, గత, ప్రస్తుత ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్వాకం రాజధాని అమరావతికి తీవ్ర నష్టాన్ని కలిగించాయి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు మారినా... ప్రజలకు సేవ చేసే విషయంలో పోటీపడి, ప్రజాధనానికి నష్టం కలగకుండా చేయాల్సిన బృహత్తర కర్తవ్యం పాలకులది. ఆ స్ఫూర్తిని ప్రభుత్వాలు మంటగలిపితే... కలిగే అనర్థాలకు అమరావతి ఓ సజీవ సాక్ష్యం. 2019 నుంచి అమరావతికి బడ్జెట్ సహకారం లేకపోవడం, రూ.33,476 కోట్లు రుణంగా సమీకరించు కోవాల్సి ఉండగా, రూ.8,540 కోట్లే సమీకరించడం, కాలపరిమితి లేకుండా ఉన్న 55 ప్యాకేజిల ఒప్పందాలపై అనిశ్చితి, వాటిని పూర్తి చేయడానికి అవసరమైన రూ.28,048 కోట్లపై స్పష్టత లేకపోవడం... ఇలా ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని కాగ్ ఎండగట్టింది. భూసమీకరణకు రూ.2,245 కోట్లు సిఆర్‌డిఎ వ్యయం చేయగా, ఆ భూమంతా నిరుపయోగంగా పడి వుంది. ఈ విషయంలో అమరావతిని ఒక భ్రమరావతిలా కంప్యూటర్ గ్రాఫిక్స్ చూపిన గత ప్రభుత్వ నిర్వాకం కూడా సరికాదు. ప్రభుత్వ భూములను వదిలేసి ప్రైవేటు భూములనే రాజధానికి సేకరించడం, 70 శాతాన్ని భూసమీకరణ ద్వారా సేకరించాలని అప్పట్లో తీసుకున్న నిర్ణయాన్ని కాగ్ నివేదిక ఆక్షేపించింది. ఈ నిర్ణయం కారణంగా రానున్న కాలంలో భారీ ఆర్థిక భారం పడనుందని హెచ్చరించింది. మాస్టర్ ప్లాన్ తయారీలో కన్సల్టెంట్లను నామినేషన్ పద్ధతిలో ఎంపిక చేయడం, స్పష్టమైన ఆర్థిక ప్రణాళికలు లేకుండా రూ.33,476 కోట్లతో సిఆర్‌డిఎ, ఎడిసిఎల్‌లు అనేక ప్యాకేజీలకు ఒప్పందాలు కుదుర్చుకోవడం వంటివి ఎన్నో! ఫలితంగా 2016 నుంచి 2023 వరకు రూ.55,343 కోట్లు అవసరం కాగా, కేవలం రూ.11,487 కోట్లు మాత్రమే సమీకరించుకోగలిగారు. రాజధాని నేటికీ పూర్తికాలేదు. భూములిచ్చిన రైతులు రోడ్డున పడ్డారు. ఇప్పటికైనా రాజధాని అమరావతి నిర్మాణాన్ని పూర్తిచేయడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత.

మహనీయుల మాట

సమాజంలో దోపిడీకి, అణచివేతకు గురవుతున్న కార్మికుల ప్రయోజనాలు అన్ని దేశాల్లోనూ ఒకే విధంగా ఉంటాయి.

- క్లారా జట్కిన్

కర్ణాటక బిజెపి టిక్కెట్ల కుంభకోణం!

విమర్శ

ఉద్రేక, ఉన్మాద ఉపన్యాసాలు చేసి రెచ్చగొట్టటంలో పేరు మోసిన హిందూత్వ నేతగా పేరున్న చైత్ర కుందాపుర, శ్రీ హలస్వామి మహాసంస్థాన్ మఠ అధిపతి అభినవ హలస్వామి, వారితో చేతులు కలిపిన బిజెపి యువ మోర్చా నేతలు, ఇతరులు ఈ 'టికెట్ కేసు'లో ఉన్నారు. అధికారంలో ఉన్న పెద్దలతో తమకు ఉన్న సంబంధాలను ఉపయోగించి నామినేటెడ్ పోస్టులు, కాంట్రాక్టులు, ఎన్నికల్లో పోటీకి టిక్కెట్లు ఇప్పిస్తామంటూ డబ్బులు కొట్టేసేవారి గురించి బయటకు తెలిసేది తక్కువ. ఎందుకంటే చెప్పుకుంటే పరువు పోతుందని అనేక మంది తేలుకుట్టిన దొంగల మాదిరి కిమ్మనరు. కర్ణాటకలో ఇప్పుడు బిజెపి టిక్కెట్ల కుంభకోణం వెల్లడి కావటంతో ఆ పార్టీ ఇప్పుడు ఇరుకున పడింది. తమకేమీ సంబంధం లేదని పార్టీ నేతలు చెబుతుండగా, అగ్ర నేతల ప్రమేయం ఉందని కేసుల్లో అరెస్టయిన వారు అంటున్నారు.

ఆమె మూడు పదులు నిండకుండానే అన్ని విధాలుగా పేరు మోసిన కట్టర్ హిందూత్వ వాది. అతడు తన మఠం, కాషాయ దుస్తులతో మోసానికి పాల్పడిన మరో కట్టర్. వీరితో చేతులు కలిపిన మరో నలుగురితో కలసి వారు ఇప్పుడు బెంగళూరు పోలీసు కస్టడీలో ఉన్నారు. ఉద్రేక, ఉన్మాద ఉపన్యాసాలు చేసి రెచ్చగొట్టటంలో పేరు మోసిన హిందూత్వ నేతగా పేరున్న చైత్ర కుందాపుర, శ్రీ హలస్వామి మహాసంస్థాన్ మఠ అధిపతి అభినవ హలస్వామి, వారితో చేతులు కలిపిన బిజెపి యువ మోర్చా నేతలు, ఇతరులు ఈ 'టికెట్ కేసు'లో ఉన్నారు. అధికారంలో ఉన్న పెద్దలతో తమకు ఉన్న సంబంధాలను ఉపయోగించి నామినేటెడ్ పోస్టులు, కాంట్రాక్టులు, ఎన్నికల్లో పోటీకి టిక్కెట్లు ఇప్పిస్తామంటూ డబ్బులు కొట్టేసేవారి గురించి బయటకు తెలిసేది తక్కువ. ఎందుకంటే చెప్పుకుంటే పరువు పోతుందని అనేక మంది తేలుకుట్టిన దొంగల మాదిరి కిమ్మనరు. కర్ణాటకలో ఇప్పుడు బిజెపి టిక్కెట్ల కుంభకోణం వెల్లడి కావటంతో ఆ పార్టీ ఇప్పుడు ఇరుకున పడింది. తమకేమీ సంబంధం లేదని పార్టీ నేతలు చెబుతుండగా, అగ్ర నేతల ప్రమేయం ఉందని కేసుల్లో అరెస్టయిన వారు అంటున్నారు.

ఉడిపి జిల్లాలోని బైందూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో తనకు బిజెపి టిక్కెట్ ఇస్తామంటూ డబ్బు తీసుకొని మోసం చేశారని గోవిందబాబు పూజారి అనే వ్యాపారవేత్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రధాని, కేంద్ర హోం మంత్రి కార్యాలయం, ఆర్‌ఎస్‌ఎస్ నేతలతో తమకు ఉన్న సంబంధాల గురించి చెప్పి డబ్బు వసూలు చేశారన్నది వారి మీద మోపిన నేరం. తనకు ఒకరిని పరిచయం చేసి అతగాడు ఆర్‌ఎస్‌ఎస్ నేత అని చెప్పారని, బిజెపి కేంద్ర ఎన్నికల కమిటీకి నిధులు అవసరమంటూ చెప్పటంతో అతగాడికి రూ. మూడు కోట్లు, మరో రూ. రెండు కోట్లు చైత్ర అనుచరులకు చెల్లించినట్లు పూజారి తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. డబ్బు తీసుకున్నప్పటి నుంచి వారంతా తప్పించుకుంటున్నారని తెలిపాడు.

ఎం. కోటేశ్వరరావు

అనేక రాష్ట్రాలలో ఇలాంటి మోసగాళ్లు ఎందరో ఉన్నారు. కర్ణాటకలో 2020లో బెంగళూరు పోలీసులు స్వామి అలియాస్ సేవాలాల్ అనే జ్యోతిష్కుడు యువరాజ్ రామదాస్‌ను అరెస్టు చేశారు. అతగాడు 2014 నుంచి 2020 వరకు అనేక మంది నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు వార్తలు వచ్చాయి. ఒక గవర్నర్, ఒక కేంద్ర మంత్రి, ఒక రాజ్యసభ సభ్యుడితో తనకు సన్నిహిత సంబంధాలున్నట్లు చెప్పేవాడు. 2015లో జౌళిశాఖ కేంద్ర మంత్రిగా ఉన్న సంతోష్ గాంగవార్‌కు శ్రీకాళహస్తికి చెందిన కోలా ఆనంద కుమార్ అనే వ్యక్తిని పరిచయం చేశాడు. కేంద్ర సిల్క్‌బోర్డు చైర్మన్ పదవి ఇప్పిస్తానంటూ ఒకటిన్నర కోట్ల రూపాయలు వసూలు చేశాడు. ఈ స్వామికి ఒక ప్రముఖ బిజెపి నేత తనను పరిచయం చేసినట్లు, తన దగ్గర డబ్బు తీసుకున్న తరువాత పదవీ లేదు, స్వామి ముఖం చాటేసినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆనందకుమార్ పేర్కొన్నారు. సదరు స్వామి ఒక ఎంపీని తిరిగి నామినేట్ చేయిస్తానని రూ. ఇరవై కోట్లు, కర్ణాటక హైకోర్టు మాజీ మహిళా జడ్జికి గవర్నర్ పదవి ఇప్పిస్తానంటూ రూ. ఎనిమిదిన్నర కోట్లు కోట్లు వసూలు చేశాడు. బిఎస్ ఇంద్రకళ అనే ఆ మాజీ జడ్జి నగదు రూపంలో నాలుగున్నర కోట్లు, ఆర్‌టిజిఎస్ ద్వారా రూ.3.77 కోట్లు చెల్లించారు. ఆమెను ఢిల్లీ తీసుకువెళ్లి కొంత మంది బిజెపి అగ్రనేతలను పరిచయం చేశారట. ఆమె 2020లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయమూర్తులుగా ఎలాంటి వారు ఎంపిక అవుతున్నారు, గవర్నర్ పదవులను కొనుక్కోవటం ఎంత సులభంగా ఉంటుందో డబ్బు, పలుకుబడి కలవారి ప్రయత్నాల గురించి ఈ ఉదంతం వెల్లడించింది. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ పెద్దలతో ఉన్న పలుకుబడితో తన కుమారుడికి ఉద్యోగం ఇప్పించమని ఒక డాక్టర్ రూ. 30 లక్షలు సమర్పించుకున్నారట. 2019లో స్వామి తనను రూ.పది కోట్లకు మోసం చేసినట్లు శశికాంత్ బంద్రే అనే వాణిజ్యవేత్త ఫిర్యాదు చేసిన తరువాత పైన పేర్కొన్న మోసాలన్నీ వెలుగులోకి వచ్చాయి.

ఇక హిందూత్వ నాయకురాలు చైత్ర కుందాపూర్, ఆమె గ్యాంగ్ మోసం చేసిన తీరు గురించి పోలీసులు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. మోసగాళ్ల ముఠాలో స్వామీజీతో పాటు కబాబ్‌లు తయారు చేసి అమ్ముకొనే వ్యక్తి, ఒక క్షురకుడు ఉన్నారు. తమ సైద్ధాంతిక గురువు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి, ప్రధాని కార్యాలయంలో తనకు పెద్ద తలకాయలు ఎందరో తెలుసని చైత్ర ప్రచారం చేసుకుంది. 2022లో వ్యాపారవేత్త పూజారికి ప్రసాద్ బైదూర్ అనే వ్యక్తిని పరిచయం చేసి అతను బిజెపి కార్యకర్త అని చెప్పారు. చైత్ర తలచుకుంటే రాష్ట్రంలో, కేంద్రంలో ఏదైనా సాధించగలదని అతను పూజారిని నమ్మించాడు. అది బాగా పని చేసిందని గ్రహించిన తరువాత ఆ ముఠా గగన్ కదూర్, రమేష్ నాయక్ అనే వారిని పరిచయం చేశారు. రమేష్ తన పేరును దాచి తాను చిక్‌మగళూరుకు చెందిన విశ్వనాథ్ అనే ఆర్‌ఎస్‌ఎస్ నేతనని గత 45 ఏళ్లుగా పని చేస్తున్నట్లు నమ్మించాడు. తరువాత బెంగళూరులోని ధనికులు నివాసం ఉండే ప్రాంతంలో చెన్నా నాయక్ అనే అతన్ని బిజెపి కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యుడని పరిచయం చేశారు. ఒక పర్యావరణవేత్త, పద్మశ్రీ అవార్డు పొందిన 110 సంవత్సరాల తిమ్మక్క కుమారుడు ఉమేష్‌తో గగన్ కదూర్‌కు పరిచయం ఉంది. ఆమెకు వయసు పైబడటంతో కాబినెట్ స్థాయి కల్పించి ఒక కారు కూడా ఇచ్చారు. ఉమేష్‌ను ఒప్పించి ఆ కారులో చెన్నా నాయక్, ఇతర ముఠా పూజారిని కలిశారు. అధికారిక కారును చూసి నిజంగానే పలుకుబడి కలిగిన వారని పూజారి నమ్మాడు. టిక్కెట్ కనుక రాకపోతే ఇచ్చిన సొమ్ము పూర్తిగా తిరిగి ఇస్తామని రమేష్ నాయక్ నమ్మబలికాడు. మూడు రోజుల్లో రూ.50 లక్షలు, తరువాత రూ.మూడు కోట్ల మేర వసూలు చేశారు. ఆ సొమ్ములో ఒకటిన్నర కోట్లు అభినవ హలశ్రీ స్వామి అనే మఠాధిపతికి చెల్లించినట్లు పూజారి పేర్కొన్నాడు. 2022 జులై ఏడు నుంచి 2023 జనవరి 16 వరకు మొత్తం ఐదు కోట్లు సమర్పించుకున్నాడు.

బిజెపి అభ్యర్థులను ప్రకటించటానికి కొద్ది రోజుల ముందు కాశ్మీరు లోని ఒక ఆసుపత్రిలో ఆర్‌ఎస్‌ఎస్ నేత విశ్వనాథ్ మరణించినట్లు గగన్ కదూర్ చెప్పాడు. అనుమానం వచ్చిన పూజారి విచారించగా అసలు ఆ పేరుగల వ్యక్తి లేడని తేలింది. దాంతో తన డబ్బు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేయటంతో మోసగాళ్ల ముఠా తప్పించుకు తిరిగింది. చివరకు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో అరెస్టు చేశారు. సెప్టెంబరు పన్నెండు నుంచి హలశ్రీ స్వామి పరారీలో ఉండి పందొమ్మిదవ తేదీ రాత్రి ఒడిషా పోలీసులకు చిక్కాడు. ఇంతకీ రమేష్ నాయక్ చిక్‌మగలూర్ లోని ఒక క్షురకుడు అని తేలింది. చెన్నానాయక్ బెంగళూర్ కెఆర్‌పురంలో వీధుల్లో కబాబ్‌లు అమ్ముతాడని పోలీసులు గుర్తించారు. పూజారి నుంచి కొట్టేసిన సొమ్ములో భారీ మొత్తాన్ని చైత్ర నొక్కేసింది.

బిజెపి నేత ఒకరు ఈ ముఠా వెనుక ఉన్నట్లు రాష్ట్ర మంత్రి ఆర్‌బి తిమ్మాపూర్ ఆరోపించారు. కొంత మందికి టిక్కెట్లు రాకపోవటంతో ఇలాంటి మోసాలన్నీ వెలుగు చూస్తున్నాయని మాజీ సిఎం, బిజెపి నుంచి కాంగ్రెస్‌లో చేరిన జగదీష్ షెట్టార్ అన్నారు. రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో ఉన్నవారికి టిక్కెట్లు ఇచ్చారని విమర్శించారు. అరెస్టు చేసిన వారెవరూ అసలు తమకు తెలియదని బిజెపి నేతలు చెబుతున్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు 80 శాతం కొట్టేసిన సొమ్ము ఆచూకీ దొరికినట్లు పోలీసులు చెప్పారు. రూ. ఒకటిన్నర కోట్లు తీసుకున్న హలశ్రీ స్వామి తప్పించుకోగా అతని కారు డ్రైవర్ పోలీసులకు దొరికాడు. సెప్టెంబరు ఎనిమిదవ తేదీన గోవింద పూజారి కేసు దాఖలు చేశారు. పన్నెండవ తేదీన చైత్రను ఉడిపిలో అదుపులోకి తీసుకున్నారు. అది తెలిసిన స్వామి ఆ రోజు హాజరు కావాల్సిన ఒక కార్యక్రమానికి వెళ్లకుండా తప్పించుకున్నాడు. భువనేశ్వర్ నుంచి బుద్ధ గయకు రైలులో వెళుతుండగా కటక్ వద్ద పోలీసులకు దొరికాడు.

విద్యార్థినిగా ఉండగా ఎబివిపిలో పని చేసిన చైత్ర కొన్ని పత్రికల్లో జర్నలిస్టుగా, స్పందన అనే టీవీలో యాంకర్‌గా పని చేసింది. హిందూత్వ కార్యకర్తగా మైనారిటీల మీద రెచ్చగొట్టే ప్రసంగాలతో అనేక పాత్రల్లో కనిపించిన చైత్ర 2018లో ఉడిపి పట్టణంలో కాంగ్రెస్ మీద ధ్వజమెత్తి వెలుగులోకి వచ్చింది. కేంద్ర మంత్రులు కూడా ఆమెను ఆకాశానికి ఎత్తారు. ముస్లింల మీద విద్వేష పూరిత ప్రసంగాలు చేసినందుకు ఆమెపై కేసులు కూడా నమోదు చేశారు. ఈ ఉపన్యాసాలకు బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ఏర్పాటు చేసిన ప్రదర్శనలు, సభలు, సమావేశాలే వేదికలు.

అవివాహిత అయిన చైత్ర కుందాపుర మీద ఉడిపిలో బిజెపి కార్యకర్త సుధీన్ ఒక కేసు దాఖలు చేశాడు. తన కోసం ఒక దుకాణాన్ని కట్టిస్తానని చెప్పి ఆమె రూ.ఐదు లక్షలు తీసుకున్నదని, అది చేయకపోగా సొమ్ము వాపసు అడిగితే అత్యాచారం చేసినట్లు కేసు పెడతానని, హత్య చేయిస్తానని బెదిరించినట్లు పేర్కొన్నాడు. బిజెపి టిక్కెట్ పేరుతో సొమ్ము తీసుకున్న వ్యాపారి పూజారిని కూడా బెదిరించినట్లు వెల్లడైంది. అరెస్టుకు ముందు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఒక లేఖ రాసి అతని వాణిజ్య లావాదేవీల మీద విచారణ జరపాలని, దర్యాప్తుకు తాను సహకరిస్తానని పేర్కొన్నది. తాను జర్నలిస్టుగా ఉన్నప్పటి నుంచి గోవిందబాబు పూజారి తెలుసునని, బిజెపి టిక్కెట్ కోసం చూశాడని, తాను ఒక ప్రైవేటు కంపెనీలో పని చేసినపుడు అతని అక్రమ లావాదేవీల గురించి తెలుసుకున్నట్లు రాసింది. అతని అక్రమాలను బయట పెట్టేందుకు అతనితో సంబంధాల్లో ఉండి సమాచారం సేకరించినట్లు చెప్పుకుంది. చిత్రం ఏమిటంటే సదరు పూజారికి ఎంఎల్‌ఏ టిక్కెట్ రాకున్నా, ఎన్నికలకు ముందు బిజెపి వెనుకబడిన తరగతుల మోర్చా కార్యదర్శి పదవిని బహూకరించారు. ఏ నియోజకవర్గంలో టికెట్‌ను ఆశించాడో అదే చోట బిజెపి అభ్యర్థికి ప్రచారం చేశాడు. అనేక మంది నేతలతో సంబంధాలను ఏర్పాటు చేసుకొని ఒక గుర్తింపు పొందాడు. అధికారం వచ్చిన తరువాత ఆ సొమ్మును ఏదో విధంగా రాబట్టుకోవచ్చని భావించి ఉండాలి. బిజెపి ఓడిపోవటం, పార్టీ పదవి ఉన్నా ప్రయోజనం లేదని గ్రహించిన తరువాత తన సొమ్ము తనకు ఇచ్చివేయాలని డిమాండ్ చేయటంతో అసలు కథ బట్టబయలైనట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

సెటైర్

దేశభక్తి క్రికెట్ టు హిందూత్వ క్రికెట్!

వారణాసి ఒక పుణ్యక్షేత్రంగా శతాబ్దాలుగా ఉంది. మోడీ ఆ నియోజకవర్గం నుండి పార్లమెంట్‌కి ఎన్నికై ప్రధాని పదవి చేపట్టాక అది అధికార పుణ్యక్షేత్రం అయి పోయింది. అటువంటి చోట నిన్న మోడీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దాంతో పుణ్యం కోసం, కర్మకాండల కోసం వారణాసి పోయే వారికి ప్రత్యేక దినాలలో క్రీడా వినోదం కూడా అందుబాటు లోకి రాబోతోందన్న మాట. రెలిజియస్ టూరిజం (పుణ్యక్షేత్రాలను, విహార యాత్రా స్థలాలను ఒకే ట్రిప్పులో సందర్శించే ఏర్పాటు) కాస్తా ఇప్పుడు రెలిజియస్ – స్పోర్ట్స్ – టూరిజం కాబోతోందన్న మాట. అక్కడే జ్ఞానవాపి మాస్క్ వివాదాన్ని రాజేస్తున్నారు గనుక అది రెలిజియస్ – స్పోర్ట్స్ – పొలిటికల్–టూరిస్టు స్థలంగా పరిణామం చెందవచ్చు. దేశంలో రామ భక్తి 12వ శతాబ్దం నుండే వ్యాప్తి చెందినా, అయోధ్య ఒక ప్రధాన పుణ్య క్షేత్రంగా గుర్తింపు తెచ్చుకున్నది బాబ్రీ మసీదును కూల్చివేసిన తర్వాతనే కదా. మరి ప్రధాని స్వయానా ప్రాతినిధ్యం వహిస్తున్న పుడు వారణాసికి ఎంత ప్రాధాన్యత ఉండాలి? అందుచేత అక్కడ క్రికెట్టూ వస్తుంది, మరేమైనా కూడా వచ్చితీరుతుంది.

విశేషం ఏమిటంటే వారణాసిలో నిర్మించబోయే క్రికెట్ స్టేడియంలో ఫ్లడ్‌లైట్లు త్రిశూలం ఆకారంలో ఉంటాయట! స్టేడియం ఆకారం ఢమరుకం (గారడీవాళ్ళు ఉపయోగించే ఢక్క) రూపంలో ఉంటుందట! ఈ గారడీలో వీక్షకులు కూర్చునే గ్యాలరీ గంగా ఘాట్ ను తలపిస్తుందట! బహుశా అక్కడ ఆటను చూడడానికి వచ్చేవాళ్ళు తప్పకుండా కాషాయం డ్రస్ వేసుకోవాలని నిబంధన పెడతారో ఏమిటో !

ఇన్నాళ్ళూ హిందూత్వ వాదులు "అంతర్జాతీయ" క్రికెట్ ఆటలో దేశభక్తిని మాత్రమే జొప్పించేరు. ఒకవేళ పాకిస్తాన్ ఆటగాళ్ళు మనవాళ్ళకన్నా బాగా ఆడి మ్యాచ్ గెలిచినా, మన వీక్షకులు మాత్రం పాకిస్తాన్‌ను మెచ్చుకోకూడదు. ఒకవేళ మెచ్చుకుంటే అది దేశద్రోహమే! ఇప్పుడు మరో అడుగు ముందుకేసి ఏకంగా హిందూత్వ సింబాలిజమ్‌ని ప్రవేశపెడుతున్నారు. రేప్పొద్దున్న మూడు వికెట్లు అంటే అది త్రిశూలమే అని, బ్యాట్ కి బదులు గద ఉపయోగించాలని, బంతిని బౌల్ చేయడం మానేసి విల్లు కి తగిలించే బాణానికి చివర బంతిని తగిలించాలని...ఇలా వినూత్న (!) ప్రక్రియల్ని గాని ప్రవేశపెడతారో ఏమో మరి! వీళ్ళ బారి నుండి క్రికెట్ ఆటను ఆ మహాశివుడే రక్షించుగాక !

కొసమెరుపు : నూతన విద్యా విధానం 2020లో తమ ప్రభుత్వం క్రీడలకు తక్కిన సబ్జెక్టులతో పాటు సమాన ప్రాధాన్యత ఇచ్చిందని నిన్న మోడీగారు శలవిచ్చారు. అంటే బహుశా చరిత్రలో, సైన్స్‌లో సిలబస్‌ను మార్చేసినట్టే, వారణాసి క్రికెట్ స్టేడియం ఆకారాన్నే మార్చేసినట్టే పిల్లల ఆటల నిబంధనలను కూడా మార్చేసి సనాతన (?) ధర్మాన్ని పాటిస్తారు అనుకోవాలి మరి. క్రికెట్ స్టేడియంలలోకి స్థానిక టీమ్‌లను ఆడుకోడానికి అడుగు పెట్టనివ్వరు. కేవలం చూడడానికే, అది కూడా టిక్కెట్టు కొనుక్కుంటేనే, అనుమతిస్తారు. బహుశా నూతన విద్యా విధానంలో క్రీడల పాలసీ కూడా ఆటగాళ్ళని తయారు చేసేదానికి బదులు వీక్షకుల్ని తయారు చేయడానికి అనువుగా ఉంటుందేమో!

ఇంతకూ వారణాసి క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ఎన్ని బుల్డోజర్లను ఎన్ని ఇళ్ల మీద ప్రయోగిస్తారో మరి?

- సుబ్రమణ్యం

మహిళా రిజర్వేషన్లపై నరేంద్ర మోడీ టక్కు టమారాలు

సమస్య

శారద

తమకు పూర్తి మెజారిటీ వస్తే దాన్ని తక్షణమే ఆమోదిస్తామని బిజెపి వాగ్దానం చేసింది. 2014లో, 2019లో అవసరమైన మెజారిటీ, సగానికంటే ఎక్కువ రాష్ట్రాలలో బిజెపి ప్రభుత్వాలే ఉన్నందున ఆ బిల్లు ఆమోదానికి ఆటంకం లేదు, అయినప్పటికీ తొమ్మిదేళ్లుగా దాని ప్రస్తావన, అసలు చొరవే చూపలేదు. నిజానికి అధికారానికి వచ్చిన వెంటనే ఆమోదం పొంది తక్షణమే అమల్లోకి వచ్చే విధంగా 2011 జనాభా ప్రాతిపదికన ఉన్న సీట్లలోనే మహిళల కోటా అమలు జరిపేందుకు ... పునర్విభజనతో నిమిత్తం లేకుండా అవసరమైన రాజ్యాంగ సవరణ చేసి ఉంటే అమల్లోకి వచ్చి ఉండేది. చిత్తశుద్ధి ముఖ్యం, అది లేదు కనుకనే విమర్శలు.

నాటకీయ పరిణామాల మధ్య నరేంద్ర మోడీ సర్కార్ పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో చట్ట సభల్లో 33 శాతం మహిళా బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం పొందింది. అది చట్టం కావటం లాంఛనమే. సగం రాష్ట్రాలు ఆమోదిస్తే దాని అమలుకు బాటపడుతుంది. ఏ అసెంబ్లీ, లోక్‌సభ సెగ్మెంట్ల లోని ఓటర్లలో పురుషులు ఎందరు, మహిళలు ఎందరు అనే వివరాలు ఇప్పటికే ఉన్నాయి గనుక కొందరు ఆ స్థానాలను ఉటంకిస్తూ అవన్నీ మహిళలకు రిజర్వు చేయబో తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. అసలు ఈ రిజర్వేషన్లు ఎప్పుడు అమల్లోకి వస్తాయంటే కొందరు 2029 నాటికి అని, మరికొందరు 2034 లేదా ఆ తరువాతే అని భాష్యం చెబుతున్నారు. ఇదే సమయంలో నియోజకవర్గాల పునర్విభజనలో ఏ రాష్ట్రంలో ఎన్ని సీట్లు పెరిగేదీ, ఎక్కడ ఎన్ని సీట్లు తగ్గేది కూడా కొన్ని అంకెలను కూడా ఉటంకిస్తున్నారు. తాజాగా ఆమోదం పొందిన బిల్లు ప్రకారం రిజర్వేషన్లు పదిహేను సంవత్సరాల పాటు అమల్లో ఉంటాయి. షెడ్యూలు కులాలు, తరగతులకు నిర్దేశించిన సీట్లలో కూడా మూడో వంతు సీట్లను మహిళలకు కేటాయిస్తారు. వెనుకబడిన తరగతుల మహిళకు రిజర్వేషన్లు ఉండాలన్న డిమాండ్‌ను బిజెపి ప్రభుత్వం పట్టించుకోలేదు.

రాజ్యసభలో 2010లోనే ఆమోదం పొందిన రిజర్వేషన్ బిల్లు లోక్‌సభ ఆమోదం పొందితే సరిపోతుంది. యుపిఏ ఏలుబడిలో ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న కొన్ని పార్టీల వ్యతిరేకత లేదా అభ్యంతరాల కారణంగా అది లోక్‌సభలోకి రాలేదు. తమకు పూర్తి మెజారిటీ వస్తే దాన్ని తక్షణమే ఆమోదిస్తామని బిజెపి వాగ్దానం చేసింది. 2014లో, 2019లో అవసరమైన మెజారిటీ, సగానికంటే ఎక్కువ రాష్ట్రాలలో బిజెపి ప్రభుత్వాలే ఉన్నందున ఆ బిల్లు ఆమోదానికి ఆటంకం లేదు, అయినప్పటికీ తొమ్మిదేళ్లుగా దాని ప్రస్తావన, అసలు చొరవే చూపలేదు. నిజానికి అధికారానికి వచ్చిన వెంటనే ఆమోదం పొంది తక్షణమే అమల్లోకి వచ్చే విధంగా 2011 జనాభా ప్రాతిపదికన ఉన్న సీట్లలోనే మహిళల కోటా అమలు జరిపేందుకు పునర్విభజనతో నిమిత్తం లేకుండా అవసరమైన రాజ్యాంగ సవరణ చేసి ఉంటే అమల్లోకి వచ్చి ఉండేది. చిత్తశుద్ధి ముఖ్యం, అది లేదు కనుకనే విమర్శలు. కారణాలు, ఉద్దేశ్యాలు ఏమైనప్పటికీ ముందు రోజు కాబినెట్‌లో ఆమోదించి మరుసటి రోజు లోక్‌సభలో, తరువాత రాజ్యసభలో ఆమోదానికి పెట్టారు. లోక్‌సభలో ఇద్దరున్న మజ్లిస్ మినహా మిగిలిన పార్టీలేవీ వ్యతిరేకంగా ఓటు వేయలేదు, రాజ్యసభలో ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, తరువాత లోక్‌సభ, ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపి ఈ పరిణామాన్ని ఎలా ఉపయోగించుకుంటుందో, జనానికి ఏం చెబుతుందో, ఓటర్లు ఎలా స్వీకరిస్తారో?

ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుంది? పదేళ్లకు ఒకసారి జరిగే జన గణన తరువాత లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరగాలన్నది స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జరిగిన నిర్ణయం. దీన్ని అమలు చేసేందుకు ఏర్పాటు చేసే కమిషన్‌కు ఒక విశ్రాంత సుప్రీం కోర్టు న్యాయమూర్తి అధ్యక్షత వహిస్తారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి, రాష్ట్రాల ఎన్నికల అధికారులు ఉంటారు. దాని నిర్ణయాన్ని ఆమోదించటం తప్ప ఏ కోర్టులోనూ సవాలు చేసే అవకాశం లేదు. ఆ మేరకు 1952, 1963, 1973లో జరిగాయి. 1973 తరువాత పాతికేళ్ల పాటు ఆ ప్రక్రియను స్థంభింప చేస్తూ పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేశారు. ఆ మేరకు 2002లో మరో పునర్విభజన ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. తరువాత మరో పాతికేళ్లపాటు 2026 వరకు అదే సంఖ్యను కొనసాగించాలని కూడా నిర్ణయించారు. తొలి లోక్‌సభలో 494 నియోజకవర్గాలు వుండగా, తరువాత పది సంవత్సరాలకు 522కు పెంచారు. మరో పది సంవత్సరాల తరువాత 542కు పెంచారు. ఆ ప్రక్రియ తరువాత సిక్కిం మన దేశంలో విలీనం కావటంతో మరొక స్థానాన్ని దానికి కేటాయించటంతో 543 అయ్యాయి. వీటిలో పదమూడు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఉన్నాయి. అప్పటి నుంచి 2026 వరకు ఆ సంఖ్యలో ఎలాంటి మార్పు ఉండదు. మధ్యలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాలలో కొన్ని ప్రాంతాలూ, అసెంబ్లీ సెగ్మెంట్లు అటూ ఇటూ అయ్యాయి. కొన్ని నియోజవర్గాలు రద్దు, కొన్ని కొత్తవి వచ్చాయి. తెలంగాణలో జనాభా పెరగటంతో ఆంధ్ర ప్రాంతంలో సీట్లు తగ్గాయి. ఉమ్మడి రాష్ట్రాన్ని విభజించిన తరువాత ఎక్కడ ఉన్న సీట్లు అక్కడే ఉన్నాయి. రాష్ట్ర పునర్విభజన చట్టంలో తెలంగాణ సీట్లను 119 నుంచి 153కు, ఆంధ్ర ప్రదేశ్‌లో 175ను 225కు పెంచుతామని వాగ్దానం చేసినందున 2026 తరువాత జరిగే పునర్విభజన ప్రక్రియలో భాగంగా అవి అమల్లోకి వస్తాయి.

2021లో జరగాల్సిన జనగణన వాయిదా పడింది. అది ఎప్పుడు జరుగుతుందో తెలియదు. గడువు ప్రకారం వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరగాల్సి వుంది. అందువలన జనగణన జరుగుతుందా, మరుసటి ఏడాదికి వాయిదా పడుతుందా అన్నది ప్రస్తుతానికి ఊహాగానమే. 2026 లోపు జనగణన జరుగుతుందనే భావనతో తరువాత జరిగే పునర్విభజన ప్రకారం 2029 లోక్‌సభ ఎన్నికలు, గడువు ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు 33 శాతం కేటాయించాల్సి ఉంటుందని అందువలన 2029లో అమలు జరుగుతాయని కొందరు భాష్యం చెబుతున్నారు. ఇక పార్లమెంటు ఆమోదించిన 84వ రాజ్యాంగ సవరణ ప్రకారం 2026 తరువాత జరిగే పునర్విభజన ప్రక్రియకు ఆ తరువాత జరిగే అంటే 2031లో జరిగే జనగణన ప్రాతిపదికన జరగాల్సి ఉంటుంది. 2021లో జరగాల్సిన జనగణన 2024 లేదా 2025లో జరిగితే పదేళ్లు గడవకుండానే మరోగణన 2031లో జరుపుతారా లేక పదేళ్లు అంటే 2034 లేదా 2035లో జరుపుతారా అన్నది తెలియదు. ఒకవేళ అదే జరిగితే ఆ తరువాతే రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. అందుకే కపిల్ సిబాల్ వంటి న్యాయకోవిదులు 2034కు ముందు అమల్లోకి వచ్చే అవకాశం లేదని చెప్పారు. రెండవది పునర్విభజన ప్రక్రియకు నిర్ణీత కాలవ్యవధి లేదు. ఈ నేపథ్యంలో ఆమోదించిన బిల్లు చట్టమై ఎప్పటికి అమల్లోకి వస్తుంది? అసలు ఏం జరగబోతోంది? అనేవి ప్రస్తుతానికి జవాబుల్లేని ప్రశ్నలు.

ప్రజాశక్తి
www.prajasakti.com

రాజకీయ సౌలభ్యం చూసుకోవద్దు !

- ఐరాస వేదికపై జై శంకర్

న్యూయార్క్ : తీవ్రవాదం, ఉగ్రవాదం, హింసను ఎదుర్కొనేటప్పుడు 'రాజకీయ సౌలభ్యం చూసుకోరాదని భారత్ హితవు పలికింది. ఐక్యరాజ్య సమితి సభ్య దేశాలన్నీ దీన్ని పాటించాలని కోరింది. మంగళవారం ఐరాస జనరల్ అసెంబ్లీనుద్దేశించి భారత విదేశాంగ మంత్రి జైశంకర్ మాట్లాడుతూ, కెనడాతో నెలకొన్న దౌత్యపరమైన ప్రతిష్టంభనను దృష్టిలో పెట్టుకుని ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రాదేశిక సమగ్రతను గౌరవించడం, ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోరాదనే నియమావళి కేవలం కొన్ని దేశాలకే పరిమితం కాకూడదని అన్నారు. కొన్ని దేశాలు ఎజెండా నిర్దేశిస్తే, మిగిలిన దేశాలు అనుసరించాలనే రోజులకు ఇక కాలం చెల్లిందని అన్నారు. వాతావరణ మార్పులపై చేపట్టాల్సిన కార్యాచరణను ఎగవేయరాదని అన్నారు. ఆహారం, ఇంధనం వంటివి అవసరమైన పేదల నుండి సంపన్నులకు మళ్ళించేందుకు మార్కెట్ల శక్తి సామర్ధ్యాలను ఉపయోగించరాదని అన్నారు. కెనడాలో సిక్కు కార్యకర్త హత్యలో భారత గూఢచారి సంస్థల పాత్ర ఉందని కెనడా ప్రధాని ట్రూడో చేసిన సంచలనాత్మక ఆరోపణలను తోసిపుచ్చే ఎలాంటి యత్నం భారత్ చేయకపోవడం పలువురిని ఆశ్చర్యపరచింది.భారత విదేశాంగ విధానం పక్కదారులు పడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

17.5 శాతం క్షీణించిన ఫ్రంట్‌లైన్ ఉద్యోగాలు

న్యూఢిల్లీ : దేశంలో ఉద్యోగాల సంఖ్య కుచించుకుపోతున్నాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయకుండా ఒకవైపు బిజెపి ప్రభుత్వం వంచిస్తుండగా మరోవైపు ప్రయివేటు రంగంలోని వివిధ రంగాల్లో లభిస్తున్న ఉపాధి కూడా నీరుగారిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. 2023 ఆర్థిక సంవత్సరం నాటికి వివిధ రంగాల్లోని ఫ్రంట్‌లైన్ ఉద్యోగాల సంఖ్య గతం కంటే 17.5 శాతం మేర తగ్గి 66 లక్షలకు పడిపోయినట్లు బెటర్‌ప్లేస్ అనే బ్లూకాలర్ వర్క్‌ఫోర్స్ మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ సంస్థ నిర్వహించిన అధ్యయనంలో తేలింది. ఇ-కామర్స్, లాజిస్టిక్స్, మొబిలిటీ వంటి రంగాల్లో ఫ్రంట్‌లైన్ ఉద్యోగాలు దేశ ఆర్థిక వాతావరణాన్ని నిర్ణయించడంలో ఒక ప్రామాణికంగా ఉంటున్నాయి. 2022 ఏప్రిల్ నుండి 2023 మార్చి వరకు సేకరించిన డేటా ప్రాతిపదికగా సోమవారం నాడు బెటర్‌ప్లేస్ సంస్థ ఈ నివేదిక విడుదల చేసింది. కొత్త ఉద్యోగాల కల్పన ఈ ఏడాది కాలంలో 17.5 శాతం మేర క్షీణించిందని ఆ నివేదిక పేర్కొంది. గ్రామీణ భారతావని కోవిడ్ సంక్షోభ పరిస్థితుల నుంచి ఇంకా కోలుకోవాల్సివుందని తెలిపింది. మరోవైపు అమెరికా ఆర్థిక సంక్షోభ ముప్పు భయం పొంచి వుందని ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల ఐటి సేవల పరిశ్రమ కూడా ప్రభావితమవుతుంది. గతేడాది కాలంలో ఇ-కామర్స్ డిమాండ్ 52 శాతం పడిపోయింది. అయినప్పటికీ మొత్తం ఉద్యోగాల్లో 33 శాతం ఈ రంగం నుండే వున్నాయి. ఆ రకంగా రెండో అతిపెద్ద ఎంప్లాయిర్‌గా వుంది. ఈ రంగంలో ఫ్రంట్‌లైన్ కార్మికులు ఎక్కువగా వున్నారు.

ఆర్మేనియా చేరుకున్న శరణార్థుల బృందం

గోరిస్ (ఆర్మేనియా) : వివాదాస్పద ప్రాంతాన్ని అజర్‌బైజాన్ మిలటరీ పూర్తిగా తన స్వాధీనంలోకి తెచ్చుకున్న అనంతరం నాగొర్నొ-కరబక్ ప్రాంతం నుండి మొదటి దఫా శరణార్థుల బృందం ఆర్మేనియా చేరుకుంది. తాజా పోరు కారణంగా లక్షలాది మంది ప్రజలు ప్రభావితులయ్యారు. దీంతో ఆదివారం రాత్రి నాటికే వందలాది మంది ఆర్మేనియాలోకి ప్రవేశించారు. తమ శాంతి పరిరక్షక దళాలు దాదాపు 311 మంది పౌరులను తరలించడంలో సాయం చేశాయని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. వీరిలో 120 మంది చిన్నారులు వున్నారు. నాగొర్నొ-కరబక్ ప్రాంతం ఆర్మేనియాతో కలిపే ఏకైక రోడ్డుమార్గాన్ని గత డిసెంబరులో అజర్‌బైజాన్ దిగ్బంధించింది. ఖనిజాల తవ్వకాలకు ఆ రోడ్డు మార్గాన్ని ఆర్మేనియా ప్రభుత్వం ఉపయోగిస్తోందని అజర్‌బైజాన్ విమర్శించింది. వేర్పాటువాద శక్తులకు అక్రమంగా ఆయుధాల తరలింపునకు కూడా ఈ మార్గాన్ని వాడుతున్నారని పేర్కొంది.

నేవీ భవనంపై దాడి చేసింది మేమే!

- ఉక్రెయిన్ వెల్లడి

కీవ్ : రష్యా నావికా దళానికి చెందిన క్రిమియా ప్రధాన కార్యాలయంపై గత వారం క్షిపణి దాడి జరిపింది తామేనని ఉక్రెయిన్ సోమవారం తెలిపింది. అయితే ఇందుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపలేదు. ఆ దాడిలో ఫ్లీట్ కమాండర్‌తో సహా 34మంది ఆఫీసర్లు మరణించారు. ఓడరేవు నగరమైన సెవాస్తొపాల్‌లో నల్ల సముద్ర నావికాదళ ప్రధాన కార్యాలయ భవనంపై దాడి చేశామని ఉక్రెయిన్ స్పెషల్ ఆపరేషన్ ఫోర్సెస్ టెలిగ్రామ్‌లో తెలిపాయి. ఈ దాడిలో 34మంది మృతితో పాటు మరో 105మంది గాయపడ్డారు. అయితే ఈ దాడి గురించి రష్యా చెబుతున్న దానికి ఉక్రెయిన్ ప్రకటించిన దానికి చాలా తేడా కనిపిస్తోంది. నావికాదళం చీఫ్ అడ్మిరల్ విక్టర్ సొకొలొవ్ మరణించినట్లు వార్తలు వెలువడ్డాయి.

ఆలయ భూములను కాజేసిన బిజెపి ఎమ్మెల్యేలు

- కామచ్చి అమ్మన్ ఆలయ పరిధిలో అక్రమాలు
- నకిలీ పత్రాలు సృష్టించి పాగా
- ఆలయానికి అప్పగించాలని మద్రాస్ హైకోర్టు ఆదేశం

చెన్నై : ఆలయాల భూముల రక్షణ గురించి నిత్యం నీతులు చెప్పే బిజెపి నేతలు ప్రఖ్యాత కామచ్చి అమ్మన్ ఆలయ భూములనే కబ్జా చేశారు. అవినీతి, అక్రమాలతో నకిలీ పత్రాలు సృష్టించి ఆ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు కామచ్చి అమ్మన్ భూములను కైంకర్యం చేశారు. దీనిపై పలువురు మద్రాస్ హైకోర్టు ఆశ్రయించడంతో ధర్మాసనం కబ్జాదారులైన బిజెపి ఎమ్మెల్యేలను కడిగిపారేసింది. తక్షణమే ఆ భూములను కామచ్చి అమ్మన్ ఆలయానికి అప్పగించాలని మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది.

పుదుచ్చేరిలోని కామచ్చి అమ్మన్ ఆలయానికి చెందిన భూములను కామరాజ్‌నగర్, నెల్లితోప్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఎ జాన్‌కుమార్, రిచర్డ్స్ జాన్‌కుమార్ మోసపూరితంగా ఆక్రమించుకున్నారని, ఇందుకు ప్రాథమిక ఆధారాలున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ ఎమ్మెల్యేలిద్దరూ తండ్రీకొడుకులు కావడం గమనార్హం. ఆలయ భూములను ఎమ్మెల్యేలు ఆక్రమించుకున్నారనే ఆరోపణలను తేలిగ్గా తీసుకోలేమని హైకోర్టు వ్యాఖ్యానించింది. 'ప్రజాప్రతినిధులు నీతివంతులుగా, నమ్మకమైన ప్రజా సేవకులుగా ఉండాలి. తమ తమ నియోజకవర్గాల్లో నివసించే ప్రజల అభ్యున్నతికి, చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడానికి కృషిచేయాలి' అని జస్టిస్ ఎస్‌ఎం సుబ్రమణ్యం స్పష్టం చేశారు. ప్రస్తుత కేసును విచారిస్తున్న సిబి-సిఐడి దర్యాప్తునకు ఎమ్మెల్యేలు లోబడి ఉండాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులు కుమ్మక్కై ఆలయ భూములను కాజేశరని దేవస్థానం కార్యదర్శి సుబ్రమణ్యం, వి వేల్మురుగన్ అనే భక్తుడు ఈ పిటీషన్ వేశారు. 1935 మార్చి 6న ముత్తుస్వామి అనే వ్యక్తి వీలునామా ప్రకారం రెండు స్థిరాస్థులు ఆలయానికి లభించాయని, ఈ ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయంతో భక్తులకు అన్నదానం చేయాలని దాత కోరుకున్నారని పిటీషన్‌దారులు తెలిపారు. అయితే అప్పటి నుంచి ఈ భూమి ఖాళీగా ఉండటంతో కల్పిత పత్రాలతో ఎమ్మెల్యేలు పాగా వేశారు. అయితే తాము అమాయకులమనీ, వేరే వ్యక్తుల నుంచి వీటిని కొనుగోలు చేసినట్లు నిందిత ఎమ్మెల్యేలు వాదిస్తున్నారు. కేసు తదుపరి విచారణను నవంబర్ 6కు హైకోర్టు వాయిదా వేసింది.

న్యాయమూర్తుల ఎంపికపై నాన్చుడు ఎందుకు?

- కేంద్ర నిర్లక్ష్య ధోరణితో ప్రతిభావంతులు దూరం
- మోడీ సర్కార్‌కు తలంటిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల న్యాయ వ్యవస్థ ప్రతిభావంతులైనవారిని దూరం చేసుకోవాల్సివస్తోందని మోడీ సర్కార్‌పై సుప్రీంకోర్టు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టుల్లో న్యాయమూర్తుల పదవుల కోసం ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితాపై నెలల తరబడి ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంబిస్తుండటంతో ఈ పరిస్థితి ఎదురైందని సర్వోన్నత న్యాయస్థానం వాపోయింది. బెంచ్‌లో చేరేందుకు తమ లా ప్రాక్టీస్‌ను కూడా వదులుకోవడానికి సుముఖంగా వున్న, మెరుగైన ప్రతిభ కలిగిన వారు ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధితులు అవుతున్నారని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుదాంశు ధూలియాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అకారణంగా కొందరి పేర్లను తొలగించడానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంది. "హైకోర్టులో న్యాయమూర్తి పదవులు చేపట్టేందుకు ముందుకు రావడానికి తిరస్కరిస్తున్నారు. అయినా మేం ప్రయత్నించాం, మంచి టాలెంట్ ఉన్నవారిని న్యాయమూర్తులు తీసుకునేందుకు కృషి చేశాం, కానీ పేర్ల విభజన కారణంగా మంచి టాలెంట్‌ను కోల్పోవాల్సివస్తోంది. దాంతో వారు వైదొలగారు. మేము ఎవరి పేర్లు బయటపెట్టాలనుకోవడం లేదు. కానీ ఒకరిద్దరు మంచివారిని కోల్పోయాం.' అని జస్టిస్ కౌల్ కేంద్రం తరపున హాజరైన అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణికి తెలిపారు.

హైకోర్టు కొలీజియమ్‌లు న్యాయమూర్తుల పదవుల కోసం సిఫార్సు చేసిన దాదాపు 70పేర్లను అటార్నీ జనరల్ దృష్టికి జస్టిస్ కౌల్ తీసుకువచ్చారు. 2022 నవంబరు నుండి దాదాపు పది మాసాల పాటు ఈ పేర్లు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో వున్నాయి. పిటిషనర్ అయిన అడ్వకేట్స్ అసోసియేషన్ ఆఫ్ బెంగళూరు తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది అరవింద్ దతార్, న్యాయవాది అమిత్ పాయ్‌లు మాట్లాడుతూ, "ప్రభుత్వానికి కొలీజియమ్‌లు అందచేసిన జాబితా నుండి కొన్ని పేర్లను మాత్రమే తొలగించడమనేది చాలా చాలా ఇబ్బందికరమైన పరిస్థితిగా వుంది." అని పేర్కొన్నారు. కొలీజియం ఈ పద్ధతి వద్దని చెప్పినా ప్రభుత్వం ఇంకా కొనసాగిస్తోందని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అన్నారు. కొరడా ఝుళిపించి, కోర్టు ధిక్కారానికి పాల్పడిన వారిని ప్రక్షాళన చేయాల్సిన సమయమిదని ఈ తరహాలో ఇకపై జరగరాదని ప్రశాంత్ భూషణ్ పేర్కొన్నారు.

కెనడాలో భారత ఎంబసీ వద్ద నిరసనలు

- హైకమిషనర్‌ను బహిష్కరించాలని డిమాండ్

టోరంటో : కెనడాలోని భారత రాయబార కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని ఖలిస్తాన్ మద్దతుదారులు నిరసనలకు దిగారు. రాజధాని టొరంటోలోని భారత రాయబార కార్యాలయం వద్ద మంగళవారం సుమారు 100 మంది నిరసనలో పాల్గొన్నారు. భారత జెండా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మల దహనానికి పాల్పడ్డారని రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. అలాగే వాంకోవర్ పట్టణంలోని భారత రాయబార కార్యాలయం వద్ద సుమారు 200 మంది నిరసన కార్యక్రమం చేపట్టారు. అలాగే ఒట్టావాలోని కార్యాలయం వద్ద కూడా నిరసనలు చోటుచేసుకున్నాయి. భారత హైకమిషనర్ సంజయ్‌కుమార్ వర్మను బహిష్కరించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు కెనడాలో ఖలిస్తాన్ నాయకుడు హర్దీప్ సింగ్ నిజ్జార్ హత్యలో భారత ప్రభుత్వ హస్తం ఉందని ఆరోపణలు వచ్చినప్పటి నుంచి ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న సంగతి తెలిసిందే.

- భారత్-కెనడాల మధ్య కొనసాగుతున్న దౌత్య వివాదంపై సిక్కుల అత్యున్నత సంస్థ శిరోమణి గురుద్వారా పర్బంధక్ కమిటీ (ఎస్‌జిపిసి) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమస్యను రెండు దేశాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఇటీవల ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ సందర్భంగా ఎస్‌జిపిసి అధ్యక్షులు హర్జిందర్ సింగ్ ధామి మాట్లాడుతూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చెప్పిన ప్రతిదాన్ని సులభంగా తిరస్కరించలేమని అన్నారు. కేవలం రాజకీయాల కారణంగా ఈ కేసును అటకెక్కిస్తే అది మానవ హక్కులకు అన్యాయం చేసినట్లేనని అన్నారు.

హాలీవుడ్ స్టూడియోలతో రచయితల తాత్కాలిక ఒప్పందం

వాషింగ్టన్ : ప్రధాన స్టుడియోలతో హాలీవుడ్ రచయితలు కార్మిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారని రైటర్స్ గిల్డ్ ఆఫ్ అమెరికా (డబ్ల్యుజిఎ) ఆదివారం ప్రకటించింది. ఎఎంపిటిపితో డబ్ల్యుజిఎ తాత్కాలిక ఒప్పందాన్ని కుదుర్చుకుందని తెలిపింది. మూడేళ్ళ ఈ ఒప్పందం అమల్లోకి రావడానికి ముందుగా, డబ్ల్యుజిఎ సభ్యులు తప్పనిసరిగా ఈ ఒప్పందాన్ని ఆమోదించాల్సి వుంది. ఈ గిల్డ్‌లో 11,500మంది చలనచిత్ర, టెలివిజన్ రచయితలు వున్నారు. అయితే ఒప్పందం కచ్చితమైన వివరాలు వెంటనే తెలియరాలేదు. ఇరు పక్షాల మధ్య ఐదు రోజుల పాటు బృహత్తరంగా సాగిన చర్చల అనంతరం ఈ ఒప్పందం రూపుదాల్చింది. కాగా ఇప్పటికే హాలీవుడ్‌లో రెండు సమ్మెలు జరిగాయి. దీనితో అనేక చలనచిత్రాల, టెలివిజన్ సీరియల్స్ రూపకల్పన స్తంభించిపోయింది. తాజా ఒప్పందంతో ఇక ఈ సమ్మెలు ఆగుతాయని భావిస్తున్నారు. గిల్డ్ చరిత్రలో సుదీర్ఘ సమ్మెగా రికార్డు సృష్టించడానికి ఐదు రోజులు ముందుగా ఈ ఒప్పందం కుదిరింది. గత 70ఏళ్ళ చరిత్రలో సుదీర్ఘమైన హాలీవుడ్ సమ్మెగా ఇది నిలిచింది.

దేశంలో ఉప్పు అధికంగా తినేస్తున్నారు !

- డబ్ల్యుహెచ్ఒ సిఫార్సులకు మించిన మోతాదులో వినియోగం
- ఐసిఎంఆర్ సర్వే వెల్లడి

న్యూఢిల్లీ : భారత ప్రజానీకం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) సిఫార్సు చేసినదాని కన్నా ఎక్కువ మోతాదులో ఉప్పును తింటున్నారని ఒక నివేదికలో వెల్లడైంది. రోజుకు 5 గ్రాముల వరకు మాత్రమే ఉప్పు తీసుకోవాలని డబ్ల్యుహెచ్ఒ సిఫార్సు చేస్తోంది. కానీ మన దేశంలో మాత్రం సగటున 8 గ్రాములు (పురుషులు రోజుకు 8.9 గ్రాములు కాగా మహిళలు 7.1 గ్రాములు) తీసుకుంటున్నారని వెల్లడైంది. అదనంగా ఉప్పు తీసుకోవడమనేది పురుషుల్లో అధికంగా వుంటుంది. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో వున్నవారు, అలాగే అధిక బరువు వున్నవారు, ఊబకాయంతో బాధపడుతున్నవారు ఎక్కువ తీసుకుంటారని భారత వైద్య పరిశోధన మండలి (ఐసిఎంఆర్) ఇటీవల తన సర్వేలో పేర్కొంది. నేచర్ జర్నల్‌లో ఈ సర్వే వివరాలను ప్రచురించారు. ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను తినడం తగ్గించాలని, అలాగే బయట వండిన ఆహారాన్ని కూడా తినడం మానివేయాలని ఈ అధ్యయనం నివేదిక రూపకర్త, ఐసిఎంఆర్ డైరెక్టర్ ప్రశాంత్ మాథుర్ పేర్కొన్నారు.

18-69 సంవత్సరాల మధ్య వయస్సు గల 10,659 మందిపై సర్వే నిర్వహించారు. ఉద్యోగం చేసేవారిలో ఉప్పు తీసుకోవడం అధికం (8.6 గ్రాములు)గా వుందని అధ్యయనంలో వెల్లడైంది. అలాగే పొగ తాగేవారిలో, హై బిపి వున్న వారిలో కూడా ఇది ఎక్కువగానే వుందన్నారు. ఉప్పు తక్కువ తీసుకుంటే 25 శాతం వరకు బిపి తగ్గడానికి అవకాశం వుంటుంది. 2025 కల్లా సగటు జనాభాలో ఉప్పు తీసుకునేవారి సంఖ్య 30 శాతం తగ్గేలా చూడాల్సి వుందని అధ్యయనం పేర్కొంది. భారత్‌లో సంభవించే మరణాల్లో కార్డియోవాస్క్యులార్ వ్యాధుల వల్ల చోటు చేసుకునే మరణాలు 28.1 శాతంగా వున్నాయి. 1990లో ఈ వ్యాధులతో 7.8 లక్షల మంది మరణించగా, 2016లో ఈ సంఖ్య 10.63 లక్షలకు పెరిగింది. హై బిపి ఇందుకు ప్రధాన కారణంగా వుంది.

ఆప్కాబ్‌కు బహుమతులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జాతీయ స్థాయిలో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ (ఆప్కాబ్), నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంక్స్ (ఎన్ఎఎఫ్ఎస్‌బిఒబి) రెండవ, మొదటి బహుమతులను సాధించింది. జైపూర్‌లో జరిగిన ఎన్ఎఎఫ్ఎస్‌సిఒబి వార్షిక సాధారణ సమావేశంలో ఎన్ఎఎఫ్ఎస్‌సిఒబి ఛైర్మన్ కె రవీంద్రరావు, సంస్థ ఎమ్‌డి బి సుబ్రమణ్యం, అన్ని రాష్ట్ర సహకార బ్యాంకుల ప్రతినిధుల సమక్షంలో ఆప్కాబ్ ఛైర్‌పర్సన్ ఎం ఝాన్సీరాణి, మేనేజింగ్ డైరెక్టరు ఆర్ శ్రీనాథ్‌రెడ్డి మంగళవారం ఈ బహుమతులు అందుకున్నారు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో 35 శాతం వృద్ధి రేటుతో రూ.21,049.63 కోట్ల వ్యాపార టర్నోవర్ సాధించినందుకు జాతీయ స్థాయిలో రెండవ బహుమతి, 2021-22 ఆర్థిక సంవత్సరంలో 45 శాతం వృద్ధి రేటుతో 30,587.62 కోట్ల వ్యాపార టర్నోవర్ సాధించినందుకు మొదటి బహుమతి లభించింది. ఈ మేరకు ఆప్కాబ్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

బిజెపి అడుగుల్లోనే...

(మొదటి పేజీ తరువాయి)

చెప్పలేదని, రాజకీయ పార్టీగా బిజెపి వైషమ్యాలు సృష్టించే విధంగా వ్యవహరిస్తోందని చెప్పారు. దీనిపై అసలు ఎంపి ఏమీ మాట్లాడలేదని, రాజ్‌నాథ్ సింగ్ స్పందించారని అన్నారు. దీనివెనుక మతపరమైన విభజన తేవాలనే కుట్ర దాగుందని అన్నారు. మతాల మధ్య విభజన సృష్టించి ఎన్నికల్లో గెలుపొందాలనే ఆలోచన ఉందని విమర్శించారు. మరోవైపు ఎన్నికలు జరిగిన అన్ని రాష్ట్రాల్లోనూ బిజెపి ఓడిపోతోందని, అది సృష్టిస్తున్న వైషమ్యాలను ప్రజలు గమనిస్తున్నారని 2024లో తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఎన్‌డిఎ నుండి ఎఐఎడిఎంకే కూడా వైదొలగిందని తెలిపారు. జమిలీ ఎన్నికల పేరుతో తమకు అనుకూలమైన వాతావరణం సృష్టించుకోవాలనే చర్చ బిజెపి చేస్తోందని తెలిపారు. సందర్భానుసారం జమిలి ఎన్నికలు రావడం వేరని, ఒకేసారి జరపాలని చట్టం చేయాలని చూడటం ప్రమాదకరం, అప్రజాస్వామికం, నిరంకుశమని చెప్పారు. ఇటువంటి నియంతృత్వ పద్ధతులను సిపిఎంగా తాము అంగీకరించడం లేదని పేర్కొన్నారు. వైసిపి, టిడిపిలు ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశాల్లోగానీ, అంతకు ముందు సమావేశాల్లోగానీ కేంద్రంలో బిజెపికి మద్దతు ఇవ్వడం దురదృష్టకరమని అన్నారు. పార్లమెంటు సమావేశాల్లో వైసిపి నాయకులు మోడీని పొగడటంలో తలమునకలు అయ్యారని, ఢిల్లీ బిల్లులోనూ కేంద్రానికి మద్దతు ఇచ్చారని తెలిపారు. టిడిపి కూడా అదే బాటలో ఉందని అన్నారు. వైసిపి, కేంద్రం కలిసి చంద్రబాబును అరెస్టు చేయించారని వార్తా పత్రికల్లోనూ కథనాలు వస్తున్నాయని అన్నారు. కేంద్ర నిఘా సంస్థల సూచనల మేరకే తాము చర్యలు తీసుకుంటున్నామని సిఐడి కూడా నివేదికలో పేర్కొందని తెలిపారు. ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తిని అర్థరాత్రి పోయి అరెస్టు చేసి ఇబ్బందులు పెట్టాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. ఈ పద్ధతుల్లో చంద్రబాబును అరెస్టు చేయడం వేధింపు అనుకోవాల్సి వస్తుందని అన్నారు. తప్పు చేశారా లేదా అనేది విచారణలో తేలుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దేశాన్ని నాశనం చేస్తున్న బిజెపితో వెళ్లాలా? లేదా? అనే విషయంలో వైసిపి, టిడిపిలు పునరాలోచన చేయాలని, బిజెపికి దూరంగా జరగాలని కోరారు. తనకు దగ్గరగా ఉండే రాజకీయ పార్టీలను నాశనం చేసి బిజెపి ఎదుగుతోందని వారు గమనిస్తే మంచిదని అన్నారు.

ప్రధాని మోడీకి రాజ్యాంగం పట్ల గౌరవం లేదని అన్నారు. ఆయన ఇటీవల ప్రత్యేక సమావేశాలు నిర్వహించారని, ఇటీవల సావర్కర్ పుట్టినరోజున పార్లమెంటు భవనాన్ని ప్రారంభించారని, ఆ సమయంలో రాష్ట్రపతిని కూడా భాగస్వామిని చేయలేదని అన్నారు. ఇండియన్ పార్లమెంటు అంటే రాష్ట్రపతితో కలిపి ఉభయసభలు అని అర్థమని చెప్పారు. కానీ మోడీ దాన్ని గౌరవించకుండా ఆయనే ప్రారంభించారని తెలిపారు. అయినా అందులో సమావేశాలు నిర్వహించకుండా పాత భవనంలోనే నిర్వహించారని, అంటే అది పూర్తిగా నిర్మాణం కాలేదని తెలిపారు. తాజా సమావేశాలు కూడా పాత భవనంలోనే జరిగాయని, అందులోనే పార్లమెంటు ప్రాశస్త్యంపై చర్చించారని, ఆ తరువాత కొత్త భవనంలో సమావేశాలు నిర్వహించారని అన్నారు. పార్లమెంటుకు సంబంధించిన అన్ని అంశాల్లోనూ ద్రౌపది ముర్మును పట్టించుకోలేదని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం ప్రకారం ఆమె మహిళ కావడం, రెండోది గిరిజన తరగతులకు చెందిన మహిళ కావడంతో భాగస్వామ్యం చేయలేదని తెలిపారు. మోడీ పూర్తి నియంతృత్వంగా వ్యవహరిస్తూ చట్టాలు చేసే సమయంలో కనీసం ప్రతిపక్షాలను సంప్రదించడం లేదని తెలిపారు.

అసాంఘిక శక్తుల పేరుతో ఉద్యమాలను అణచడం సరికాదు

అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం పోలీసు యంత్రాంగం దారుణంగా వ్యవహరించిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. ధర్నా చేసుకుంటామంటే అనుమతి ఇవ్వకపోగా అసాంఘిక శక్తులు జొరపడతారని పోలీసులు ప్రచారం చేయడం దారుణమని అన్నారు. నగరంలో జరిగిన ఆందోళనలో ఎక్కడైనా సంఘ విద్రోహశక్తులు జొరపడినట్లు గుర్తించారా అని ప్రశ్నించారు. తప్పుడు ప్రచారం చేసినందుకు పోలీసులు క్షమాపణ చెప్పాలని అన్నారు. పోనీ గత పదేళ్లలో ప్రజాస్వామ్య పరంగా జరుగుతున్న ఆందోళనల్లో ఎప్పుడైనా సంఘ విద్రోహశక్తులను గుర్తించారా అదన్నా చెప్పాలని ప్రశ్నించారు. ఒకవైపు మహిళలపై అమానుషాన్ని ప్రయోగించి అసెంబ్లీలో మంత్రులు ఉషశ్రీచరణ్, రోజా మహిళలకు సాధికారత ఇస్తామని ప్రకటిస్తున్నారనడం ఎవరిని మోసం చేయడానికో చెప్పాలని డిమాండ్ చేశారు. వైసిపి అంగన్‌వాడీలను మోసం చేసిందని అన్నారు. పక్కనున్న తెలంగాణలో వారికి ఎక్కువ వేతనం ఇస్తున్నారని, ఇక్కడ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలన్నారు. ఇప్పటికైనా వైసిపి ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీలకు న్యాయం చేసే అంశంపై అసెంబ్లీలో ప్రకటన చేయాలని కోరారు.



బెంగళూరులోని జయనగర్‌లో మూతబడిన దుకాణాలు

బెంగళూరు బంద్ ప్రశాంతం

బెంగళూరు/చెన్నయ్ : కావేరీ జలాల విషయంలో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. తమిళనాడుకు కావేరీ జలాలను విడుదల చేయాలంటూ రెగ్యులేటరీ బోర్డు ఉత్తర్వులిచ్చిన నేపథ్యంలో ఆ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ సోమవారం బెంగళూరులో బంద్ చేపట్టారు. బంద్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వ్యాపార సంస్థల కార్యాలయాలు, మాల్స్, హోటళ్లు, వివిధ రకాల వాణిజ్య సముదాయాలు మూతపడ్డాయి. శాంతిభద్రతలు క్షీణించకుండా పోలీసులు 144 సెక్షన్ విధించి పటిష్ట చర్యలు తీసుకున్నారు. రైతు సంఘాలు, కన్నడ సంఘాలు ఆంక్షల నడుమే పలుచోట్ల నిరసన ప్రదర్శనలు చేపట్టాయి. అయితే నిరసనకారులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అరెస్టు చేశారు. కావేరిలో నీళ్లు లేవని చెప్పడానికి ప్రతీకగా ఖాళీ బిందెలను నిరసనకారులు ప్రదర్శించారు. అలాగే మంచినీటి సమస్య ఇప్పటికే ప్రారంభయిందని తెలిపారు. బంద్‌ను విజయవంతం చేసినందుకు రైతు సంఘాలను ఉపముఖ్యమంత్రి శివకుమార్ అభినందించారు. ఫ్రీడం పార్క్ వద్ద నిరసన చేస్తున్న రైతు సంఘాల ప్రతినిధుల నుంచి వినతిపత్రం తీసుకోవడానికి రవాణా శాఖ మంత్రి రామలింగా రెడ్డి అక్కడకు వెళ్లారు. మూడు రోజుల్లో తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మరోవైపు వచ్చే 18 రోజులకు 3 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కర్ణాటక ప్రభుత్వాన్ని కావేరీ వాటర్ రెగ్యులేటరీ బోర్డు మంగళవారం నాడు ఆదేశించింది.

తమిళనాడులోనూ ఆందోళనలు

కావేరీ వాటర్ మేనేజ్‌మెంట్ ఆథారటీ ఆదేశాల మేరకు రోజుకు 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడానికి కర్ణాటక ప్రభుత్వం నిరాకరించడాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాడులో పలుచోట్ల ఆందోళనలు చేపట్టారు. తంజావూరు జిల్లాలోని బూదలూరు రైల్వే స్టేషన్ వద్ద రైల్ రోకో నిర్వహించారు. కర్ణాటక ప్రభుత్వం వైఖరి కారణంగా తమిళనాడులోని కావేరీ డెల్టాలోని సుమారు 3.50 లక్షల ఎకరాల్లో పంట ఎండిపోయిందని రైతులు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తటస్థంగా ఉండకుండా.. కర్ణాటకకు మద్దతిస్తోందని రైతులు ఆరోపించారు.

నంద్యాల కలెక్టరేట్ వద్ద విద్యార్థులను అడ్డుకుంటున్న పోలీసులు

విద్యార్థులపై పోలీసుల జులుం

(మొదటి పేజీ తరువాయి)

మిగతా విద్యార్థులు వెరవకుండా మరోవైపు ఆందోళన కొనసాగించారు. అరెస్టు చేసి వారిని ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌కు, మరికొందరిని గంట్యాడ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వారిని విడుదల చేశారు. పోలీసుల తీరుపై ఎస్ఎఫ్ఐ నాయకులు సౌమ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. నంద్యాల కలెక్టరేట్ వద్ద విద్యార్థులు ధర్నా చేశారు. అనంతరం ఉన్నతాధికారు లకు వినతి పత్రం అందించేందుకు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. త్రీటౌన్ సిఐ నరసింహులు, డిఆర్ఒ పుల్లయ్య కలుగజేసుకొని విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిఆర్ఒకు అందజేశారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని మ్యూజియం దగ్గర నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సోమేశ్వరరావు పాల్గొన్నారు. కడప కోటిరెడ్డి సర్కిల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసేందుకు కలెక్టరేట్‌లోనికి వెళుతున్న విద్యార్థి సంఘం నేతలను పోలీసులు అడ్డుకున్నారు. అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత వారిని విడుదల చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, విద్యార్థులకు స్వల్పతోపులాట చోటుచేసుకుంది. వన్‌టౌన్ సిఐ అడబాల శ్రీనివాస్ జోక్యం చేసుకుని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు పది మందిని అనుమతించారు. అనంతరం విద్యార్థి నేతలు కలెక్టర్ ప్రశాంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాకినాడ జిల్లాలో కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సబ్ కలెక్టర్ వద్ద విద్యార్థులు బైఠాయించి ఆందోళన చేశారు. తిరుపతి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీకి అందజేశారు.

ఫారమ్ నెం.URC-2

కంపెనీల చట్టంలోని XXI అధ్యాయం యొక్క పార్ట్ I కింద రిజిస్ట్రేషన్ గురించి ప్రకటన ఇస్తున్న ప్రకటన
(కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 374 (బి) మరియు రూల్ 4(1) ప్రకారం కంపెనీలు (రిజిస్టర్ చేయడానికి అధికారం) నియమాలు, 2014)

1. కంపెనీల చట్టం 2013 యొక్క సెక్షన్ 366లోని సబ్-సెక్షన్ (2) ప్రకారం ఈ నోటీసు ఇవ్వబడింది. ఇక్కడ పదిహేను రోజుల తర్వాత కానీ ముప్పై రోజుల గడువు ముగిసేలోపు కంపెనీల రిజిస్ట్రార్‌కు దరఖాస్తు చేయాలని ప్రతిపాదించబడింది, సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్ (CRC)/కంపెనీస్ రిజిస్ట్రార్ విజయవాడ, ఆ విహంగ టెక్నాలజీస్ ఎల్ఎల్‌పి, అనే భాగస్వామ్య సంస్థ కంపెనీల చట్టం 2013లోని XXI అధ్యాయం యొక్క పార్ట్ I కింద షేర్ల ద్వారా పరిమితం చేయబడిన కంపెనీగా నమోదు చెయ్యడానికి దరఖాస్తు చేయాలని ప్రతిపాదించింది.
2. సంస్థ యొక్క ప్రధాన వస్తువులు క్రింది విధంగా ఉన్నాయి :
ఎ) భారతదేశంలో లేదా మరెక్కడైనా హోల్‌సేల్ ప్రాతిపదికన వ్యవసాయ యంత్రాలతో సహా అన్ని రకాల యంత్రాల తయారీ, కొనుగోలు, అమ్మకం, పునఃవిక్రయం, దిగుమతి, ఎగుమతి, రవాణా, వ్యాపారం వంటి వ్యాపారాన్ని కొనసాగించడం.
3. ప్రతిపాదిత కంపెనీ యొక్క ముసాయిదా మెమోరాండం మరియు ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ యొక్క కాపీ 9 54, మెయిన్ రోడ్డు కొల్లిపర, ఇఎస్ఎస్ఆర్ పెట్రోల్ బంక్ ఎదురు, కొల్లిపర, గుంటూరు, ఆంధ్రప్రదేశ్, 522304, ఇండియా, నమోదిత కార్యాలయం వద్ద తనిఖీ చేసుకోవచ్చు.
4. ఈ దరఖాస్తుపై అభ్యంతరం వ్యక్తం చేసే ఏ వ్యక్తి అయినా "సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్ (CRC) వద్ద-ఇన్స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ (IICA). ప్లాట్ నెం. 6,7, 8 సెక్టార్, IMT మనేసర్, గుర్గావ్ జిల్లా (హర్యానా) పిన్ కోడ్-122050 వద్ద రిజిస్ట్రార్‌కు ఈ నోటీసును ప్రచురించిన తేది నుండి ఇరవై ఒక్క రోజులలోపు వ్రాతపూర్వకంగా వారి అభ్యంతరం కమ్యూనికేట్ చేయవచ్చని తెలియ చేయవచ్చును. అదే విధంగా సదరు అభ్యంతర దరఖాస్తు ఒక కాపీ పైన పేర్కొన్న కంపెనీ నమోదిత కార్యాలయంకు కూడా పంపవలెను.

దరఖాస్తుదారుల పేరు (లు)
1. నాగ సర్వేశ్వరరావు విష్ణుమొలకల,
2. నాగ సుధీర్ విష్ణు మొలకల.

తేది : 26 సెప్టెంబర్, 2023

यूनियन बैंक ऑफ इंडिया
भारत सरकार का उपक्रम
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వ రంగ సంస్థ

ఎడ్లపాడు బ్రాంచి (19221)
డి.నెం.4-53/1, ఆంధ్రాబ్యాంక్ కాంప్లెక్స్, మెయిన్‌రోడ్, ఎడ్లపాడు-522233. ☎ 08647-276108

రూల్ 8(1) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సెకండ్) యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారము **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎడ్లపాడు బ్రాంచి (E-AB)** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత:** M/s.లక్ష్మి గణేష్ ట్రేడర్స్ వారు **చెల్లించవలిసిన బకాయిమొత్తం రూ.24,05,772/- (అక్షరాల ఇరవై నాలుగు లక్షల ఐదు వేల ఏడు వందల డెబ్బై రెండు రూపాయలు మాత్రమే)** + వడ్డీ + బ్యాంక్ ఛార్జీలు సదరు నోటీసు తేదీనుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.04.04.2023న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారుడు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూలు 8 ప్రకారము **22 సెప్టెంబర్ 2023 తేదీన** దిగువ పేర్కొన్న **ఆస్తిని స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ముఖ్యంగా ఋణగ్రహీతను మరియు సాధారణ ప్రజానీకమును ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ లావాదేవీలైనా **చెల్లించవలిసిన బకాయిమొత్తం రూ.24,05,772/-** + వడ్డీ మొ॥ (నోటీసు తరువాత ఏవైనా జమలు ఉంటే అవి తగ్గించబడును) **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి. సెక్షన్ 13 సబ్-సెక్షన్ (8) చట్టం ప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు.

స్థిరాస్తుల వివరములు

గుంటూరు జిల్లా, ఎడ్లపాడు మండలం, లింగారావుపాలెం గ్రామపంచాయతీ, మైదవోలు గ్రామము, యస్.నెం.46 నందు **శ్రీ రావూరి నాగేశ్వరరావు, తండ్రి: కోటయ్యకు చెందిన** 190 చ॥గ॥ లేదా 158.85 చ॥మీ॥ విస్తీర్ణముగల స్థలము మరియు అందులో డోర్ నెం. 1-28 తో నిర్మించిన ఆర్‌సిసి రూఫ్ రెసిడెన్షియల్ భవనమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** బజారు; **పడమర:** నంబూరి విశ్వేశ్వర్లుకు చెందిన ఆస్తి; **ఉత్తరం:** రావూరి వీరయ్యకు చెందిన ఆస్తి; **దక్షిణం:** గల్లీ బజారు.

తేది : 22.09.2023
ప్రదేశము : ఎడ్లపాడు

సం/- అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మీకోసం

వెల్లుల్లిని కాగితపు సంచిలో వేసి ఉంచితే అవి చెడిపోకుండా ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి.

జీవన సౌరభం

గెలవాలనే స్ఫూర్తితో పోరాడితే ఓడినా తట్టుకోగలరు.

JEEVANA జీవన the family

రంగు రంగుల పూలమాలలు

తామర పూలను తెస్తాం
తనివితీరా మాల కడతాం
తల్లిదండ్రుల మెడలో వేస్తాం!

గులాబి పూలను తెస్తాం
గుత్తులు గుత్తుల మాల కడతాం
గురువు గారి మెడలో వేస్తాం!

చామంతి పూలను తెస్తాం
చక చకా మాల కడతాం
చదువుల తల్లి మెడలో వేస్తాం!

మందార పూలను తెస్తాం
మెలికలేసి మాల కడతాం
మహనీయుల మెడలో వేస్తాం!

బంతి పూలను తెస్తాం
బొద్దు బొద్దుగా మాల కడతాం
భరత మాత మెడలో వేస్తాం!

నందివర్ధన పూలను తెస్తాం
నిగనిగలాడే మాల కడతాం
నింగి నేలకు చుట్టేస్తాం!

- బోనగిరి పాండురంగ,
తొర్రూరు.

తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన రెండు బొమ్మల్లో ఐదు తేడాలు ఉన్నాయి. గుర్తించండి.

పెరుబోయిన భవియేష్,
2వ తరగతి,
సంజీవ నగర్
ఎం.పి.ఎల్.ప్రైమరి స్కూల్,
చిలకలూరిపేట,
పల్నాడు జిల్లా.

నేను గీసిన బొమ్మ

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

దుమ్ము రేపుతున్న 'లింగిడి' కుర్రాడు ...

ఇటీవల ఎక్కడ చూసినా ఒకటే పాట.. 'లింగి లింగి లింగిడి'. శ్రీకాకుళం యాసలో సాగే ఈ పాట సోషల్ మీడియాలో ఎవరూ ఊహించని రీతిలో దూసుకుపోతోంది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ ... ఇలా ఏది తెరిచినా ఇదే ట్రెండింగ్‌లో ఉంది. ఇంతలా ఆదరణ పొందిన ఆ పాటను పాడింది పేదింటి కుర్రాడు పాలవలస రఘు. ఓ వైపు చదువుకుంటూనే పాటే ప్రాణంగా, జానపదమే ఊపిరిగా బతికాడు. తనదైన ప్రత్యేక యాస, గాత్రంతో ముందుకురికి ఈ రోజు జనం నోళ్లలో పాటై నానుతున్నాడు.

విజయనగరం జిల్లా గజపతినగరం మండలం పాత బగ్గాం రఘు స్వగ్రామం. తల్లిదండ్రులు ముత్యాలు, బంగారమ్మ. బుట్టలు, తట్టలు అల్లుకుని ఊరువాడా తిరిగి అమ్ముకునే గిరిజన తెగకు చెందిన కుటుంబం. రోజంతా కష్టిస్తేనే కడుపు నిండేది. రఘు ప్రాథమిక విద్యను మెంటాడ మండలంలోని కారు మామిడివలసలో అభ్యసించాడు. 6 నుంచి 10వ తరగతి వరకూ మెంటాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ, ఇంటర్ గజపతినగరంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలోనూ, డిగ్రీ గాయత్రీ కళాశాలలోనూ, బిఇడి జామి సమీపంలోని శోభా మెమోరియల్ కాలేజీలోనూ రఘు చదివాడు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చదువును వీడిపోలేదు.

తెలుగు పద్యంతో మొదలెట్టి..

రఘు మెంటాడలో ఆరో తరగతి చదువుతున్నప్పుడు తెలుగు మాస్టారు శంకరరావు ఓ పద్యాన్ని పాడగా రఘు దాన్ని అందుకుని మరింత వినసొంపుగా పాడాడు. 'నీ గొంతులో ఏదో మ్యాజిక్ ఉంది' అని తెలుగు మాస్టారు, స్నేహితులు మెచ్చుకున్నారు. ఆ మెచ్చుకోలు మెంటాడకే చెందిన కళాకారుడు డొంకాడ రామ్మోహనరావు వరకూ చేరింది. ఆయన ఆ ప్రాంతంలో పేరొందిన హార్మోనిస్టు. ఎన్నో కళాబృందాలను తీర్చిదిద్దాడు. తెలిసిందే తడవుగా రఘును చేరదీసి బుర్రకథలు ఆడి, పాడటం నేర్పించాడు. రఘు అన్నయ్య ఈశ్వరరావు కూడా ఇక్కడే బుర్రకథ నేర్చుకున్నాడు. రామ్మోహనరావు సారథ్యంలో ఈశ్వరరావు హాస్యగాడిగా, రఘు సెంటరోడిగా, ఇద్దరు మహిళా కళాకారులు ఇతర పాత్రధారులుగా బాలనాగమ్మ బుర్రకథ బృందం ఏర్పడింది. ఉత్తరాంధ్రలోని చాలా గ్రామాల్లో, ఒడిశాలోని రాయఘడ ప్రాంతంలోనూ ప్రదర్శనలు ఇచ్చారు. దాదాపు 3 వేల చోట్ల ఆడి పాడి ప్రేక్షకులను అలరించారు.

పాటే బతుకు బాటగా ...

బుర్రకథ కళాకారునిగా మంచి పేరు వస్తున్న సమయంలో 2008లో రఘు అన్నయ్య ఈశ్వరరావు చనిపోయాడు. ఆ మనేదతో మరుసటి సంవత్సరమే తండ్రి కన్నుమూశాడు. దీంతో కుటుంబ భారమంతా రఘుపైనే పడింది. పాటే బతుకు బాటగా మారింది. 2015లో రఘు రేలారే రేలా పేరిట బృందాన్ని తయారు చేసుకున్నాడు. అనతికాలంలోనే ఈ బృందానికి మంచి గుర్తింపు వచ్చింది. ఈ క్రమంలో ఓ దినపత్రికలో వచ్చిన ప్రకటనను రఘు చూశాడు. 'నవ్వించే సత్తా మీకుంటే ఇదే సదావకాశం' అంటూ స్టార్ మా ఛానల్ యాజమాన్యం తాను రూపొందిస్తున్న 'గ్రేట్ తెలుగు లాఫ్టర్ ఛాలెంజ్' వీక్లీ షో ప్రకటన అది.

తెలుగు రాష్ట్రాల నుంచి 18 వేల మంది ఆడిషన్స్‌కు హాజరవ్వగా, 14 మంది ఫైనల్‌కు ఎంపికయ్యారు. అందులో రఘు ఒకడు. ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం మెయిన్ గెస్ట్‌గా శని, ఆదివారాల్లో ఆ షో స్టార్ మాలో ప్రసారమయ్యేది. అందులో చివరిగా ఓ జానపద గీతం కచ్చితంగా ఉండేది. ఆ పాటను రఘుతోనే పాడించేవారు. ఇలా హాస్యగానిగా, గాయకునిగా ముందుకెళ్తున్న తరుణంలో అనివార్య కారణాలతో ఆ షో నిలిచిపోయింది. రఘు తీవ్ర నిరాశ చెందాడు.

2020లో గాయని మంగ్లీ యాంకర్‌గా, గోరటి వెంకన్న, విమలక్క జడ్జిలుగా నిర్వహించిన జానపద గీతాల పోటీల్లో పాల్గొన్నాడు. ఫైనల్‌కు చేరాడు. 2021లో ఈటీవీలో ప్రసారమైన 'శ్రీదేవి డ్రామా కంపెనీ' షోలో ఉత్తరాంధ్ర జానపదాలతో దుమ్ములేపాడు.

సినిమాల్లో పాటలు ఇలా..

2022లో డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డి దర్శకత్వంలో వచ్చిన మా నాన్న నక్సలైటు సినిమాలో రఘు 'బుడి బుడి అడుగులతో కొడుకో నా కొడుకో.. గుండెమీద నువ్ తంతే కొడుకో నా కొడుకో' అన్న పాటను పాడాడు. ఆ సినిమా తెలంగాణకే పరిమితమవడంతో తగినంత గుర్తింపు రఘుకు రాలేదు. 'పలాస' సినిమాలో నక్కిలీసు గొలుసు, బావొచ్చాడోలప్పా.. బావొచ్చాడు అన్న పాటలను తొలుత ట్రయల్స్‌లో రఘుతో పాడించారు. వాటికి సంబంధించిన లిరిక్స్, ఇతర ఆధారాలు అన్నింటినీ ఆ సినిమా దర్శకునికి రఘు అప్పగించాడు. ఆ తరువాత ఏం జరిగిందోగానీ వేరొకరితో ఆ పాటను పాడించి సినిమా విడుదల చేశారు. రఘు బృందం తీవ్ర నిరాశ చెందింది. సినిమా రంగంలో ఇవన్నీ సాధారణమే అని తమలో తాము సర్దిచెప్పుకున్నారు. ఈ క్రమంలోనే రఘు టాలెంట్‌ను గుర్తించి కోటబొమ్మాళి పిఎస్ సినిమా దర్శకుడు తేజ మార్ని తన చిత్రంలో పాడే అవకాశం కల్పించాడు. 'లింగి లింగి లింగిడి' అంటూ శ్రీకాకుళం యాసలో మంచి ఊపుతో సాగే ఈ పాటకు మాంచి మ్యూజిక్ తోడవడంతో విశేష ఆదరణ దక్కుతోంది. వాస్తవానికి ఈ పాటను రఘు 2019 నుంచి జనంలోకి విస్తృతంగా తీసుకెళ్లాడు. ఇప్పుడు సినిమా అవసరాలకు తగ్గట్టు కొన్ని ముక్తాయింపులను ఇతరుల నుంచి తీసుకుని వాటికి అందమైన అక్షర రూపమిచ్చి పాడాడు.

ప్రభుత్వ సహకారం కరువాయె..

రఘు దశాబ్దానికిపైగా కళారంగంలో రాణిస్తూ.. వందలాది వేదికలపై వేలాది బుర్రకథలు చెబుతూ, జానపద గేయాలు ఆలపిస్తూ.. జనాన్ని అలరిస్తున్నా ప్రభుత్వం నుంచి అతనికి ఎటువంటి సాయమూ అందలేదు. ఉత్తరాంధ్ర జానపదాలను జన బాహుళ్యంలోకి తీసుకెళ్తున్న అతనికి ప్రజాప్రతినిధుల నుంచి, సాంస్కృతిక, కళా శాఖల నుంచి ప్రోత్సాహం కరువైంది. రఘు తన ఇంట్లోనే ఓ గదిని స్టూడియోగా మలుచుకున్నాడు. మ్యూజిక్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకుని తన బృందంతో కొత్త కొత్త పాటలను జనంలోకి తెస్తున్నాడు. రఘు టివి పేరిట యూట్యూబ్ ఛానల్‌ను పెట్టి జానపద గీతాలు వదులుతున్నాడు. తనలాంటి పేద కళాకారులకు తెలుగు సాంస్కృతిక, కళా విభాగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకుంటే బాగుంటుందని, కళను మరింత విస్తృతంగా జనంలోకి తీసుకెళ్లే వీలుంటుందని రఘు అంటున్నాడు.

- కోడూరు అప్పల నాయుడు
94915 70765

తెలుగులో మొదలై .. హిందీలో వెలిగి ...



భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత నిష్ణాతులైన నటీమణుల్లో వహీదా రెహ్మాన్ (87) ఒకరు. ఈ ఏడాది ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే జీవన సాఫల్య పురస్కారం పొందిన సందర్భంగా ఆమెను అభినందనలు ముంచెత్తుతున్నాయి.

1936 ఫిబ్రవరి 3వ తేదీన జన్మించిన వహీదా... తన సినీ నటనా ప్రస్థానం తెలుగులో మొదలై, బెంగాలీ, హిందీ చిత్రాల్లో ఉధృతంగా సాగింది. ఆమె తన అసమాన ప్రతిభతో రాణించారు. ప్రేక్షకుల అభిమానాన్ని, అనేక అవార్డులను సొంతం చేసుకున్నారు. 1955లో తెరకెక్కిన 'రోజులు మారాయి' తెలుగు చిత్రంతో తెరంగేట్రం చేశారు. ఈ చిత్రంలోని 'ఏరువాక సాగారో రన్నో..' పాట ఆమెకు మంచి గుర్తింపు తెచ్చింది. తర్వాత 1956లో సీఐడీ చిత్రంతో బాలీవుడ్ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. తరువాత 'ప్యాసా', గైడ్' వంటి పలు సూపర్ హిట్ చిత్రాల్లో నటించారు. ఐదు దశాబ్దాల కాలంలో అన్ని భాషల్లో కలిపి 90కు పైగా చిత్రాల్లో నటించారు. 1972లో ఉత్తమ నటిగా వహీదా జాతీయ అవార్డును అందుకున్నారు. 1972లో పద్మశ్రీ, 2011లో పద్మభూషణ్ పురస్కారాలు పొందారు.

వహీదా రెహ్మాన్ నటించిన ప్యాసా (1957), కాగజ్‌కే పూల్ (1959), చౌద్విన్‌కా చంద్ (1960), సాహిబ్ బీబీ ఔర్ గులామ్ (1962), గైడ్ (1965) విజయం సాధించాయి. రామ్‌ఔర్ శ్యామ్ (1967), ఖామోషి (1969), రేష్మా ఔర్ షేరా (1971) చిత్రాల్లో నటనకు పురస్కారాలు అందుకున్నారు. 1970 ప్రారంభం నుంచి ఆమె ప్రధానంగా సహాయక పాత్రల్లో నటించారు. కబీ కబీ (1976), చాందిని (1989), లమ్హే (1991), త్రిశూల్ (1978), నమ్కీన్ (1982), నమక్ హలాల్ (1982), మషాల్ (1984), రంగ్ దే బసంతి(2006), ఢిల్లీ 6 (2009)లో నటించారు. 1994లో ఫిల్మ్‌ఫేర్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. తర్వాత నుంచి సినిమాల్లో అప్పుడప్పుడు మాత్రమే కనిపించారు. పేదరికంపై పోరాడుతున్న రంగ్ దే సంస్థకు అంబాసిడర్‌గా ఉన్నారు. వహీదా తాజాగా కమల్ హాసన్ విశ్వరూపం 2 నటించారు. ప్రస్తుతం ఆమె ముంబైలో నివసిస్తున్నారు.

డాక్టర్ కావాలనుకొని ...

తమిళనాడులోని చెంగల్‌పట్టులో దక్కనీ ముస్లిం కుటుంబంలో వహీదా జన్మించారు. ఆమె తండ్రి మహమ్మద్ అబ్దుర్ రెహ్మాన్, తల్లి ముంతాజ్ బేగం. నలుగురు కుమార్తెలలో వహీదా రెహ్మాన్ ఆఖరి అమ్మాయి. తండ్రి ఉద్యోగరీత్యా వారి కుటుంబం విశాఖపట్నం, విజయవాడలలో కొన్నాళ్ల పాటు నివసించింది. చిన్నతనంలో ఆమె, తన అక్కలతో కలిసి చెన్నైలో భరతనాట్యం శిక్షణ పొందింది. విశాఖపట్నంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్‌లో చదువుకుంది. ఆమె 17 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు 1951లో తండ్రి మరణించారు. డాక్టర్ కావాలనేది వహీదా కల, కుటుంబ పరిస్థితులు మారడంతో చెదిరిపోయింది. కుటుంబానికి తన వంతు సహాయం చేయడానికి సినిమా ఆఫర్లను అంగీకరించింది.

ప్రముఖ వైద్యుడు, సామాజిక కార్యకర్త అయిన ఆమె మేనమామ డాక్టర్ ఫిరోస్ అలీ నిర్వహించిన బ్రహ్మపూర్‌లోని గంజమ్ కళా పరిషత్‌లో నర్తకిగా ఆమె మొదటి ప్రదర్శన ఇచ్చారు. తరువాత తమిళ చిత్రం 'అలీబాబావుమ్ 40 తిరుదర్గలమ్'తో డ్యాన్సర్‌గా అరంగేట్రం చేశారు. కానీ, తెలుగు సినిమా రోజులు మారాయి (1955) మొదట విడుదలైంది. రోజులు మారాయి, జయసింహ తెలుగు చిత్రాలతో ఆమె నృత్యకారిణిగా ఆకట్టుకుంది. అభిజన్ (1962)తో బెంగాలీ చలనచిత్ర నిర్మాణంలోకి ఆమె ప్రవేశించింది. దీని తరువాత, ఆమె బాత్ ఏక్ రాత్ కీ (1962)లో హత్య అనుమానిత పాత్రలో నటించింది. రాఖీ (1962)లో తోబుట్టువుల గొడవలో చిక్కుకున్న అమ్మాయి, ఏక్ దిల్ సౌ అఫ్సానే (1963)లో సంతానం లేని మహిళగా నటించింది. 1974లో కమల్‌జిత్ (శశిరేఖిని)ని వివాహం చేసుకొంది.

ఈ అవార్డు వాళ్లకి అంకితం: వహీదా రెహమాన్

దాదా సాహెబ్ ఫాల్కే జీవితకాల సాఫల్య పురస్కారానికి ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందని వహీదా రెహమాన్ వ్యాఖ్యానించారు. ఈ విషయంపై ఆమె మీడియాతో మాట్లాడుతూ... 'నా నటనకు మరొక గుర్తింపు దక్కినందుకు ఆనందంగా ఉంది. ఎవరైనా అంకితభావం, నిజాయితీతో పనిచేస్తే తప్పకుండా దానికి తగిన ఫలితం ఉంటుంది. ఈ అవార్డును నా తోటి నటీనటులకు అలాగే సినీ రంగంలోని అందరికీ అంకితం చేయాలనుకుంటున్నా. ఇదంతా వారి వల్లనే సాధ్యం. ఈరోజు నేను ఈ స్థాయిలో ఉన్నానంటే దాని వెనుక ఎంతోమంది ఉన్నారు.' అని చెప్పారు. జీవితంలో ఏది సాధించాలన్నా ధైర్యం ముఖ్యమని, ఓటమికి భయపడి వెనుకడుగు వేయకూడదని అన్నారు.

తొలి పాటతోనే నీరాజనం



వహీదా రెహమాన్ తొలిసారి వెండితెరపై ఒకే ఒక్క పాటతో అద్భుతంగా మెరిసి, తెలుగు ప్రజల్లో చిరస్థానాన్ని పొందారు. అది రోజులు మారాయి సినిమాలోని 'ఏరువాక సాగారో రన్నో చిన్నన్న' పాట. దీనికన్నా ముందు ఆమె ఎన్టీఆర్‌తో కలిసి జయసింహ సినిమాలో నటించారు. అదింకా విడుదల కాకముందే – తాపీ చాణుక్య దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'రోజులు మారాయి' సినిమాలో ఒక కీలకమైన సన్నివేశంలో వచ్చే పాటలో నర్తించారు. పాట అద్భుతమైన వేగంతో, అందరికీ అర్థమయ్యే సాహిత్యంతో సాగుతుంది. అది రైతు జీవితానికి సంబంధించిన పాట. తెలుగు నాట కమ్యూనిస్టు ఉద్యమం, రైతాంగ పోరాటాలూ ఉధృతంగా సాగుతున్న కాలం. చక్కని జానపద బాణీలో కొసరాజు రాఘవయ్య ఈ పాటను సమకూర్చారు. మాస్టర్ వేణు స్వరాలు సమకూర్చారు. ప్రధాన నటులు నాగేశ్వరరావు, షావుకారు జానకి, ఇతర రైతులూ నాగళ్లకు ఎడ్లను పూన్చి, ఏరువాకకు సిద్ధమైన సందర్భంలో ఈ పాట మొదలవుతుంది. డప్పుల దరువుల మధ్య చూడచక్కని అభినయం, కళ్లు తిప్పుకోనివ్వని హావభావాలతో వహీదా నర్తించింది. ఆ ఒక్క పాటతోనే ఎందరో అభిమానులను సంపాదించుకొంది. ప్రపంచానికి అన్నం పెట్టే రైతులను ఉత్తేజపరుస్తూ సాగే ఈ పాట సాగు ప్రక్రియనూ కళ్లకు కట్టిస్తుంది. రైతుల ప్రాధాన్యాన్ని వివరిస్తుంది. ఈ పాట ఇప్పటికీ టీవీల్లోనో, ఎఫ్ఎం రేడియోల్లోనో హుషారుగా వినిపిస్తూనే ఉంటుంది. అయితే, రోజులు మారాయి, మారాలి అన్న ఆకాంక్షే ఇంకా నిజం కాకుండా ఉంది.

41 ఏళ్ల తర్వాత... ఈక్వెస్ట్రియన్‌లో స్వర్ణం

మూడోరోజు మూడే పతకాలు
19వ ఆసియా క్రీడలు

హాంగ్జౌ: ఈక్విస్ట్రియన్ టీమ్ విభాగంలో భారత్ 41ఏళ్ల తర్వాత స్వర్ణ పతకాన్ని సాధించింది. సుదీప్తి హజెలా, హదయ్ విపుల్, అనూష్ గార్వాలా, దివ్యకృతి సింగ్‌లతో కూడిన భారత బృందం ఈక్వెస్ట్రియన్ డ్రస్సేజ్ ఈవెంట్‌లో పసిడి పతకాన్ని సొంతం చేసుకున్నారు. భారత బృందం 209.205పాయింట్లతో అగ్ర స్థానంలో నిలిచింది. భారత్ చివరగా 1982లో ఈక్వెస్ట్రియన్ విభాగంలో బంగారు పతకం నెగ్గింది. ఆ తర్వాత ఈ విభాగంలో భారత్‌కు స్వర్ణ పతకం దక్కడం ఇదే తొలిసారి. 1982లో ఢిల్లీలో జరిగిన ఆసియా క్రీడల్లో రగ్వీందర్ సింగ్ వ్యక్తిగత ఈవెంటింగ్ విభాగంలో, రూపిందర్ సింగ్ బ్రార్ వ్యక్తిగత టెంట్ పెగ్గింగ్ విభాగంలో బంగారు పతకాలు సాధించగా, టీమ్ ఈవెంటింగ్‌లో కూడా గతంలో ఒక బంగారు పతకం దక్కింది. ఇక చైనా 204.882 పాయింట్లు, హాంగ్‌కాంగ్ 204.852 పాయింట్లతో వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచి రజత, కాంస్య పతకాలను దక్కించుకున్నాయి. ఇప్పుడు దక్కిన బంగారు పతకంతో కలిపి ఆసియా క్రీడల ఈక్వెస్ట్రియన్ విభాగంలో భారత్ మొత్తం నాలుగు స్వర్ణ పతకాలు సాధించినట్లయ్యింది. దీంతో ఆసియా క్రీడల్లో భారత్‌కు దక్కిన బంగారు పతకాల సంఖ్య మూడుకు చేరింది.

సెయిలింగ్‌లో మూడు పతకాలు...

భారత సెయిలర్లు సత్తా చాటుతున్నారు. మూడోరోజు ఈ విభాగంలో భారత్‌కు ఏకంగా మూడు పతకాలు దక్కాయి. 17 ఏళ్ల నేహా ఠాకూర్ ఐఎల్‌సీఏ-4 ఈవెంట్‌లో 32పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకం సాధించింది. థాయిలాండ్‌కు చెందిన నొప్పసొరన్ కున్బ్బొంజన్ టాప్ స్కోర్‌తో స్వర్ణ పతకం గెలువగా, సింగపూర్‌కు చెందిన కీరా మేరీ కార్లైల్ 28 స్కోరుతో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఆ తర్వాత పురుషుల విండ్ సర్ఫర్ ఈవెంట్‌లో ఎబాద్ అలీ పతకం కాంస్య సాధించాడు. రేసులో 52 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. ఇక 24ఏళ్ల విష్ణు శరవణన్ పురుషుల డింగీ ఐసిఎల్ఎ-7 ఈవెంట్‌లో కాంస్యం దక్కించుకున్నాడు. సింగపూర్, దక్షిణకొరియా సెయిలర్లకు స్వర్ణ, రజత పతకాలు దక్కాయి. మూడోరోజు పోటీలు ముగిసే సరికి భారత్ పతకాల సంఖ్య 14 పతకాలతో 6వ స్థానంలో కొనసాగుతోంది.

హాకీలో సింగపూర్‌పై 16-1తో గెలుపు..

భారత పురుషుల హాకీ జట్టు విజయపరంపర కొనసాగుతున్నది. మంగళవారం జరిగిన గ్రూప్ లీగ్ రెండో మ్యాచ్‌లో భారతజట్టు సింగపూర్‌ను చిత్తుచేసింది. తొలి మ్యాచ్‌లో ఉజ్బెకిస్తాన్ 16-0గోల్స్‌తో ఓడించిన భారత్.. రెండో మ్యాచ్‌లో సింగపూర్‌పై 16-1గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. గోంగ్షు కెనాల్ స్పోర్ట్స్ పార్క్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఆద్యంతం భారత జట్టుదే ఆధిపత్యం. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ 4, మన్‌దీప్ సింగ్ 3, అభిషేక్ 2, వరుణ్ కుమార్ 2 గోల్స్ చేశారు. లలిత్ ఉపాధ్యాయ్, గుర్జంత్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్, మన్‌ప్రీత్ సింగ్, షంషేర్ సింగ్ ఒక్కో గోల్ కొట్టారు. సింగపూర్ తరఫున మహమ్మద్ జాకీ బిన్ జుల్కర్‌నైన్ 53వ నిమిషంలో కన్సోలేషన్ గోల్ చేశాడు. చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్.. డిఫెండింగ్ చాంపియన్ జపాన్‌తో 28న తలపడనుంది.

స్క్వాష్‌లో సునాయాసంగా..

స్క్వాష్ మహిళల విభాగంలో భారత్ అదరగొడుతోంది. మంగళవారం జరిగిన గ్రూప్-బి పోటీలో భారత్ 3-0 తేడాతో పాకిస్తాన్‌ను చిత్తుచేసింది. తొలి సింగిల్స్‌లో అనహత్ సింగ్ 11-6, 11-6, 11-3 పాయింట్లతో సదియా గుల్‌పై, రెండో సింగిల్స్‌లో జోష్నా చిన్నప్ప 11-2, 11-5, 11-7తో నూర్ ఉల్ హుడా సాదిఖ్‌ను ఓడించారు. భారత యువ సంచలనం తన్వీ ఖన్నా 11-3, 11-6, 11-3తో పాక్ క్రీడాకారిణి నూర్ ఉల్ ఐన్ ఇజాజ్‌పై వరుససెట్లలో నెగ్గింది.

'అనంత'లో సబ్ జూనియర్ జాతీయ ఫుట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సబ్ జూనియర్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు మంగళవారం అనంతపురం ఆర్‌డిటి మైదానంలో ప్రారంభమయ్యాయి. ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ పోటీలు అక్టోబరు 10వ తేదీ వరకు జరగనున్నాయి. దేశంలోని 19 రాష్ట్రాల నుంచి బృందాలు పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గౌతమి, ఎపి ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఏలూరు ఎంపి కోటగిరి శ్రీధర్, ఆర్‌డిటి ప్రాజెక్టు డైరెక్టర్ మంచూ ఫెర్రర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై మ్యాచ్‌లను ప్రారంభించారు.

దమ్మురులిపిన అస్సాం

ఆర్‌డిటి మైదానంలో ప్రారంభమైన సబ్ జూనియర్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో మొదటి రోజు నాలుగు మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో అస్సాం-హిమాచల్ ప్రదేశ్‌ల మధ్య జరిగిన మ్యాచ్‌లో అస్సాం టీమ్ ఏకంగా ఏడు గోల్స్ చేసి దుమ్ము దులిపింది. హిమాచల్ ప్రదేశ్ ఒక్క గోలైనా చేయలేకపోయింది. త్రిపుర-అండమాన్ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో త్రిపుర విజయం సాధించింది. త్రిపుర మూడు గోల్స్ సాధించగా అండమాన్ ఒక్క గోలైనా వేయలేకపోయింది. ఆంధ్రప్రదేశ్- సిక్కిం జట్లు, తమిళనాడు-బీహార్ జట్లు చెరో గోల్ వేయడంతో రెండు మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. మొదటి రోజు జరిగిన మ్యాచుల్లో రెండు ఫలితం రాగా, రెండు డ్రాగా ముగిశాయి.

పతకాల పట్టిక

వ.స.	దేశం	స్వ	ర	కా	మొ
1.	చైనా	53	29	13	95
2.	కొరియా	14	16	19	49
3.	జపాన్	8	20	19	47
4.	ఉజ్బెకిస్తాన్	5	6	11	22
5.	హాంకాంగ్	5	4	10	19
6.	ఇండియా	3	4	7	14
7.	ఇండోనేషియా	3	1	5	9
8.	చైనీస్ తైపీ	2	3	3	8
9.	థాయ్‌లాండ్	2	0	5	7
10.	ఇరాన్	1	4	5	10

స్వ:స్వర్ణాలు; ర:రజితం; కా:కాంస్యం మొ:మొత్తం

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68